UNIVERSAL
LIBRARY
OU_204391
UNIVERSAL
LIBRARY

శ్రీ

ప్రతిజ్ఞాశాంతనవము

అను

భీష్మప్రతిజ్ఞ

కృతికర్త:

ఆంధ్రవిశ్వకలాపరిషత్కళాశాలాంధ్రభాషాధ్యాపకులగు

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు

రెండవ కూర్పు.

కృతిపోషకులు

నూజవీటి రాజులలోనివారగు,

శ్రీరాజా రామచంద్రాప్పారాయ పుత్త్రులు నగు

శ్రీరాజా సింహాద్రిఅప్పారావు బహాదరుగారు

శ్రీరాజా రాజగోపాలఅప్పారావు బహాదరుగారు

కృతిప్రకాశకుఁడు

విద్వాన్ వారణాసి సూర్యనారాయణశాస్త్రి,

రాజమహేంద్రవరము.

రాజన్ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

ఇందు వచ్చు పాత్రములు.

సూత్రధారుఁడు; నటి.

దేవవ్రతుఁడు—గంగాశంతనుల పుత్రుఁడు, ప్రధాన కథానాయకుఁడు

చంద్రపాలుఁడు; సోమపాలుఁడు—సైనికులు.

జయసింహుఁడు—సేనానాయకుఁడు.

శంతనుఁడు—దేవవ్రతునితండ్రి, హస్తినాపురిరాజు.

పరశురాముఁడు—బ్రహ్మర్షి, దేవవ్రతునిగురువు.

గంగాదేవి—దేవవ్రతుని తల్లి.

వసుభూతి యజ్ఞతీర్థులు—శంతనుని మంత్రి పురోహితులు.

సూతుఁడు; నల్వురు బోయలు.

సత్యవతి—ఉపచరునికూఁతురు.

మాలిని—సత్యవతి పరిచారిక.

వసంతకుఁడు—విదూషకుఁడు.

శంకరుఁడు—యజ్ఞతీర్థుల శిష్యుఁడు.

బాహ్లికుఁడు—శంతనుని తమ్ముఁడు.

జయసేనుఁడు—రెండవ సేనానాయకుఁడు.

వందిమాగధులు—స్తోత్రపాఠకులు.

వీరసేనుఁడు, శూరసేనుఁడు—దాశరాజుభటులు.

పద్మావతి—సత్యవతి పెంపుడు తల్లి.

దాశరాజు—సత్యవతి పెంపుడుతండ్రి.

మనోరమ—సత్యవతి చెలికత్తె.

కౌరవసామ్రాజ్యసభ్యులు కొందఱు.

సుమిత్రుఁడు—దాశరాజుమంత్రి.

సామంతులు కొందఱు.

శ్రీరస్తు.

ఓం నమః పరబ్రహ్మణే.

ప్రతిజ్ఞాశాంతనవనాటకము

ప్రథమాఙ్కము.

నాంది.

ఉ. శ్రీమదనాదిమధ్యలయశీలుఁడు కల్పితనామరూపసూ
యామయసర్గకర్త నిఖిలాంతరవర్తి చిదాత్మ సాక్షి వి
ద్యామహిమాత్మతత్త్వవిదసన్న్యుఁడు సన్మయుఁ డద్వితీయ ది
వ్యామృతతేజుఁ డైన పరమాత్ముఁ డఖండసుఖంబు మీ కిడున్.

[నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి]

సూత్ర—(తెరవంకఁ జూచి) ప్రేయసీ! చీర సింగారించికొను నప్పటి కూరు మాఁటుమణఁగును గాఁబోలు!

నటి—(వచ్చి) నాథా! నన్నుఁ బిలిచిన యంత తొందరపని యేమి?

సూత్ర—ఈ సింగారములోఁ బ్రకృతప్రసంగము మఱచితివి కాఁబోలు! చూడవా యేమి ? నేఁడు పుణ్యావసరం బగుటఁ బవిత్ర చరిత్రాత్మక రూపక ప్రదర్శనంబున నానందింపఁ బండితపామరసాధారణంబుగ సకలవర్ణంబులవారు విచ్చేసి యథోచితంబుగ సుఖాసీనులై సభ నలంకరించి యుండిరి.

నటి—అవు నవును. కాని యీమహాసభను రంజింపఁజేయు నంతటి యుత్తమచరిత్ర మేదో యాలోచించితివా?

సూత్ర—ఆలోచన కే మున్నది ? శ్రీపరమేశ్వరవిలాసబీజోద్గతంబు చతుర్వేదప్రకాండభాసురంబు చతుర్వర్గశాఖావిరాజితంబు పవిత్రచరిత్రఫలపరిశోభితంబు నగుమహాభారతకల్పకంబు కన్నులపండువుగాఁ గానవచ్చుచుండ మన కొక్క పుణ్యపురుష కథామృతఫలంబు నకుఁ గొఱంత వచ్చునా?

నటి—ఆమహేతిహాసమున నెందఱో మహానుభావులు గలరు. వారిలో నెందఱచరిత్రములో రూపకము లయినవి. వానిలో నేదో యింకను నిశ్చయములేదు. రూపకనిర్ణయ మగు నప్పటికిఁ దెల్లవాఱును గాఁబోలు!

సూత్ర—(నవ్వి) బదులు దీర్చుకొంటివని మురియు చుంటివా? అట్లయిన వినుము. మహాభారతవీరాగ్రేసరుండు లోకహితార్థజీవనుండు శాశ్వతబ్రహ్మచర్యపవిత్రచరిత్రుండు నుభయలోకకీర్తనీయుండు నగు భీష్మునిచరిత్ర మిపుడు ప్రదర్శనపాత్ర మని యిదివఱకే నిశ్చయించి కొని యుంటిని.

నటి—(నవ్వి) ఈ మాట యంతకంటెను బాగుగా నున్నది. భీష్మచరిత్ర మన్న నెంతయో కలదు. అ దంతయు నభినేయముగా సమకూర్చికొని ప్రదర్శించుట యింతలో శక్య మగునా?

సూత్ర—ఓసీ వెఱ్ఱిదానా! ఇపుడు భీష్మకథాభాగముల నెల్ల సమకూర్చి ప్రదర్శింపఁ దలఁచితి ననుకొంటివా ? ఎఱుఁగవా ? రాజ్యత్యాగబ్రహ్మచర్యప్రతిజ్ఞాత్మకమైన శాంతనవచరితము వీరరసప్రధానమైనరూపకమై సిద్ధముగా నున్నది. మన నర్తకులును దానిని జదివి సిద్ధముగా నున్నారు.

నటి—(జ్ఞప్తివడసి) ఏదేది ? భీష్మప్రతిజ్ఞయను నామాంతరము గల ప్రతిజ్ఞాశాంతనవమా?

సూత్ర—అవును. ఆకవి:—

సీ. శ్రీరాజగోపాల కృష్ణయాచేంద్రమ
హారాజపోషితుఁ డైనవాఁడు
శ్రీరాజగోవింద కృష్ణయాచేంద్ర స
త్కారపాత్రం బయి తనరువాఁడు
శ్రీరాజసురభిలక్ష్మారాయ నరపాలు
నాదరంబునఁ దనరారువాఁడు
శ్రీరాజనారయప్పారాయ సింహాద్రి
రాయసత్కృతి నలరారువాఁడు

గీ. సమధిగతశబ్దవేదాంతశాస్త్రసంస్కృ
తాంధ్రసాహిత్యసత్కవితాంచితుండు
గద్యపద్యాత్మకానేకకావ్యకర్త
యైన మల్లాది సూర్యనారాయణకవి.

మ. ధర జన్మించిన ధర్మమూర్తి యనఁగా ధర్మాప్పరాయైన యా
నరసింహక్షితినాథువంశమున నెన్నంగా రామచంద్రావనీ
శ్వరసత్పుత్రులు నారయప్పధరణీపాలుండు సింహాద్రిభూ
వర గోపాలమహీశు లాదరము జూపం జేసె నేతత్కృతిన్.

నటి—అవునుగాని యిప్పుడీనూతననాటకము ప్రదర్శింప నేల?

సూత్ర—ప్రథమప్రదర్శనసమయంబున నన్నియుఁ గ్రొత్తవే. నూతనత్వము గూడఁ గావ్యమున కొకదోషమా ?

నటి—అది గాదు. ప్రయోగశుద్ధిని గాంచినది గాదు గావునఁ జూపఱకు రంజకం బగునో గాదో యని య ట్లంటిని.

సూత్ర—ఆమూలాగ్ర మొక్కరీతిని రూపక మన్నివిధముల

సభారంజకం బగునట్లు రచియించుట యను మహాభాగ్యము విశేష ప్రతిభాశాలులకుఁ గాక యెల్లరకు సంభవించునా? కావుననే కావ్యములలో దృశ్య ముత్తమ మని ప్రాచీనులు వ్యవహరించిరి. ఈ యంశమును దలంచియే యీకవి రూపకము నిట్లు ప్రశంసించె.

ఉ. "వీనులవిందు కన్నుఁగవవేడుక నాలుకతీపి యై కథా
ధీనము గాఁగ బుద్ధి, రసదీప్తము గాఁగ మనంబు, మేను భా
వానుగతంబు గాఁగఁ గరినాత్మున కేని ముదంబు నీతి వి
జ్ఞాన మొసంగుకావ్యము నిజంబుగ రూపక మెంచి చూడఁగన్."

నటి—ఆఁ! దారికే వచ్చితివి. ఈలక్షణమున కీరూపకము లక్ష్యముగా నున్నదా?

సూత్ర—అది ప్రదర్శించినపిదప సభాసదులు చెప్పఁదగినమాట.

నటి—అందుకే య ట్లంటిని. ఈకృతి యె ట్లుండునో? మన మె ట్లభినయింతుమో?

సూత్ర—ఏ మయినం గానిమ్ము.

చ. మనకృతి శైలియున్ మనసమర్థతయున్ సభలోనిపెద్ద లా
ననుదనుకన్ మనంబునురియాడుట తప్పునె? చూడు మస్త్రవి
ద్యను గడిదేఱినట్టి యమరాపగసూనునియంత ధీరుఁడే
తనశరసేతు వొజ్జమది దన్పునొకో యని కొంకుచుండఁగన్.

(అని నిష్క్రమింతురు.)

ఇది ప్రస్తావన.

రంగము:—జాహ్నవీతీరసైకతము.

[అంత గంగాప్రవాహమున కడ్డముగా శరసేతువు నిర్మించుచుఁ గార్ముకక్రీడ సలుపుచున్న గాంగేయుఁడగు దేవవ్రతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దేవ—ఇంక నీ పదిబాణములతో నీబాణసేతువు సమాప్తినొంది నీటిజాలును బూర్తిగా నిలుపవలసినదే (అట్లు చేసి చిఱునవ్వుతో) సెబాసు! మొదలుపెట్టినపని తుద ముట్టినది. అంపకట్టయు సూత్రిపట్టిన తెఱఁగున సొంపు మిగిలి వజ్రలేపము చేసిన ఱాతిగట్టుకైవడిఁ గడు దట్టమై చీమ దూఱుటకైన సందు లేక యున్నది. (ఏటివంకఁ జూచి తల పంకించి)

శా. అమ్మా జాహ్నవి! నీవడిం దగిలి పొర్లాడుచున్ మహాగండశై
లమ్ముల్ చెట్లును జాఁపకట్టువడు వ్రేళ్ళంగూడి, యట్లయ్యు ని
యమ్ముల్ పన్నినకట్ట నిల్చుటకు నీ యత్యంత పుత్రానురా
గమ్మో మద్గురువర్యు దీవనయొ ముఖ్యంబైన బీజం బగున్.

(సేతు వెక్కి) బళీ! దీనిఁ ద్రోసికొని పోఁజాలక నీ రంతయుఁ బూనుకొని పొంగి పొరలి యీకట్టపైనుండి ప్రవహించుచున్నది. ఔరా! శరసేతునిర్మాణవిధాన మెంత విచిత్రమైనది! దీనిని గాంచి నాగురుండిది శాస్త్రవిహితముగా నున్నదని యభినందించునో లేక యేదేని లోప మరసి నిందించునో చూడవలసియున్నది. ఆయనయు నిత్యకర్మానుష్ఠానమైన వెంటనే యిట విచ్చేయును. (ప్రొద్దువంకఁ జూచి) ఆఁ! అపుడే దాదాపు జాము ప్రొద్దెక్కినది. గురుండు తపస్సు చాలించు వేళ యయినది. (సంతోషముతో నటునిటుఁ దిరుగుచు)

మానిని. భూరిదయానిధి యోగతపఃపరిపూర్ణుఁడు నిర్జితసర్వజగ
ద్వీరుఁ డుదారుఁడు నాగురు వర్యుఁడు దెల్పెను 'తప్పక యస్త్రకలా
సారము బ్రాహ్మము నారాయణమును జక్కఁగనేర్చెద నేఁ'డనుచున్
దీరెద నే ధనురాగమదీక్షను దేటెద దేశికశిక్ష నికన్.

(అంతఁ దెరలో దుందుభిధ్వనియుఁ బిదప)

ఉ. భారతవంశభూషణుఁడు బాహుపరాక్రమదాంతిపక్షిమో
ద్వీరమణుండు శంతనుఁడు వెల్వడె దిగ్విజయేచ్ఛ, జాహ్నవీ
తీరపువీరులార! యరుదెంచెదరా యరియప్పసంబులన్
గౌరవబుద్ధి నీయ ? నటు గాక రణం బొనరింప వత్తురా ?

దేవ—(గట్టువంకఁ జూచి) ఆహా ! శాంతిపావనంబు లగు నాశ్రమంబు లేమి! ఈవీరఘోషణ యేమి ? (సేతువు దిగి వచ్చి నిలిచి) శంతనుఁడు దిగ్విజయంబునకు వెల్వడెనా ? ఓహో! తాపసాశ్రమములను గాఢారణ్యములును విజయమున కాపణములు గాఁబోలు!

(మరలఁ దెరలో దుందుభినాదము)

దేవ—(నాలుగడుగులు నడచి తెరవంకఁజూచి) ఆఁ! తొండముతోఁ బతాకఁ దాల్చినమదగజము ముందు వచ్చుచున్నది. (పతాకం బరిశీలించి) దీనిపై యక్షరపంక్తియేమి!—శ్రీమద్రాజాధిరాజపరమేశ్వర కౌరవేశ్వర శ్రీశంతనుచక్రవర్తి దిగ్విజయపతాక (భారతవంశేత్యాది పద్యము చదువును.) (మరలఁ దెరలో)

ఉ. భారతవంశభూషణుఁడు (అనుపద్యము చదువఁబడును.)

దేవ—ఏమి! జాహ్నవీతీరవీరు లందఱు నరియప్పసము లీవలయునా? లేకున్న యుద్ధమే సిద్ధమా? అట్లయినచో నేనుగూడ జాహ్నవీతీరవీరుఁడనే 'వీరులార' యని నొక్కి వక్కాణించుచుండ విని యూరకుండుట వీరధర్మము గాదు. నా యస్త్రవిద్యకుఁ బ్రయోగకాల మాసన్న మయినది గాఁబోలు ! చేతనైనచో శస్త్రాస్త్రముల గౌర

వింపవచ్చును. చేతఁగానివో నుటజమందలి కందమూలఫలాదుల సంభావింపవచ్చును. అంతియ కాని పిలుపు వినియుఁ బిఱికివానివలె డాఁగి యుండుట యుచితము గాదు. (తెరవైపు చూచి బిగ్గరగా) ఓమావటులారా !

ఉ. ఊరును బల్లెయాశ్రమము నుగ్రవనంబును నాక వేడ్కమై,
వారణ మెక్కి దుందుభిని బాఁదినమాత్రఁ బ్రతిష్ఠ వచ్చునే,
వీరులు గల్గిరేని మునివీథుల నైనఁ బ్రతిష్ఠ నొందఁగాఁ
గోరక యేని మీ విభునకుం గలఁ డొక్కఁడు వీరుఁ డియ్యెడన్.
(పరిక్రమించును.)

రంగము:— జాహ్నవీతీరము.

(తెరలో నీ క్రింది సంభాషణము.)

ఎవఁ డితడు ?

ఎవఁడైన నేమి? ఎందయినఁ బెట్టివాఁ డుండవచ్చు ననియే మనసేనాని సర్వత్ర చాటించుచుండవలయు నని యాజ్ఞాపించె.

కానిం డితఁ డెవఁడో చూతము.

దేవ—ఓరీ ! స్థానాస్థానములు విచారింపక నోటికి వచ్చినట్లు వదరుచుంటిరి. ఎవ రయిన నిట్లు పలుకుదురో తెలియకుంటిరా? ఎవఁడా మీకు? ఎవఁడో చూచెదరు గాక రండు.

[అంత ధనుర్ధరు లగు నిరువురు భటు లొకవంకనుండి ప్రవేశింతురు.]

దేవ—(తెరవంకఁ జూచి) వీరులమూఁడ్కి నెరయించు నిర్విజయ పతాకను ముందుగాఁ గూలఁగొట్టి తెచ్చి శరసేతువుకడఁ బ్రతిష్ఠించి

తరువాత వీరితో ముచ్చటించెదఁ గాక (అని యమ్మ్మ విడుచును.)
(తెరలో ఘీంకారము) అయ్యో! సోమపాలా! ఱుక్కము కూలినది. పసుఁగు వశము తప్పినది. రమ్ము. రమ్ము. (అను కేకలు)

(దేవవ్రతుఁడు యవనికాంతరితుఁడై వెడలి ఱుక్కము తెచ్చి యథోక్తముగా నిలిపి భటుల కెదురువచ్చును.)

సోమ—చంద్రపాలా! మాటలోనే మహాప్రమాదము సంభవించినది. చూడఁగా నీబాలుఁడు మునివేషధారి యయ్యు మహాసాహసుఁడు గొప్పవిలుకాఁడు గాఁ గానవచ్చు. కానిమ్ము చూతము. ముందుగా నీ వం దేగి మాసటేంద్రశిభయ మిచ్చి యీ వార్త సేనాని కెఱిఁగించి వేగ రమ్ము.

చంద్ర—సరియే. ఈబాలునిమాత్రము దాఁటఁ బోనీకు. చిటికలో సేనాని నిందు పంపెదను. (అని వెడలును)

సోమ—(పరిక్రమించి తనలో) ఆహా! ఈ బాలునిముఖమా, బాలసూర్యుని గేలి సేయుచున్నది. వేషమా, వీర శాంతిరసముల యేకీభావమే. ఇతఁ డెవ్వఁడై యుండునో (ధైర్యముతోఁ బ్రకాశముగా) మునికుమారా! నీచిన్నతనపుఁజేష్ట లిఁకఁ జాలును. నిన్నుఁ జూడ జాలి వొడముచున్నది. ఇపు డయిన విజయధ్వజము విడిచి నీ దారిని బోయెదవా, నీమర్యాద నీకు దక్కును. లేకున్న మాసేనాని చండశాసనుఁడు. నీచేసినయపరాధమును కతఁడు తగినప్రతిక్రియ చేయక్షమవిడువఁడు.

దేవ—అట్టి మహాశూరుని దర్శనముకంటె నాకు వేఱేమి భాగ్యము కలదు. రానిమ్ము చూచెదను.

సోమ—బాలకా! నామాట నీచెవి కెక్కకున్నది. నీవు బ్రాహ్మణుఁడ వని కరములు జోడింపఁదగునో క్షత్రియుఁడ వని శరములు జోడింపఁ దగునో తెలియకున్నది.

దేవ—చేతనైన శరములు. లేకున్నఁ గరములు

(తెరలో) సోమపాలా! మునిపుత్రుని బోనీకు. ఇదిగో సేన సమీపించె. సేనానాయకుఁడగు జయసింహుఁడును వచ్చుచున్నాఁడు.

సోమ—మునిబాలా! మాచంద్రపాలునిమాట వింటివా!

చంద్ర—[ప్రవేశించి] మునిపుత్రా! నావలన నీయాగడము వినిన జయసింహుఁడు సపరివారుఁడై దాపునకు వచ్చె. అసమానునితోఁ బోరు తగదని మానాయకుని మానతి కెదురుచూచితిమి గాని లేకున్నఁ బత్రాకఁ గొనినయప్పుడే నీమద మణఁగించి యుందుము.

దేవ—ఓరీ! మీ రబల లని తలఁచియే మీ తెలివిమాలినమాటలకుఁ జెవి యొగ్గితిని గాని లేకున్న నింతకు మున్నె మీనోరు మూయించి యుందును.

సోమ—ఈయక్కఱమాలిన మాట లెందుకయ్యా! అయిన దేమో యయినది. ఇప్పుడయినఁ నామాట విని వెడలి పొమ్ము.

చంద్ర—ఏమంటివి! నోరు మూయింతువా?

(భుజముమీఁదివిల్లు చేతఁ గొనును.)

(తెరలో) సోమపాలా! రావయ్యా! తొండమునకు నాటిన ములికె నూడఁదీయ నీయక యేనుఁగు సినమెత్తినట్లు చిందులు ద్రొక్కుచున్నది.

సోమ—ఇదిగో వచ్చితిని. చంద్రపాలా! యేమి చేసి వచ్చితివి?

(అని వెడలును)

చంద్ర—నీవు పోయి దానియలుగు నూడఁదీయుము. నే నితని మేన ములికి నాటెద. (వి ల్లెక్కిడఁ బోవును.)

దేవ—(పరిహసించి) కరికరముమీఁదిశరము దీయలేని నీవంటి

యనఘ్యుని పై మరల విల్లు పట్టుట వీరధర్మము గాదు. (అని స్తంభన మంత్రము ధ్యానించును.)

చంద్ర—(నారి లాగఁబోయి చేతు లాడక గిజగిజలాడి పండ్లు గిటగిటఁ గొఱికి) ఆఁ! ఊఁ! ఓరీ గారడిఁడా! ఏవో తుచ్ఛమంత్రములు నేర్చుకొని యెగురుచున్నావా! నాదగ్గఱనా నీకనుకట్టువిద్య?

(అట్లె యావింటితోఁ బొడువఁ బోవును.)

దేవ—(ఆవింటికొన పట్టి)

గీ. కండకావరమునఁ గన్ను గాన రాక
యెవఁ డితం డని వదరితి వీవ కావె?

(ముందువెన్కలకు ముమ్మాఱు గుంజును)

చంద్ర—ఉండు. ఉండు. హు. హు. హు.

దే—హుంకరించెద వేలరా పెంకెవాఁడ!

యింక నైనను నీపొగ రింక లేదె? (అని గెంటును.)

చంద్ర—సోమపాలా! రా. రా. (అని యొకమూలఁబడును.)

సోమ—(ప్రవేశించి) భయము లేదు. జయసింహుఁడు వచ్చె. (తిరిగి చూచి) అయ్యో చంద్రపాలా! పడిపోయితి వేమి?

చంద్ర—నాచేతు లాడ కున్నవి. నన్ను లేవ నెత్తుము.

సోమ—(వాని లేవనెత్తి జనాంతికము) ఓరీ! ఇతఁడస్త్రవిద్యా పారంగతుఁడు సుమీ!

చంద్ర—పోరా. అస్త్రవిద్య లేదు గిస్త్రవిద్య లేదు. గారడి వాఁడో విప్రవినోదియో.

సోమ—చీచీ! ఆరూప మైనఁ దెలియదా? (పరిక్రమించి) ముని కుమారా! జయసింహునిబారిఁ బడక తప్పించుకొని పో, నామాటవిను.

దేవ—నీదయకు సంతసించితిని. అతనిఁ జూచి పోయెదను. (భుజముమీఁది విల్లు చేతఁ బట్టును.)

[తెరలో] రండు రండు. పాఱిపోకుండఁగ నాకుజ్జ్వానిని ముట్టడింపుఁడు. (గొప్పకలకలము ఏఁడీ,ఏఁడీ, ఆకావిబట్టగూడ కట్టువాఁడా?

(విండ్లు మ్రోఁగును)

దేవ—ఓహో! విస్ఫారము వీనుల విం దగుచున్నది. దీనికి నా వింటిమ్రోఁతచే స్వాగత మొసఁగెదను. (అని వెడలును.)

(తెరలో) అబ్బా! చూచుటకు నెవ్వఁడయిన లేఁడు గాని మన కెదురై నారిమ్రోఁగించుచున్నాఁడు రా. ఓబాలకా! ఉండు ముందుము.

(మరల విండ్లమ్రోఁత.)

సోమ—అకటా! ఏదో ప్రమాదము వాటిల్లనున్నది. లేకున్న ధనుర్వేదము మూర్తీభవించి నట్లున్న యీదారకుఁ డెదు రగునా? (తెరవంకఁజూచి) ఔరా! చంద్రపాలా! చూచితివా?

ఉ. దారులు తీఱి సైనికు లపారశరంబులు చిమ్మ, వాని ని

ష్ఠూరుఁడు తొమ్మిదమ్ములను ద్రెళ్ళిడిఁ దుత్తునియల్ పొనర్చెరా

చంద్ర—(చూచినంతనిక్కగంటిడి చేతులాడకయుండఁగి) అయ్యో! ఇఁక నేమున్నది! ఛీఛీ!! నే నెందులకుఁబోనేల? (తెరలో మహాధ్వని)

సోమ—ఔర! మహాప్రమాద మసిలాస్త్రముబారికిఁ జిక్కి సైనికుల్

బూరుగుదూదియ ట్లగిడి పోయిన వ్రలఁడ గుంపుగుంపులై.

[తెరలో] తాపసపుత్రా! తొందరపడకు. సమానునితోఁ బోరాడుము.

సోమ—సేనానిమాట విని యతఁ డిటు వచ్చుచుండె.

దేవ—(వచ్చి) నీవా జయసింహుఁడవు? తొందరయణఁగినదిరా!

జయ—[ప్రవేశించి] చంద్రపాలా! విల్లెక్కువెట్టకుము. నిమిష మాత్ర ముందుము.

చంద్రి—(లజ్జచేఁ దల వంచికొనును.)

సోమ—(చిఱు నవ్వు నవ్వును.)

జయ—(దేవవ్రతుని జూచి తనలో) ఆహా! దివ్యతేజోమూర్తియగు నీబాలు నెట్లు పలుకరింపఁ దగునో తెలియకున్నది. (ప్రకాశముగా) మునితనయా!

ఉ. ఏయది నీకులంబు? గురుఁ డేఘనుఁ డెవ్వారివాఁడ వీవు? పే
రేయది? నట్టికయ్యమున కిట్టులు రాఁ గత మేమి?—

దేవ— ... ... నేను గాం
గేయుఁడ జామదగ్న్యమునికిం బ్రియశిష్యుఁడ బొబ్బ వెట్టి న
న్నా యిభవోదకుల్ పిలిచి గయ్యది నట్టిదో లేక గట్టిదో!

జయ—(తనలో) ఆహా! జననమా, పరమపావనము. ముఖతేజమా, నిరుపమానము. అస్త్రమహిమమా, అసాధారణము. గురుశిక్షయా, లోకోత్తరము. సింహాహ్వానము విని విజయపతాకను గొనియుండ నీతనిశౌర్యధైర్యంబులు విమర్శింప నేల? ఇతఁ డేకాకియని యుఁగుమారుఁ డనియు శంకింపనేల? అయినను నిట్లని చూచెదను. (ప్రకాశముగా) గాంగేయా! బాల్యచాపలంబున బలవద్విరోధము దెచ్చుకొంటివి. నీవే విలుకాఁడవు గావు, నీవే యస్త్రవేత్తవు గావు. అసహాయుఁడవు బాలుఁడవు బ్రహ్మచారివి నీ వెక్కడ? సకలసామంతమూర్ధన్యుఁడగు శంతనుచక్రవర్తియెక్కడ? ఏ మని తలఁచితివి? ఇంతటితోనైన విరమించి నీపని చూచుకొమ్ము పొమ్ము.

దేవ—జయసింహా! పెద్దవాఁడవు దయాళుఁడవు. నోరుగలవాఁడ వయినందు కేదో చెప్పితివి. ఇఁక నీదోషము లేదు. కాని మిక్కిలి ప్రొద్దెక్కుచున్నది. నాకార్యవేగము కాలయాపనము సహిం

పము. కావున యుద్ధము చేయువా రెవరో చెప్పుము. నీవా లేక మీ రాజా ?

సోమ—పట్టిబింకములు మానుకు. పశ్చిమదిగ్విజయము సమాప్తమయితేఁడు మా తేనికిఁ గుడిభుజ మని తలంపుము.

చంద్ర—నీపనిచక్కఁబెట్టుటకు మాతేఁడుగూడఁ గావలయునా?

జయ—(కోపముతో) సోమపాలా !

చ. ఎఱుఁగని వానిచిన్నతన మేనిసహించుట నీతిగాని యీ
మొఱకగువాని పిన్నతనముల్ సహాయించుట నీతి గా దిఁకన్,
దేవ—మొఱఁగెద వేల! మాటలకుఁ బోదునె? పశ్చిమదిగ్జయంబుచే
కుఱుచ నటం రమ్ము నీకు సమకూడును దక్షిణదిగ్జయం బికన్
జయ—పరుసము లేల త్రొక్కెదవు? బాలక! యంతకుదిక్కె దిక్కుగున్
గురుఁ డని జామదగ్న్యమునికుందరుఁ జెప్పిన ముప్పు దప్పునే?
దేవ—పరు వగుపల్కు పల్కితి సెబాసు బళీ! యటు చేసి మీమహా
వరుని ఋణంబు దీర్పఁ ఎగవా! జయసింహుఁడ! నేతిబీఱవా?

[తెరలో గొప్పకలకలము.]

దేవ—ఓహో! సైనికు లందఱు మరలఁ గూడి వచ్చి ఖిండ్లు మ్రోఁగించుచున్నారు. జయసింహా! యించుకసే పుండుము. ముందుగా వారిని జక్కఁబెట్టి వచ్చెదను. (అని వెడలును.)

జయ—గాంగేయా! సంఘము నెదిరింపకుము. వలదు. వలదు. యోధులారా! ఒక్కనితోఁ బెక్కండ్రు పోరాడ రాదు. (మరలఁ దెరలో జ్యానాదము) అయ్యో! వీరికి నామాట వినఁబడనే లేదు కాఁబోలు! (రెండడుగులు నడచి) ఛీ! ఎంద ఱయిన నేమి!, ఇతఁ డందఱ కన్ని తెఱఁగు లై యంపవాన కురియుచుండె. (తేఱిచూచి)

ఆహా! అస్త్రబలమే బలము. శరీరబల మేల సంఘబల మేల కాల్పనా?

చ. తెగఁబడఁ గాళ్లు, చేతులును దల్లడ మందఁగ; మేను లెంతయుఁ
బెగడుచునుండఁగాఁ, దలలు వాలఁగ, నొక్కనిమీఁద నొక్కఁడై
మిగుతలగుంపు లట్లు పుడమిం బడి రందఱు; కంపనాస్త్రముఁ
విడిచె నితండు—

(సత్వరంబుగఁ బరిక్రమించును.)

[తెరలో]......సేవలుకు నిక్కమిదే జయసింహా! వచ్చితిఁ

దేవ—[ప్రవేశించి] జయసింహా! వీరగోష్ఠికి విఘ్నముగావించు వారిబీర మణఁచి వచ్చితిని. ఇఁక నన్ను గెలిచి విజయపతాకను గొనినను సరియే, లేకున్న విడిచి పోయినను సరియే. కాలహరణము మాత్రము వలదు.

జయ—గాంగేయా! ఉపేక్షించినఁ గొలఁదిని నీగర్వోక్తులు హద్దు మీఱుచున్నవి. చూడు. (అని విల్లెక్కుడును.)

దేవ—మేలు మేలు. అద శూరపద్ధతి! అమ్ము గానిమ్ము.

[తెరలో] జయసింహా! త్వరపడకు. తపోధనులయెడ నపరాధము దగదు.

జయ—అదిగో మహారాజు రథము వచ్చినది.

(నారి సడలించును.)

దేవ—(తనలో) తపోధను లని యతఁడు దయ దలఁచెఁ గాఁ బోలు! వీరధర్మమున కిది విరుద్ధముగదా! కాక, యిది సమ్మానవచన మైనఁ గావచ్చును. తరువాత నెట్లయినను రాజగుట భక్తి చూపుట భావ్యమే. (ఎక్కు డించును.)

[అంత రథారూఢుఁడై శంతనుఁడు ప్రవేశించును.]

శంత—(రథావతరణ మభినయించి) ఛీ మూర్ఖా! చంద్రపాలా! చెప్పుచున్నను వి ల్లె క్కు వెట్టుద వేల?

జయ—(తిరిగి చూచి) చంద్రపాలా ! ఇంతకు మున్ను నేను జెప్ప లేదా?

సోమ—దేవా! ఈమునిబాలుని యస్త్రమహిమచే నితఁడు కొంతసేపటినుండి యిట్లు యుండెను. ఇతఁడే యన నేల? ఆయోధవర్గ మట్లూఁగి పడియుండె.

జయ—ఓహో! స్తంభనాస్త్రము ప్రయోగించెఁ గాఁబోలు!

శంత—[దేవవ్రతునిజూచి సవిస్మయంబుగఁ దనలో]

చ. పదిపదియేఁడు వర్షముల బాలకుఁ డేమి మహాస్త్రశస్త్రసం
పద గను టేమి?, భూవలయ పాలనసూచక దివ్యలక్షణా
స్పదుఁ డగు టేమి కాననముపా లగుటేమి?, మదీయ సేసలం
బొదవుట యేమి—వీనిఁ గని పొంగుట యేమి మనంబు నెమ్మమై?

దేవ—(తనలో) ఆహా! గురుదర్శనముమాడ్కి నీతని దర్శనమును నా మనస్సున శాంతి నెలకొల్పుచున్నది. ఈతనియెడ వినయము చూపుట యుచితమే యగును.

శంత—(తనలో) ఔరా ! కన్నులపండు వగు నీతని దర్శనమే మనసు గరఁగించుచుండ నిఁక నీతనిస్పర్శన మెట్లుండునో? ఆహా! ఏమీతనిప్రసన్న భీకరాకారసంపద! ఇతఁ డెవ్వఁడై యుండును? (పరిశీలించి) ఎవఁ డని శంకింప నేల?

సీ. తూణీరపట్టంబు తోలుజన్నిదమును
బేరురంబున కలంకార మిచ్చు

మౌర్వికారశనయు మౌంజీగుణంబును
గుప్పెఁడు నడుమున కొప్పొసంగు,
నాఱికాయలును జన్నారితామర పూస
తెగుబుజంబులకును సొగసు దీర్చ,
నాజానుబాహువు లరుణ ప్రసన్నవి
క్షణము లంగద్యుతి సంతసించు,

గీ. నిన్నియును జూడఁ జూడ నీచిన్ని బాలుఁ
డస్త్రవిద్యారహస్యంబు లభ్యసింప
నిష్ఠసంబుఁ నొక్కముసంబ్రముఁ గొల్చు
క్షత్రియబ్రహ్మచారిగాఁ గానవచ్చు.

(ఆలోచించి) అట్లననేల! బ్రాహ్మణులలో ధనుర్వేదపారీణులై క్షాత్రవృత్తి నవలంబించినవారు లేరా? పరవీరభయంకరు లగు పరశురామాదులు బ్రాహ్మణులు గారా? (మరలఁ బరిశీలించి) కాదు కాదు. ద్విజాతిసామాన్యము లగు బ్రహ్మచర్యచిహ్నములను విడిచినచోఁ దక్కిన లక్షణము లన్నియు క్షాత్రమునే చాటుచున్నవి. కాని యితని నే మని పల్కరింతు? సమయమా, వీరరసాక్రాంతము. హృదయమా, వత్సలరసాక్రాంతము.

దేవ—(తనలో) ఇతఁడు బయలువెడలినపని యేమి! ఇప్పుడు వచ్చినప్రసంగ మేమి! ఈ యాలోచన మేమి, ఇదేమి వింత! చూడఁగా నీతనిమనస్సు మాఱుత్రోవ త్రొక్కినట్లు కనఁబడుచున్నది.

శంత—(మరలఁ బరీక్షించి తనలో) అబ్బా! ఒకసారి కన్న నొకసారి నాచూపే నామనస్సు నితనిలో గట్టిగా బంధించుచున్నది. ఇందు కేదో యెఱుఁగరాని పూర్వజన్మసంబంధమో స్మృతికి రాని

యిహాజన్మసంబంధమో కారణమై యుండవచ్చు. ఏమని తలంతు!

దేవ—(తనలో) అకటా యిదేమి యిక్కట్టు! నిష్కారణముగ జా గగుచున్నది. ఇతఁడు పూజ్యుఁడు భూనాయకుఁడు నగుట మన కతిథిగా నచ్చె నని మర్యాద చేసి మాటలాడుదు నన్న ముందుగా వీర గోష్ఠి యడ్డమైనది. హా! ప్రకృతప్రసంగ మెత్తి పల్కరింతు నన్న నీతనివదనము శాంతిరసమగ్నమై కన్పట్టుచున్నది. ఇప్పు డేమి చేయుదును! [తెరలోఁ గలకలము]

శాంత—జయసింహా! నీవు సోమపాల చంద్రపాలురతోఁ నేఁగి సైన్యముకడ నుండుము.

జయ—చిత్తము—(అని యట్లు వెడలును)

దేవ—(తనలో) ఈతనిఁ బల్కరించుట కిదే యదను. (ప్రకా)

చ. జననర! నీదుపల్కు విని చయ్యన నె క్కిడికట్టివిల్లు డిం
చినజయసింహు నాయెదిరిఁ జివ్వకుఁ బాపితి వింక నాకు నిం
దును బని గల్గు నొక్కొ? దయతో సెల విచ్చిన, వ్యర్థకాలయా
పన మొనరింప కేను గురుపాదులసేవకుఁ బోయి వచ్చెదన్.

శాంత—(తనలో) ఆహా! భావగర్భితములై ప్రసన్నగంభీరములై ముద్దులు మూటగట్టు వీనిమాట లెంత వీనుసొంపుగా నున్నవి? సెబాసు! నివురుఁ గప్పిననిప్పై వినయము గ్రమ్మిన వీరరసమై యలరారు నిజమైన ధీరోదాత్తహృదయము నేఁడు ప్రత్యక్షమైనది. అకటా! రూపమును గూడ మించి మేఘగర్జితము వోలు నీతని కంఠస్వరము మఱిమఱియు నామానస మాకర్షించుచుండ నీ ప్రసంగమున నితని కేమి బదులు చెప్పుదును? (ఆలోచించి) అయిన నిట్లని చూచెదను. (ప్రకాశముగా) తాపస కుమారా! దేశకాలపాత్రము లెఱుఁగక పోరికిఁ దొడం

గువాఁడట వీఱిఁడి గాని వీరుఁడు గాఁడు. చూతుము.

చ. నినుఁ గనినంత నామనము నెమ్మిఁ గరంగి పవిత్రమైనపా
వనితటి నొంటిమైఁ దిరుగు బాలకుఁ డాపసు బ్రహ్మచారి మా
ర్గానఁ దగ దంచు శాంతి గనె, రోసము చెందక దీని, కేమహా
మునిపరిచర్య సేయుటకుఁ బోయెదవో యెఱిఁగింపు వేడ్కమై.

దేవ—(తనలో) ఇతఁడు బదులు చెప్ప నుపక్రమించి నంతనే సన్నుతిపాడుచున్నాఁ డని శంకించితిని గాని యుపసంహార మా సందియమును దొలఁగించినది. (కొంచె మూహించి) అనుమాన మేల? కథయే మాఱినది. ప్రసంగ మడ్డముగాఁ దిరిగినది. ఇట్టియెడ నేకారణంబుననో తనయుద్యమము మఱచి కడు శాంతుఁడై మాన్యుఁడై కనుపట్టువీతనితో వీరాలాప మొనరింప నాకును నోరు రా కున్నది. కావునఁ గడపటిప్రశ్నమునకుమాత్ర ముత్తర మిచ్చెదను. (ప్రకాశముగా)

ఉ. వీరము శాంతముం గవిశిఖవేదము వేదము నొక్కరూపమై
ధారుణిఁ బుట్టెనట్టి పరతత్త్వవిదుండు జగంబునల్లడన్
బేరు ప్రతిష్ఠ గన్నమునివీరుఁడు కశ్యపధాత కెల్లభూ
భారమొసంగుదాత యగుభార్గవు మద్గురుఁ గొల్వఁ బోయెదన్.

శంత—మేలు మేలు! గురుశిష్యభావ మనఁగా నెంతయు నుచితమై యిట్లుండవలయును. లోకములో గురునకుఁ దగినశిష్యుఁడు, శిష్యునకుఁ దగినగురువును దొరకుట యరిది. భార్గవమహర్షి హిమాలయమునఁ దప మొనరించుచుండె నని విందుము. ఆమహాత్ముఁడు తనతో ధనుర్వేద మంతరింపకుండ లోకమున నిలుపుటకై యీతీరమున కరుదెంచెఁ గాఁబోలు! ఆహా! ఆమహామహునిపేరు వినుట నేఁడు సుదినము. (సంతోషముతో) పరశురామ శిష్యా!

క. నిను నే మని పిల్చెద? రభి
జన మెయ్యది? నిన్నుఁ గన్న జననియు జనకుం
డును నెవ్వరు? వీనులవిం
దొనరింపుము తెలియ నుల్ల ముబలాటపడున్.

దేవ—గీ. సకలలోకనమస్కృతచరణకమల
యైనమందాకినీదేవి కాత్మజుండ,
శరణ మీతీరమే నాకు జనకు నెఱుఁగ
వెలయ దేవవ్రతుం డని పిలుతు రిందు.

శంత—[తనలో] ఈతనిచరిత్ర మతివిచిత్రముగా నున్నది. త్రిలోకపూజ్యురాలగు మందాకిని తల్లియఁట! ఈతీరమే నిలయమఁట! కాని గంగాదేవి కితఁ డెట్లు పుట్టెనని సంశయ మగుచున్నది. (ఆలోచించి) దీని కే మున్నది? కామరూపిణి యగునాదేవి విలాసార్థము కొంత నడి మానవరూపధారిణియై విహరించి యుండవచ్చు. (స్మృతి నభినయించి) వీనివయస్సు, పదియాఱేండ్లకు మించదు. నే నిందు నివసించి వెళ్ళియుఁ బదునాఱేండ్లయినది. (అని సాభిప్రాయముగా దేవవ్రతుని జూచి) ఔరా! వీనిమొగము చూడఁ జూడ, నన్నుఁ గూడి క్రీడించిన నాఁటిజహ్నుకన్యముఖకమల మిపుడు సరిగాఁ గన్నులయెదుటఁ గన్పట్టు చున్నది. (కన్నీరు విడిచి) హాదేవీ! జాహ్నవీ! నాఁడు మన కుదయించిన యష్టమపుత్రుఁ డితఁడుగాఁడా? (మనోవికారమభినయించి) హాప్రేయసీ! రమ్ము. కుమారునిగాఁగిలింపుము (స్మృతిదెచ్చికొని) అకటా! యీప్రసంగమునఁ జిత్తము పూర్వసమాగకాలాయత్తమగుటఁ బ్రమాద

మొనరించితిని. దేవతలకుఁగూడ దేవత యై విలసిల్లు నమ్మహనీయురాలి నిట్లు పేర్కొని యపచార మొనరించితిని. జాహ్నవీ! క్షమింపుము. (అని గాంగేయుంజూచి) నిజముగా నితఁడు నాపుత్రుఁడే (చిత్త ముప్పొంగ) సందియ మేల? జనకుఁ నెఱుఁగ ననుటయే యిందుకుఁ దార్కాణము. ఇతఁడు పుట్టినంతనే యిచటు విడిచి పోయి యింతదనుక మరల నే నిందు రానయితిని. అట్టియెడ న న్నితఁ డెట్లెఱుంగును? దీని కంతకును దేవవ్రతనామమే ప్రబలసాక్ష్య మిచ్చుచున్నది. 'దేవవ్రతుండయిన యిక్కుమారుండు పెరుఁగునంతకు నాయొద్దన యుండెడు' మని యాదేవి యపుడు న న్నొడఁబఱచుట యిపుడు స్మృతికి వచ్చినది. (ఆనందబాష్పము లొలుక) హాదైవమా! నాజన్మ మిప్పటికి ధన్యమైనదా? నాయనా కుమారా! ని న్నెట్లునమ్మింతు? ని న్నెపుడు గాఁగిలింతు? హాదేవీ జాహ్నవీ! అనుగ్రహింపవా?

దేవ—[తనలో] ఇ దేమి వింత! ఇతఁడు ని న్నెఱుఁగందినట్లుండె. అయ్యో! వీరము శాంతమై శాంతము కరుణమైనది. జాలి పుట్టించు నిచ్చటిపూర్వవృత్తాంత మేదియో యితని కిపుడు స్మృతికి వచ్చియుండును. నే నిపుడు చేయవలసినదేమి? నాగురుఁడు తపోనిష్ఠ చాలించి శరసేతువుకడకు వచ్చుచుండునేమో కదా?

[తెరలో] కర్ణామృతవృత్తము. (1)

రేమానస! మా మా చల మన్యే నిజతత్త్వం
తత్త్వంపదలక్ష్యం పరతత్త్వం ఘనసత్త్వం (2)
భూమాన మమానం పరమాత్మాన మసంగం
లీలాయితభూతాదికజన్మస్థితిభంగం

(1) 14 ఛందస్సు. ప్రస్తరింపఁగా 3277వ సమవృత్తమగును. లక్షణము మదియము. దిగ్దంతివిరామం తిసుసైర్భానగాభ్యాం యుక్తం కవివిత్తాంశ్చలకర్ణామృతవృత్తం

(2) ఈ రెండుపాదములు పల్లవిగఁ గ్రిందిజంటలు లయతాళములకు సరిపడును.

శంత—(మోమెత్తి చూచి) ఈశ్వరకీర్తనము వినవచ్చుచున్న దెక్కడ?

దేవ—రాజా! అదే, మా గురువులు వచ్చుచున్నారు.

పరశు—(ఒకవంకనుండి ప్రవేశించి పరిక్రమించుచు)

కర్ణా. జీవేశ్వరభేదాశ్రియ మాయేశ మదృశ్యం
బ్రహ్మాఽహ మితిజ్ఞానఫలీభూత ముపాస్యం
దృశ్యస్య తు కర్తార ముపాదన మనేకం
సచ్చిత్పరమానంద మరూపం విభు మేకం.

నాయనా దేవవ్రతా!

దేవ—(బిగ్గరగా) ఇదిగో వచ్చితిని. (మెల్లగా) రాజా! గురుసేవ యొనర్చి మరల వచ్చెదను. నాగమనము ననుమతింపుము.

శంత—ఆమహాత్ములసేవకు నన్నుఁ గూడ నంగీకరింపుము.

ఇరువురు—(పరిక్రమించి పరశురాముని సమీపింతురు.)

రంగము:—ఉటజప్రాంతము.

శంత—మునీంద్రా! కౌరవుఁ డగుశంతనుఁడు నమస్కరించుచున్నాఁడు.

దేవ—గురువరా! వందనము.

పరశు—(ఆశ్చర్యానందములతో) పితాపుత్రయో రన్యోన్యం ప్రీతి రస్తు. నిరామయోఽస్తు దిగ్విజయోఽస్తు. (అని దీవించి) కుమారా! ఇతఁడు నీజనకుఁడు.

దేవ—(పులకితాంగుఁడై) నాయనా! నమస్కారము.

(పాదములపైఁ బడును.)

శంత—(ఆనందబాష్పములతో) కుమారా! వర్ధిల్లుము.

(అని లేవ నెత్తి కౌఁగిలించి శిరంబు మూర్కొని)

చ. అనఘ మహానుభావ కరుణాభరణా జమదగ్నినందనా!
నను గరుణింప వచ్చినపినాకధరుండవో చక్రపాణివో!
కనులు పవిత్రమయ్యె నినుఁ గాంచి కృతార్థుఁడనైతిఁ, గూరిమిన్
దనయునిఁ గౌఁగిలించి కడు ధన్యుఁడ నైతిని నీకు మ్రొక్కెదన్.

దేవ—(సలజ్జముగా) గురువరా! విజయయాత్రకు వచ్చిన నాయనగారివీరఘోషణ విని పరాక్రమించితిని. అజ్ఞానకృతమయిన నాదోషమును మన్నింపుము.

పరశు—కుమారా! తప్పేమి? అది శూరధర్మమే. అది గాక యింతకు నితఁడు నీతండ్రి యని యెఱుఁగవు గదా! తెలిసినను దోషము లేదు. 'పుత్రాదిచ్ఛేత్పరాజయ' మ్మని శాస్త్రమే కలదు. నీతండ్రి కివ్విధముగా నీశౌర్యధైర్యములు తెలియుటయు నుచితమే. అయినను నీ వొనరించిన సాహసకృత్య మేమి?

దేవ—ఏమియు లేదు. సైనికులు సంఘముగాఁ బైబడఁజొచ్చిరి.

పరశు—ప్రకంపనాస్త్రము ప్రయోగించితివా?

దేవ—చిత్తము.

పరశు—అట్టిసమయమున కది యుచితమే. కాని రాజా! నీవీరఘోషణ యెట్టిది?

శంత—(క్రిందు చూచుచుఁ దనలో) ఇతఁడు రాజజాతిపేరు చెప్పిన మండిపడువాఁడు గదా! చెప్పిన నే మనునో!

పరశు—రాజా సంశయ మేల? పోనీ! కుమారా! నీవే చెప్పుము.

దేవ—శరసేతువుకడ కేగుదము. దయచేయుఁడు.

మువ్వురు—(పరిక్రమింతురు) రంగము — శరసేతుప్రాంతము.

దేవ—ఇదిగో విజయపతాక.

పరశు—(తొందరతో దానిమీఁది మాటలను బద్యమును

జడిసి) కౌరవా! ఏమి! పెద్దయెత్తెత్తితివి? ఇపు డున్నరాజులలో నీవే మగవాఁడవు గాఁబోలు! జాహ్నవీతీరవీరులందఱు కప్పము లర్పింప వలయునే? (కోప మభినయించి) ఔరా! నేఁటి కెంతమాట వింటిని ! ఇది నీదోషము గాదు నాదోషమే.

చ. ఇరువదియొక్కమాఱు ధరణీశకులాటవి నేలఁ గూల్చి భూ
సురకృప సంత మొాళ్ళ నససూపుట చూచియు నూరకుంటి నే
గురుమతి, నప్పుడే మరలఁ గుంకటివేళ్ళను బెల్లగించినన్
మరిమరి నిన్నుఁబోఁటి యభిమానులయుద్ధతి పీను సోఁకునే?.

శంత—(దోసిలి యొగ్గి) మహాత్మా! క్షమింపుఁడు. ఇచ్చట వీరు లనఁగా క్షత్రియు లని నాయభిప్రాయము.

దేవ—(తనలో) అయ్యో! తత్తఱపాటున జనకుఁడు తప్పఁ బల్కెను. దీనిపై నేమి వచ్చునో !

పరశు—ఏ మంటివి? వీరపదము క్షత్రియులయందు రూఢమా? బ్రాహ్మణులలో వీరులు లేరని నీయాశయమా? (మీసముదువ్వి) ఈ ముదుసలి వీరుఁడు జీవించి యున్నాఁడని యెఱుఁగవా?

శంత—మునివరా! నాతలం పది గాదు. బ్రాహ్మణులు వాగ్వీరులు, క్షత్రియులు భుజవీరులు, అందు మీరు వాగ్భుజవీరులరు, ఇందు సందియమేమి? ఈవీరఘోషణ కేవలభుజవీరులకే కాని యన్యులకుఁ గాదు. అనుగ్రహింపుఁడు. (అని వంగి నమస్కరించును.)

పరశు—(నవ్వి వీపు చఱచి) పరిహాసమున కోకమాఱు చూచితిని గాని నిజముగా నిది కోపము గాదు. త్రేతాయుగముననే రాజజాతిపైఁ గినుక విడిచి శస్త్రసన్న్యాసము గావించితిని. ఈగండగొడ్డలి యైనను సమిధలు నఱుకుట కుంచికొంటిని గాని వేఱొకందుకుఁ గాదు. అరిషడ్వర్గము జయించి యాత్మధ్యానమున మించి సకల

భూసుజాలము నొక్క రీతిగాఁ జూచునారు బ్రాహ్మణు లనియు క్షత్రియు లనియు భేదమే లేదు. అట్లయిన నీపుత్రునకు ధనుర్వేదము చెప్పుదునా? సంశయింపకుము. కుమారా! ఆసైన్య మ్మెట్లు పడయున్నది గాంచితోలు! అస్త్ర ముపసంహరింపుము.

దేవ—చిత్తము. (ధ్యానము నటించును.)

శంత—మహాత్మా! నమస్కారము. ప్రతిదానంబున నన్నుఁ గృతార్థుని జేయుఁడు.

పరశు—భూవరా! వినుము. హిమాలయకందరంబునఁ దపం బాచరించుకొనుచున్న నేను మందాకినీదేవి యూనతిచే నిం దరుదెంచి యొక సంవత్సరముగా నీ కుమారున కస్త్రవిద్య యంతయు నేర్పితిని. "బ్రహ్మనారాయణాస్త్రములు నే నుపదేశించి నీపుత్రుని నీ కర్పించెద" నని నిన్న నే యాదేవికి వాగ్దాన మొసర్చితిని. ఆపావనియు నిపు డిందు రాఁగలదు. పల్లవాని నాతల్లి కిచ్చినపిదప నీ వాసతిమతల్లిని గోరుము.

[తేటగీ] గీ. పరశురామమునీంద్రుని కరుణవలనఁ
దండ్రికొడుకులు పరిరంభధన్యులైరి
సైన్య మంతయు నపగతదైన్య మయ్యె
నిదియె కౌరవుఁ జూడఁగ నదను నాకు.

పరశు—(దూరదృష్టి నభినయించి) అదిగో గంగాదేవి.

గంగ—(ఒకప్రక్కనుండి ప్రవేశించి) ఈనిజరూపము రాజు గూడ నొకప్పుడు చూచినదే కావున నిట్లు పోవుటయే యుక్తము. (పరికించి) సమధిగతసకలకలాకలాపుఁ డగు తనయుని దండ్రి కొసఁగుట కిదే యదను. (సమీపించును.)

పరశు—తల్లీ! వందనము.

గంగ—పరమాత్మవిజ్ఞానంబున నానందింపుము.

దేవ—అమ్మా! నమస్కారము.

గంగ—కుమారా! జనకసమాగమానందమున వర్ధిల్లుము.

శంత—(పక్కకుఁ జూచును.)

పరశు—రాజా! ఏమట్లు చూచెదవు? ఈసతీమతల్లి దేవవ్రతునితల్లి.

శంత—మునివరా! గ్రహించితిని. కాని కుమారు నిందు విడిచి పోయిన పిదప మరల నెన్నఁడు నిచ్చటికి వచ్చినవాఁడను గాను గావున జహ్నుకన్యమొగము చూడ సిగ్గుపడుచున్నాను.

పరశు—సంయోగవియోగములు దైవాయత్తములు. ఇందు నీయత్నమే మున్నది?

గంగ—(కొమరునిఁ జేరఁదీసి) మునివరా!

సీ. చదివించినాను బ్రాఁజదువులు నాలుగు
  గురువరుం డగుపరాశరునియొద్దఁ
జెప్పించినాను బ్రసిద్ధశాస్త్రంబులు
  శిష్టమాన్యుండు వసిష్ఠునొద్ద
నేర్పించినాను సాన్వీక్షకీవిద్యలు
  ఘనతపోధనుఁడు భార్గవునియొద్ద
వినఁజేసినా నాత్మవిద్యారహస్యంబు
  సనకసనందనాది మునులయొద్ద

గీ. క్షాత్రతేజోయశోరత్నశాణ మైన
యాధనుర్వేద మంతయు నభ్యసింపఁ
జేసినాను జగద్వీరశేఖరుండు
మానిశేఖరుఁ డీమహామహునియొద్ద.

పెంచితిని, పెద్దవానిం జేసితిని, చదువు చెప్పించితిని. ఇఁక నాచేయునది

లేదు. ఇతఁ డిప్పుడు పదునాలేండ్లప్రాయమువాఁడు. లోకహితార్థము చిరంజీవియై యుండువాఁడు. వీని నిందలివారు దేవవ్రతుఁ డనియు గాంగేయుఁ డనియుఁ బిలుతురు. ఇంతటినుండి శాంతననామము గూడఁ బ్రసిద్ధ మగుఁగాక (అనుచు గద్గదస్వరముతో)

చ. కడుపెడుబిడ్డలం గనియుఁ గర్మవశంబున వారి నెల్లఁ గో
ల్పడి కడకాన్పుగాఁ గనినపాపని వీనిని నీకు నప్పుడే
విడువఁగ లేక కోర్కె-మెయిఁ బెంచితిఁ గౌరవభూతలేంద్ర! చె
ప్పెడి దిఁక నేమి? నాకుఁ గలప్రేమనిధానము నీ కొసంగితిన్.

(అని సమర్పించును.)

పరశు—[తనలో] బృందారకకులకును వందనీయురా లగుమం దాకిని గూడ నిట్లు చింతిల్లుటఁ బుత్రానురాగము దురతిక్రమమై శ్లాఘాపాత్ర మగుచున్నది. ఆహా! దేవతిర్యఙ్మనుష్యసామాన్యముగ నంతః కరణమును బంధించునది యపత్యబంధమే కదా!

శంత—(పుత్రునిబుజమునఁ జేయి వైచి)

శా. దేవీ! నాజననంబు సార్థకతఁ జెందెన్ నీకృపాపాంగవీ
క్షావిన్యాసమునన్, దనూభవపరిష్వంగప్రమోదంబునన్,
నావంశంబు తరించె నాగతియు ధన్యం బయ్యెఁ జెం పొప్ప, నే
నేవేళన్ నిను నీప్రసాద మెదలో నింపార భావించెదన్.

గంగ—(పుత్రునిమొగము చూచి)

సీ. గర్భశోకంబునఁ గడుఁ గుంది కడుఁ గుంది
కడకాన్పుగా నిన్నుఁ గాంచినాను
ఇల్లు వాకిలి నాక యెల్లదేశంబులు
సంచార మొనరించి పెంచినాను,

కులవిద్యలకును దక్కువయేమి రానీక
పెద్దలం గోరి చెప్పించినాను
ధనధాన్యములు లేనిదైన్యంబు రానీక
రాచమన్నన లొందఁ బ్రోచినాను

గీ. చేఁత నైనది యంతయుఁ జేసినాను
తండ్రి కర్పించి ధన్యనై తనరినాను
నాయనా! లోకహితవర్తనప్రతిష్ఠ
సేకరింపుము చిరకాలజీవి నగుచు.

దేవ—(తల్లిపాదముల కెరఁగి)

శా. అమ్మా! నీఋణ మేను దీర్పఁగలనమ్మా యింకఁ బై వేయి జ
న్మమ్ముల్ గాంచిన నైన? నీచరణయుగ్మ మ్మాత్మ భావించి ని
త్యమ్ముల్ బూజ యొనర్చుబుద్ధి వరమిమ్మా యెన్నఁడున్ నీదువా
క్యమ్ముల్ దాఁటకయుండు వందనము లమ్మా తల్లి మందాకినీ!

గంగ—కుమారా! నీకోరిక సిద్ధించును. పూర్ణాయుష్యుఁడవై జగద్వి
ఖ్యాతకీర్తి గాంచుము.

పరశు—దేవవ్రతా! నీజనకులసమక్షముననే మిగిలిన పరమా
స్త్రములు రెండు నుపదేశించెదను. ఈకమండలూదకంబు స్పృశించి
తూర్పుగాఁ దిరిగి కూర్చుండుము.

దేవ—చిత్తము. (అట్లు చేయును.)

పరశు—(చెవిలో నుపదేశించును.)

దేవ—(లేచి) గురువరా! ధన్యుఁడ నైతిని.

మ. నరహాస్యంబులు గాఁగ నస్త్రములు శస్త్రంబుల్ ప్రయోగోపసం
హారణంబుల్ దయఁజేసి నాయెడల నవ్యాజానురాగంబుతోఁ

బరమాస్త్రంబు లనుగ్రహించితివి దైవం బీవె నాపట్ల నీ
చరణంబుల్ శరణంబు నాయిడునమస్కారంబె నీదక్షిణల్.

(సాష్టాంగ నమస్కార మొనరించును.

పరశు—(లేవనెత్తి) శిష్యా! మీతల్లియనుగ్రహంబును నీవలననా యస్త్రవిద్య లోకంబున నన్నెకెక్కుటయు నా కుత్తమదక్షిణ. అప్రతిహతవీర్యమున దిగ్విజయ మొనర్చి నీతండ్రికి సార్వభౌమప్రతిష్ఠ నొడఁగూర్చి జగత్ప్రసిద్ధుఁడవై చిరంబు జీవింపుము.

శంత—మహాత్మా! మహాప్రసాదము. దేవీ! మహానుగ్రహము. నే నీకఁ బురమునకు మరలి కుమారునకు యౌవరాజ్యాభిషేకము గావింప ననుజ్ఞ యిందు.

గంగా, పరశు—పరమానందము, పరమానందము.

దేవ—అమ్మా! నమస్కారము. గురువరా! సెలవు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాఙ్కము.

శ్రీరస్తు.

ప్రతిజ్ఞాశాంతనవనాటకము

ద్వితీయాఙ్కము.

రంగము—శంతనుని సభామందిరము.

(ఉచితాసనాసీనుఁడై మంత్రి ప్రవేశించును.)

మంత్రి—(ఒకపత్రిక సానందముగాఁ జదువుచు శబ్దశ్రవణ మభినయించి, ఎవరు వారు? (ద్వారమువంకఁ జూచి) ఓహో యజ్ఞతీర్థులా! రండు దయచేయుఁడు నమస్కారము.

యజ్ఞ—మనోఽభీష్టసిద్ధి రస్తు (కూర్చుండి) మిత్రమా! విశేషము లేమి? యువరాజువార్త యే మయినఁ దెలిసెనా?

మంత్రి—ఆఁ! అదే చదువుచున్నాను. నేఁడే యీపత్రిక యందినది.

యజ్ఞ—ఏదీ! చదువు.

మంత్రి—చిత్తగింపుఁడు.

శ్రీరస్తు.

శ్రీమద్రాజాధిరాజపరమేశ్వర బిరుదాంకితులు
వశీకృతసకలభారతమహీవరులు సంపాదిత
సార్వభౌమప్రతిష్ఠులు హస్తినాపురచక్రవర్తులు
నగు శ్రీతాతపాదుల చరణారవిందములకు—

సభక్తివినయంబుగ మనసార నమస్కరించి పుత్త్రుఁడు దేవవ్రతుఁడు వ్రాయు విజ్ఞాపన పత్రము—

సౌరాష్ట్రపాండ్యకేరళాదిరాజులమాఁడ్కి దుర్గర్వము చూపిన మాహిష్మతీపురనాథు నోడించి కానుక లంది కోటగుమ్మమున కెదుదుగా జయస్తంభము గట్టించిన యుదంత మింతకు మున్నె తెలిపి యుంటిని గదా!

తరువాతఁ దిన్నగా నుత్తరముగాఁ దరలితిని. ఇచ్చటి ప్రసంగ మతివిచిత్ర మయినది. నేను దొలుత గాంధారంబున కేగి యాతేనికి "వశ్యుఁడ వయ్యెదవా? లేక యుద్ధ మొనరించెదవా?" యని వర్తమాన మంపితిని గాని, యుద్దిష్టసమయమునకు బదులు రాలేదు. ఇందుకుఁ గారణ మే మనఁగా!—— మాయోపాయంబున సాగరానూపదేశంబు లాక్రమించిన ప్రాగ్జ్యోతిషనాయకుఁ డీగాంధారభూపతికిఁ బ్రాణమిత్రుఁడట. అతఁడు శబరాదివిషయంబులు స్వాధీనము లగుట సకల ప్రపంచము తనకుఁ లోఁబడుట గాఁ దలఁచి కండకావరమున గండు మిగిలి యున్నవాఁడు. ఆగర్విష్ఠునిబలము నమ్మి గాంధారరాజు నా యాజ్ఞ ధిక్కరించుచుఁ గయ్యంబునకుఁ గాలు ద్రవ్వ, నొకనాఁటిపోర నతని నోర్చి ససైన్యంబుగ దేశము వెడలనడిచి యాతనిరాజ్యము నాత్మీయత్తము గావించికొని, మాళవక్షుద్రకదేశముపై దాడి వెడలు నంతలోఁ బ్రాగ్జ్యోతిషవిభుఁడు న న్నెదిరింపఁ దనబలంబులతో సమీపించుటయే కాక కాంభోజభూపాలుని గూడ సాహాయ్యంబునకు రావించికొనియె. ఇంతదనుక నణఁగి యున్నట్లుగాఁ గనఁబడిన కాశ్మీరనృపాలుఁ డిదే యద నని పేరాసవడి వారిం గూడి రణోద్యుక్తుఁడై యేతెంచె. పాఱిపోయిన గాంధారుఁడును జావఁగా మిగిలిన సైనికులతోఁ దిరిగి వచ్చె. ఈ శత్రుపంచకముతో మాళవారణ్యప్రాంతమునఁ బదిదినములు ఘోరసంగ్రామము జరిగినది. ఇందు మన జయసింహాజయసేనులు చూపిన పరాక్రమము ప్రశంసనీయము. పూజ్య

పొందఁ దగు పితృవ్యబాహ్లికునిశౌర్యధైర్యసాహసములు వర్ణనాతీతములు. ఇట్టియుద్ధ మభూతపూర్వ మని చెప్పవచ్చు. ధర్మసంగరము జరిగినన్నాళ్ళును బరమాస్త్రము లెత్తలేదు గాని వారు దొమ్మికి దిగినంతనే యొకటిరెండు దివ్యాస్త్రము లుపయోగించితిని.

అంతఁ బంచభూపతులును బాదాక్రాంతులైరి. ప్రాగ్జ్యోతిష విభుఁడు సాగరానూపదేశంబులు మనకు వదలి జయపతాక నొసంగుటకును దక్కిన నల్వురును సామంతులై కప్పములు గట్టుటకును నొడంబడిరి. ఇచ్చటి యుద్ధరంగమున నాయనగారి పేర మహోన్నతంబు ననశ్వరంబు నగు జయస్తంభము గట్టించితిని. అయిదుగురు నొసంగిన యుప్పనములు భద్రపఱచి యేనుఁగుల కెత్తించి పంపితిని.

అనంతరము పూర్వదిక్కుగా మరలి క్రమముగాఁ బాంచాల కోసలమిథిలమగధాదిదేశంబులు వశపరచుకొని యిపు డయోధ్యకు వెడలుచున్నాఁడ. ఇది యొక లెక్కలోనిది గాదు. కావునఁ బౌరవ వంశభూషణు లగు నాయనగారికి సార్వభౌమప్రతిష్ఠ కరతలామలకమైనది.

అని విన్నవించు
విధేయప్రియతనయుఁడు
దేవవ్రతుఁడు.

యజ్ఞ—అహార్యధైర్యశాలియైన యాశూరకుమారునకుఁ బ్రతివీరు లుండుట యసంభావ్యము. పరభయంకరమూర్తి సమరతలసమవర్తి పరిసేవిత పరశురామమూర్తి దిగంతవిశ్రాంతకీర్తియు నగు దేవవ్రతుఁడు సూనుఁడై యుండ శంతనుఁడు సార్వభౌముఁ డగుట కబ్బురమేమి? యౌవరాజ్యపట్టాభిషేకమై పూర్తిగా రెండేండ్లయినఁ గాలేదు. అపుడే భరతఖండ మంతయుఁ జుట్టఁ బెట్టెఁ గాదే! ఆహా! సరియే కాని యీ జాబు మనఱేఁడు చిత్తగించెనా?

వసు—చిత్తగించెను. దీనిని నేను విప్పక ముందాయనకే యంపితిని. అతఁడు చూచి మరల నాకుఁ బంపె. మఱియు విజయోత్సవము జరిగించి భూసురులకు భూరిదానమును, అనాథయాథముక కన్నవస్త్రదానమును గావింపు మని వర్తమానించె.

యజ్ఞ—ఆతఁ డింతలో రాఁడా యేమి!

వసు—ఈ సంతోషవార్త వినినపిదప మఱియు వేఁటతమకము హెచ్చెనఁట.

యజ్ఞ—పోనీ! అతఁడు గంగాతీరమునకు వేఁటకు వెళ్ళినప్పుడే యీమహాశూరుఁ డగు గాంగేయుఁ డుదయించె. ఇపు డీయమునా తీరమందలి మృగయావ్యాపారమున నేమి శ్రేయము సమకూరునో! అందే విహరింపనీ!

(తెరలో మృదంగనాదముతో)

బంధురవృత్తము:—♦

వినఁదగు, ముదమును గనఁదగు, వినుఁ డివింత యుదంతము వేడుకతో ఘనుఁ డగు కొడుకును గని మును పిదపం గాశ్యపి కాంతు వరించెనటే కనుఁగొనెనఁట! జయమును నలుఁగడ సంగ్రామములన్ మనభూవరనం దనుఁడఁట, నిట మన నరపతివెలసెన్ ధాత్రిక నొక్కఁడె నాయకుఁడై.

వసు—అదిగో! గాయకులు నగరవిథులఁ గుమారరాజ విజయమును బాడుచు బయలు వెడలిరి. మనమును దరువాతి కార్యంబు చూతము.

యజ్ఞ—మంచిది మంచిది. (ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది శుద్ధవిష్కంభము.

♦ కొండటి పాదము పల్లవిగా నిది అయుతాళములకు సరిపడును.

రంగము:—యమునాతీరకాననము.

[అంత రథారూఢుండై మృగయాపరతంత్రుఁడగు శంతనుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శంత—(వెనుకకుఁజూచి) సూతా! ఇప్పటికిని మనమృగయులలో నొక్కఁడయిన వచ్చుజాడ గానరాకుండె. కారణ మేమో గ్రహించితివా?

సూతు—దేవా! ఆపెద్దసందడిలో గుఱ్ఱములు బెదరకుండఁ బదిలంబుగ నడలించుచున్ననాకు వే తేమియుఁ గనఁబడలేదు కాని నా కిట్లు తోఁచుచున్నది.

మ. తెరలం జిక్కి శరప్రహారములకుం దీండ్రించి కుప్పించి ది
క్కరిరాజంబులు గూడ నివ్వెఱపునం గంపించున ట్లప్పు డా
హరి గావించినగర్జ వించుఁ బడెఁ బై హర్యక్షు మన్కీతి నె
ల్లరు చెల్లాచెద రైరి పిక్కబలమే లాభించులా గొప్పఁగన్.

శంత—(నవ్వి) నీ వన్నట్లు వేఁట కెంతయలవాటు పడినవారి కైన నోటమి గలిగించుప్రళయకాలమేఘనాదముఁ బోలినయాసింహనాదము వారికి భయము గలిగించిన దన్న ననవచ్చును గాని యట్లుగాదు. ఆమృగరాజు పెడబొబ్బవిని తలంకి నలువలంకుల నికుంజపుంజముల నుండి చంగుచంగున నెగిరి పరువెత్తుమృగంబుల వేఁటాడఁ దల నొక్కదిక్కై చెదరిపోయినవారు తుదకు మనయరదంబు గలిసికొనలేకపోయిరని తలంచెద. పోనీ! మన మింకను గొంతదూరము పోయి వత్తము.

సూతు—చిత్తము. (ముందు చూచి) ఎవరో వచ్చుచున్నారు.

రాజు—(తేటిచూచి) ఆఁ! మతెవ్వరు గారు. వనమృగముల జాడలు దెలిసికొన మనము పంపినబోయలే.

[బోయలు-నల్వురు ప్రవేశింతురు.]

బోయలు—దండాలు సామీ! దండాలు.

శంత—ఏమిరా! ఎక్కడెక్కడ చూచి వచ్చితిరి. ఏయే జంతువులను గనుఁగొంటిరి?

(♦) రగడ—తురగవల్గనము.

మొదటి—కాన సొచ్చి కోన లన్ని గలయఁ జూచి వచ్చినాఁడఁ
గానిపించె నొక్కచోటఁ గాలు కుంటిచిఱుతజాడ,
రెండవ—కాదు సామి! నాదుమాట కాదు నాక యాలకింపు
మేదు లున్న వాడ నాడ నీడ నేకలీఁడు సంపు,
మూఁడ—ఉండు మోరి! చెప్పనీర! యూర కేల జాగు సేయ
దండనుండి చెవులపిల్లిదండు సేరుచుండె వేయ,
నాల్గవ—ఏటిమాట లివ్వి సామి! యేటిపక్కదుబ్బులోనఁ
దీఁట యెక్కు పెద్దపులిని దేఱిచూచి వచ్చినాన.

*శంత—సూతా! ఆకుంటుచున్నచిఱుత నిన్న ములికిదెబ్బ తిని పాఱిపోయినదే. మిగిలినక్షుద్రజంతువు లేల? ఆపెద్దపులికై పోవుదము. బోయలారా! ఇఁక మీరు పొండు. మావేఁటకాండ్రు కనఁబడి రేని శిబిరములకుఁ బొం డని నామాటగాఁ జెప్పుఁడు.

బోయలు—దేవరా! సెలవు సెలవు. (నిష్క్రమింతురు),

శంత—సూతా! మనయరదమును నదీతీరమునకుఁ బోనిమ్ము.

సూతు.—(రథవేగము నిరూపించి) దేవా! ఇదిగో యమున.

(♦) "రా-రా-వేఁటాడ-వేగమె నా కేఁ:ఽ! రా-రా-వేఁటాః"
ఇది పల్లవిగా నీరగడలు నాలుగు లయతాళములకు సరిపడును.

రంగము:—యమునాతీరము.

శంత—ఆహా! మందమారుతమునఁ గదలి గలగలలాడు తరఁగలతో సూర్యాభిముఖంబుగా నేగుచున్నట్లుండిన యీమహాతరంగిణి, జనకుని దూరంబునఁ గని కలకల నవ్వుచుఁ జేతులు చాచుకొని యెదు రేగుకూరిమికూఁతురునాఁగ శోభిల్లుచున్నది. ఓజననీ! ఇంద్రశిల నీలతరంగిణీ!

చ. వెలుపల నింద్రనీలరుచి వెల్గుచు లోపల మౌక్తికప్రభం
జెలఁగుచు, నైక్యముం గనిన శ్రీహరిశంకరరూపసత్త్వముం
దెలుపుచు, భ్రాంతి వెట్టుచును నీటికి రూపము నెంచనట్టియ
య్యలమది; నీజలంబు గన నయ్యెడు నిర్గుణతత్త్వమూర్తి నాన్

సూతు—దేవా! లోకబాంధవుని రథ ముదయాద్రి విడిచి పైకేతెంచెఁ జూచితివా?

శంత—(సూర్యుని జూచి దోసిలి యొగ్గి)

శ్లో. ఆదిత్యమండలాన్తస్థ మఖిలవ్యాపకం మహః
వేదాన్తవేద్య మానన్ద మద్వితీయం స్మరా మ్యహం.

(అని స్మరించి)

ఉ. ఏయది కాలచక్రమును నెల్లెడఁ ద్రిప్పుచునుండు, నేది యా
యీయఖిలప్రపంచ ముదయింపఁగ మూలము, దేనిమూల మా
మ్నాయము లైనఁ దెల్పకయ మానము పూనెడు; నట్టి సూర్యనా
రాయణుదివ్యతేజము నిరంతరమున్ మది సంస్మరించెదన్

(నదీతీరము కలయం జూచి) సూతా! అల్లదె పోఁతగట్టుక్రింద గుబురుగాఁ బెరిఁగి యున్నదుబ్బులంక చూచితివా? బోయఁడు చెప్పి నచో టదియే కావచ్చును. కాని యీనడిమి పచ్చికబీటిలో లేటి

కడుపు మేయుచున్నది. ముందు దానిం గదియఁ గళ్లెములు సడల్చి యరదము వడిగాఁ దోలుము.

సూతు—దేవర సెలవు. ఛేఛే (అని) అయ్యా! చూడు చూడు మామృగంబులం గని—

చ. బిగి సడలంగ వాగె లర వీడిచి ఛే యనునంత, నొక్కసా
రిగ మనవాల్గు గుఱ్ఱములు లేచితథారను దాఁటి రెండు నాఁ
దగి పరదృష్టి, కొం డయి పదధ్వనిఁ, బూనెఁ బ్లుతంబు నెంతద
వ్వగఁ జను నెందు బోఁగలవు పో! దిగఁ ద్రొక్కెద మింతలో ననన్.

శంత—(శరము విడువఁ బోయి యొకనెత్తావి గుబులుకొన సుగంధం బాఘ్రాణించి) సూతా! ఈవీతెంచుపయ్యరతో నేతెంచి యొక సురభిగంధంబు ఘ్రాణగోచర మగుచున్నది. కనుఁగొంటివా ?

సూతు—(గాలి పీల్చి) అవును. ఇ దేదో మిక్కిలి మనోహరముగా నున్నది. ఇం దెం దయినఁ బూలతోట యుండనోపు.

శంత—(మరల నాఘ్రాణించి) ఇది నాయెఱింగినయేపుష్పంబులదికాదు. ఈ యపూర్వసౌరభంబుజాడ తెలిసికొనక మన కీమృగంబు లేల? ఆపులి యేల? పోనిమ్ము. మనరథంబు నీ నదీతీరంబుననే పోనిమ్ము.

సూతు—(రథవేగము నిరూపించి) దేవా! చూచుచూడు. మన వారువంబు లొక్కమాఱుగా వాయువేగంబున దౌ డందుకొనునంతలోఁ గాంతారభాగంబులు గడచుటయే కాక యూళ్లుఁ బల్లెలుఁ గూడఁ గనఁబడునంతలో నదృశ్యము లగుచున్నవి.

శంత—సూతా! సౌరభమూలము దాపునకు వచ్చినట్లున్నది. (ముందు చూచి) ముందేదో యొక పెద్దయూరు గనఁబడుచున్నది.

సూతు—(చూచి) దేవరపలుకు సత్యము. ఎదుటఁ బేరిదారి

కడ్డముగా నయ్యారికి దాపుగా నొకతోట గనఁబడుచున్నది. ఈసా రథ మందలిదేమో!

శంత—(చూచి) అరదం బచ్చటికిఁ జేర్చి యాఁపుము.

సూతు—(అట్లు చేసి నదివైపు చూచి) ఇది యోడరేవు కాఁ బోలు! గట్టుదరిని రేవుపడవ యున్నది.

శంత—(చూచి) అవు నవును. పడవవారు గాని తోటవారు గాని యిం దుండక పోరు. (ధనుర్బాణములు రథముపైఁ బెట్టి చేతి కట్టు గొని రథము దిగుట యభినయించి) సూతా! నే నీ తోట చూచి తిరిగి వచ్చునంతలో గుఱ్ఱములకు దాణా పెట్టి దప్పిక దీర్చి యీ చెట్లనీడ విశ్రమింప నిమ్ము.

సూతు—చిత్తము. (రథముతో నిష్క్రమించును.)

రంగము:—పాంథాశ్రమము.

—x—

శంత—(పరిక్రమించి చూచి) పడవ రేవునకుఁ జేరియున్న యీ తోట బాటసారులవిశ్రాంతి కేర్పడినదిగాఁ దోఁచుచున్నది. (రెం డడుగులు వైచి) ఆఁ! ఇదిగో ద్వారము (ప్రవేశ మభినయించి) ఆహా యేమి యీయారామరామణీయకము !

లయగ్రాహి.

సంపెఁగలు మల్లె లెద నింపువిరజాజు లరు
ణంపురుచిఁ జూడ్కులకు నింపగు గులాబుల్
సొంపగునసంట్లు మరువంపుదవనంపుమడు
లింపయిన గేదఁగులు గుంపు లగు బంతుల్
గుంపెనలు మాలతులు పంపరలు చూతములు
జొంపము గొజ్జఁగలు ముంపుగొను పొన్నల్

కెంపు లగుతామరలతంపరలు సౌరభపు
సంపద మనంబు దగ మంపు గొనఁజేయున్

(ఒకపువ్వు కోసి వాసన చూచి) ఇ దేమివింత! దీనికి నైజ మగు చంపకగంధము పోయి యీ క్రొత్తావి యెట్లు వచ్చినది! పోనీ, యింకొకటి చూచెదను. (అట్లు చేసి) చీచీ ! ఇది రూపమునకే మాలతి గాని పరిమళమునకుఁ గాదు. (ఆలోచించి) అనాఘ్రాతపూర్వ మశ్రుతచరమునైన యీ నూతనసౌరభము నానాసిక నంటినట్లే యీపూవులను గూడ నంటి యుండును. లేకున్న విజాతీయము లగు నీ రెండు పూవుల కొక్క వాసనయే యెట్లువచ్చును? కావున నీసురభిగంధ మీ తోటలోని కుసుమములది గా దనుట నిక్కము.

(తెరలో) మాలినీ! ఏఱు దాఁట వచ్చిన బాటసారు లెవరో తోటలోనికి వచ్చిన ట్లున్నది చూడుము. వారి నోడకడకుఁ దీసికొని పొమ్ము. నేను నీ సంతాన వల్లికి నీరుపోసి వచ్చెదను.

శంత—(విని) స్త్రీస్వరము విన వచ్చినది. మాటలరీతి చూడఁగా నోడ గడపుపల్లెపడుచు లని తోఁచుచున్నది. సంతానవల్లిమాట వచ్చినది. ఈ సుగంధము దానిది గాదుగదా! (తలంచి) ఇంద్రనందనములోనికల్పవల్లి యిందుల కెట్లువచ్చె? దేనికో యీపేరు పెట్టుకొని యుందురు, (ముందుచూచి) ఆమాలినియే కాఁబోలు నిట వచ్చుచున్నది.

మాలిని—(ప్రవేశించి) ఎవరయ్యా మీరు ! ఇటు రండు. ఓడరేవునకు దారి యిది.

శంత—ఏఱు దాఁటించుదానవు నీవా? (పరిక్రమించును.)

మాలి—నేనును, మా దాచకన్నెయుఁ గూడా దాఁటింతుము.

శంత—రాచకన్నె యేమి? ఏఱు దాఁటించు టేమి? ఏరాజు కూఁతురు?

మాలి—దాశరాజుగారి బిడ్డ.

శంత—ఈకనఁబడునది దాశపురమా యేమి?

మాలి—అవును స్వామీ!

శంత—(తనలో) రాజయిన నేమి? జాతిధర్మము పోవునా? అయినను, ఆఁడుబిడ్డ నోడగడపనియోగించునంతటియక్కఱ యతనికేమి కల్గెనో! (ప్ర) రాచకన్నె యంటివి. దానికిఁ బెండ్లి కాలేదు కాఁబోలు!

మాలి—కాలేదు.

శంత—ఆకన్నె పే రేమి?

మాలి—గంధ—(అనబోయి) సత్యవతి.

శంత—'గంధ' అంటివే! అ దేదో పూర్తిగాఁ జెప్పుము.

మాలి—ఆమెకే గంధవతి యనుపేరు కూడా కలదు.

శంత—(తనలో) ఈసుగంధ మాసత్యవతి దేమో. యని యాస వొడముచున్నది. కాని యీదివ్యసౌరభము మానవాంగనకు సందును జాలరిదానికి నెట్లు సంభవించె నని సంశయ మగుచున్నది. (ఆలోచించి) అట్లన నేల? ఎం దేమహిమ ముండునో! దానిం గని నాసందేహము దీర్చుకొనెదను. (ప్రకాశముగా) ఓసీ! నేను తోఁట చూడ వచ్చితిని గాని యేఱు దాఁట రాలేదు.

మాలి—అట్లయిన నిటు రండు. (ఇరువురు పరిక్రమింతురు.)

శంత—ఈతోఁట మీరాజు నాటించినదా?

మాలి—ఔను. బాటసారు లలసట దీర్చుకొనుటకై పాంథాశ్రమ మనుపేరు దీనిని మారాజుగారే వేయించినారు. అయ్యా, చూచితిరా! అకనఁబడుతీఁగెలచవికె దగ్గఱ నిలిచి యున్నదే మారాజు కూఁతురు.

యుత్తమకులకన్యక యనియే తోఁచుచున్నది. అయినను సౌరభప్రసంగమున సంశయము తీఱక పోవునా?

సత్య—[తనలో] ఇతఁడు, నేను స్మరించువాఁ డగునోకాఁడో కాని, యుత్తమక్షత్రియుఁ డగుటకు సందియము లేదు.

ఉ. ఆరమణీయవేషమును నావెడఁదైనయురంబు నాప్రస
న్నారుణవీక్షణాంచలము లానిడుదైనభుజాయుగంబు నా
ధీరగభీరభాషణముఁ దెల్పియు నాముఖశోభ యన్నియుం
జేరి యితండు రాజకులశేఖరుఁ డంచు వచించుచుండెడిన్.

రథికవేషము దాల్చినయీరాజన్యుఁడు వేఁటకై యడవుల కేతెంచి సురభిగంధము తెరువుఁ బట్టి యిం దరుదెంచె నని తోఁచుచున్నది. (ఆలోచించి) నిజముగా నితఁడు శంతనుఁడే యైనచో నాభాగ్య మడుగ వలయునా? ఆడఁబోయినతీర్థ మెదురైనట్లే.

శంత—(సుగంధాఘ్రాణ మభినయించి) సుందరీ! నే నొక్క సందేహముతో నిందు రాఁగా మఱియొక్కసందేహము తటస్థించినది. ఈరెంటిని దీర్చుభారము నీదై యున్నది వినుము.

ఉ. దూరమునుండి నన్నిటకుఁ దోడ్కొని వచ్చినయట్టి యీమనో
హారివిచిత్రసౌరభమునాకర మెయ్యది? బామ్మరాళులన్
హీరము గల్గుఁగాక యది యెం దయినన్ మకుటంబుఁ జేరుఁగా
కూరును జేరు లేక పడియుండునె తూనికఱాళ్ళలోపలన్?

సత్య—[సలజ్జముగా మొగము త్రిప్పి తనలో] నాజన్మమున కనుమానపడుచు నావృత్తికై వగచుచున్న యీతేనికి సురభిగంధము నాది యని చెప్పుట ముక్కలి వింతను వంతను గూడఁ గలిగించునేమో? కాని గంధవతీ యని పిలిచిన యీతఁడు కొంతవఱకుఁ గ్రహించి యుండఁడా?

శంత—(తనలో) ఈ సౌందర్యమునకుఁ దోడిసౌరభముగూడ నె జవ్వనిదే యయ్యెనేని గంధవతీనామమును నారాశయుఁ గూడ సార్థకము లగును.

మాలి—(తనలో) ఈమెమొగము చూడఁ దన్నుఁ దాఁ దెలిపికొనుట కనుమానించుచున్నట్లున్నది. పోనీ! నేనే యొక తెరువునఁ దెల్పెదను. (ప్రకాశముగా) అయ్యా! ఈమెకు యోజనగంధి యనుమఱొక్కపేరు కూడా కలదు.

శంత—(అద్భుతానందములతో) ఏమి! దూరమునుండి న న్నాకర్షించినయీసురభిగంధ మీసురభిళాంగిదా? ఆహా! నారాశ ఫలించినది.

సత్య—(తనలో) మాలిని సమయానుకూలముగాఁ జెప్పినది గాని దీనిమీఁదిప్రశ్నమున కె ట్లుత్తరము చెప్పఁదగునో తోఁచకున్నది.

మాలి—అమ్మా! బాటసారులసందడి యగుచున్నట్లున్నది. నే నోడకడకుఁ బోయెదను. (తనలో) ఇంకా త్రొందర లేదు. ఈ సంపెఁగ పొదచాటున నుండి వీ రేమి మాటలాడుకొందురో వినెదను. (ప్రకాశముగా) అమ్మా! పోయి వచ్చెదను. (నిష్క్రమించి యథోక్తముగాఁ బ్రవేశించును.)

శంత—చ. పసిఁడికిఁ దావి గూర్చుగతి భామిని! నీమృదులాంగవల్లి కిం
పెసఁగఁగ సౌరభంబు గదియించినధాత, మనీష కల్పనా
భ్యసనము దక్కి క్లేశపడియాఁగుటఁగాని, మెఱుంగుఁదీఁగెకుం
బొసఁగఁడెనిశ్చలత్వమును? బోయఁడె ప్రాణముపై (డితీఁగకుఁ

కాని, గంధవతీ! అతిమానుషము నపూర్వము నయిన యీసౌరభము నీ కెట్లు లభించినది?

సత్య—(సిగ్గుతో) ఇది పూర్వజన్మకర్మవిశేషంబున సంభవించినది. ♦

శంత—ఈనిరుపమానసుగంధమున కనుకూల మయినయా పూర్వజన్మకర్మము జనకాదులఁ బ్రతికూల మగునా యని శంకించుచున్నాఁడ.

సత్య—(తనలో) ఆఁ! కానిమ్ము. ఎట్లో యీమెట్టుదాఁటితిని. ఇఁక జాతివిషయ మున్నది.

శంత—సుందరీ ! నీ నిజవృత్తాంతము దెలిపి నా సందియము దీర్పవా?

సత్య—(తనలో) ఇదే వచ్చినచిక్కు. అకటా!

చ. జననముఁ రీతి తెల్పుట యసంగతి, మావసురాజమాని మా
జనకుఁ డటంచుఁ జెప్పిన నిజంబుగ శంతనుఁ డౌనో కాఁడో యీ
తని కడియాస గొల్పు టది త ప్పగు, దాశకుమారి నన్న, శం
తనుఁ డితఁ డయ్యెనా, కరగతంబగు రత్నము వీడిన ట్లగున్

శంత—జవ్వనీ! సంశయించెద వేల? సత్యవతివి గదా!

సత్య—(తనలో) కానిమ్ము. ఒకటి యడిగి చూచెదను. (ప్ర) భూవరా! నాస్థితిగతు లెవరికి విన్నవించుచున్నానో తెలియక యెట్లు మనవి చేయుదును?

మాలి—ఆఁ! ముందు లోఁతు పాఁతు దెలిసికొనుటలో నిన్ను మించినవా రున్నారా?

శంత—(చిఱునవ్వుతో) పౌరవగోత్రుఁ డగు హస్తినాపురసార్వభౌమునకు—

సత్య—(సలజ్జస్మితముగాఁ దనలో) నా యాత్రము తీఱినది. ఆహా! ఏదూరదృష్టిదూరాలోచనంబుల నా జనకుండు న న్నోఁడ గడప నియోగించెనో నేఁటికిఁ దెలిసినది.

♦ పూర్వజన్ముఁడు. బ్రాహ్మణుఁడు-పరాశరుఁడు-అంతి రార్థము

మాలి—ఇఁక నీకష్టము గట్టెక్కినదమ్మా!

శంత—విలాసినీ! నీదర్శనము కన్నులపండువయ్యె. ఇఁక నీయుదంతము వీనులవిందు గాఁ దగదా?

సత్య—(సిగ్గుతో) ఇది నాముఖ్యవృత్తాంతము.

గీ. ఉపరిచరుఁ డనురాజర్షి కుద్భవించి
దాశరాజున కభిమానతనయ నైతి
నతఁడు ధర్మార్థ మని నాకు నానతీయ
యమునపై నోడ గడపఁగ నమరి యుంటి

మాలి—ఇప్పటికి దాఁటితివి గాని యింతటితో విడువఁడు.

శంత—(తనలో) ఆఁ! కానిమ్ము. అనఘ మయినయీమంజులాంగిజననము నాయభిలాషమున కవకాశ మొసఁగుచున్నది. (ప్రకాశముగా) అకటా జవ్వనీ!

మ. ఈపరిపూర్ణయౌవనము నీకనుపండువుచేయునంద మీ
చూపఱకాళ్లసంకెలగుచూపును గాత్రము నిండుసౌరభం
బీపరిపూతమౌజనన మీపరిశుద్ధవచోవిలాస మా
పాపపునావపాల్పఱచుపాపము దాశకులంబు చేసెఁగా.

మాలి—అయ్యమాటలు మెల్లగా హద్దు మీఱుచున్నవి.

సత్య—(తనలో) మగువలకష్టపాటునఁ గనికరము చూపుట యుదారలక్షణము. (ప్రకాశముగా) కురువీరా! దాశకులము మేలే చేసినది. అది నింద్యము గాదు.

శంత—(చిఱునవ్వుతో) ఔను నిజమే. కాని నీయుదంతము సవిస్తరముగా వినఁ గుతూహల మగుచున్నది.

సత్య—నావినికి నెఱిఁగినది వినిపించెద. తపోయోగబలమున నూర్ధ్వలోకమునకు రాకపోకలు సలుపుటం జేసి యుపరిచరుఁడు నాఁ బరఁగు వసురాజు నాతండ్రి. ఏదో యొక శాపమున భూతల

మున కేతెంచి మాఱురూపమునఁ గొంతకాలము వనచారిణి యై యున్న యద్రిక యనునప్సరస నాతల్లి. ఇపుడు మత్స్యరాజ్య మేలుచున్న సత్యవంతుఁ డనురాజు నాయన్న.

మాలి—సెబాసు! గడుసుదనముగా దాఁటినా వమ్మా.

శంత—దివ్యాంగనాసంబంధమున నే యీదివ్యరూపము లభిం [చినది.

సత్య—

చ. జనకుఁడు దైవయత్నమున జన్మనిమిత్తమె యయ్యెఁ గాని మా
జనన మెఱుంగఁ డింతయును, శాపసమాప్తినిమిత్తమైనమా
జనన మెఱింగి తల్లియును సత్పథగామిని యయ్యె, నంత మా
కును విధి దాశరాజుకృపఁ గూర్చెను బౌరవవంశభూషణా!

శంత—సుశీలా! భూవరుఁ డై నసోదరుఁడును మనోహర మైన సౌరభమును గలుగుట నీయెడ గొప్పవిశేషమే కాని తక్కసనీవృత్తాంతము శకుంతలోదంతమునకు సరిపడుచున్నది.

మాలి—ఆఁ! ఈయన పాఁతపురాణము బయటఁ బెట్టి కథ మొదలుపెట్టినాఁడు.

సత్య—(శబ్దశ్రవణ మభినయించి) ఏదో మాటలసందడి యగుచున్నది. రేవులోఁ గాఁబోలు!

మాలి—ఎవరో దయ్యాలలాగున దాపరించినారు. (అని నిష్క్రమించును.)

శంత—రమణీ! నామాట వినఁబడినదా?

సత్య—(సిగ్గుతో) అవస్థను బట్టి పూజ్యత.

శంత—గుణములను బట్టియు గొప్ప వచ్చును. కాకకులమునఁ బెరిఁగినంతనే కోకిలకు గౌరవము తగ్గునా?

సత్య—(సలజ్జదరహాసముగాఁ దనలో)

చ. కనుఁగవ హృద్గతం బగువికారము దెల్పుచు నూత్నశోభ నా
ననమునఁ గూర్చుచుండె, నిపుణంబుగఁ గూర్మిని వెల్లడించుభా
షణముసు భావపోషణము సల్పుచునుండె, నిఁ కెట్లు భావముల్
మనముననుండి పైకొనిన మాటకు మాఱుగ మాట చెప్పుదున్?

శాంత—సుదతీ! నీవు శకుంతలాపరిణయవృత్తాంతము వింటివా?

సత్య—తనపేర దేశమునకుఁ బేరు తెచ్చిన భరతచక్రవర్తిని గన్నతల్లిచరిత మెవ రెఱుఁగరు?

శాంత—ఆఁ! అట్లయిన మన మాశకుంతలను బట్టి ప్రాచీన బాంధవమున సంబంధించితి మెఱుఁగుదువా?

సత్య—(సవ్రీడముగాఁ జిఱునవ్వుతోఁ దనలో) హృదయమా! ఆలాపము సమీపించుచున్నది నిశ్చలంబుగ నుండుము.

శాంత-మ. జలజాక్షీ! విను మస్మదీయాన్వయమునన్ జన్మించి నీ వాశకుం
తలయుం జూడ సగోత్ర లైతిరి గదా! ధన్యుండు దుష్యంతుఁ డే
నలపౌరివ్యులమై సగోత్రులమె కామా? కాన నీ వేను బం
ధుల మైనారము తొంటిచుట్టఱికమందుం గల్గు మే లెంచుమీ!

సత్య—(తనలో) ఆహా! ఈతనిమనోరథము నన లెత్తుచున్నది. ఇతనిమనసు నొవ్వ రాదు. జనకులయనుమతి వీడ రాదు. అట్టియెడ నిపు డే మనిన నేమి వచ్చునో (ఆలోచించి) అయిన నిట్లని చూచెద. (ప్రకాశముగా) ఆర్యా! ఉత్తముల చిత్తవృత్తియా, దురవగాహము. వారిమాటలా, ప్రసన్నగంభీరములు. ఇఁకఁ గన్యలందుమా, యెట్లయినఁ బరాధీనలే.

శాంత—(తనలో) హృదయమా! ఈచెలిప్రోడతనము గంటివా! నీవాంఛితము ఫలింపదా? చూడుము.

చ. పలుకును భావగర్భితపుఁబల్కులు, భావజగర్భితంపుఁజూ
పులఁ బఱుపుం గటాక్షములపోఁడిమి, భావము భావజుండు లోఁ

గలచియునవ్వు నవ్వుఁ, దమి గల్గినచిహ్నము లిట్లు దోఁప నీ
తలఁపు ఫలంబు గాంచక వృథా చనునే యెఱిఁగింపు కోరికన్.

(ప్రకాశముగా) కన్నె లెట్లయినఁ బరతంత్రి లనుట సామాన్యసూత్రము. కాని రాచకన్నియ లట్లు కారు.

మ. రమణీ! నిజసనంబు జవ్వనము సౌరభ్యంబు సౌజన్య మం
దముఁ గావించినవిందు గ్రోలి పరమానందంబునం దేలుచి
త్తములో నున్నది చెప్పది న్వినుము గాంధర్వంబునం బౌరవో
త్తమువంశంబును జొచ్చి పట్టమహిషీస్థానంబు గై సేయుమీ!

సత్య—(సిగ్గు నటించి తనలో) ఏమి పట్టమహిషీస్థానమా! ఇతఁ డింతకాలము ధర్మపత్ని లేకుండఁగ నుండెనా? (తలంచి) ఛీ! అది యసంభావ్యము. అ ట్లయినఁ గామాతురత్వమునఁ దప్పఁ బల్కి యుండునా? (ఊహించి) ఛీఛీ!! అది మఱియు నసంభవము. ఇతఁడు తలఁచినచో నానంటిరాచకన్నెలు వేనవేలు దొరకరా? (మరల నాలోచించి) అ ట్లయిన నిట్లేల చెప్పును? ఏమో! మానవులకు సుఖదుఃఖములును సంయోగవియోగములును దైవాయత్తములై పర్యాయసిద్ధము లగుచుండును. దీని కింత చింత యేల? (ప్రకాశముగా) పౌరవోత్తమా!

మ. కులమున్ శీలము విద్యయున్ ధనముఁ దక్కంగల్గు సల్లక్షణా
వళి గై సేయువరుణ్ గొమారితకు సంపాదింపఁగాఁ గోరి ని
చ్చలు యత్నించెడితండ్రిఁ గా దని నిజేచ్ఛం బోవుమోహైకచం
చలదృక్ఛాన యైనకన్నె గుణదోషంబుల్ గనం జాలునే?

శంత—ప్రియభాషిణీ! శకుంతలాది రాజకన్యాచరితములు విని యున్ననీకు గాంధర్వము విధిహితము గురుసమ్మతము నగు నని మరల మరలఁ జెప్పవలయునా?

సత్య—భూనాయకా! నాదొక్క మనవి. గురుజనము దగ్గఱ లేనివారికి గతి యైనగాంధర్వమునకు నామన సొడఁబడక యున్నది. బారెఁడుమేరలోఁ దలిదండ్రు లుండఁగా, వారిని గాదని నేను స్వతంత్రించినచో లోకనిందపాలు గానా! తొందర యేల! ఇంతకు నొక్కటి చెప్పెద వినుఁడు.

—♦ కవిరాజవిరాజితము. ♦—

ధరణివరుండు కులీనుఁడు ధీరుఁ డుదారుఁడు పేరుఁడు సత్యదయా
భరణుఁడు రావరు నాకుఁ దలంచుకృపానిధి దాశమహీశుఁడు ని
న్నరసినచో ననుఁ దప్పక నీకు సమర్పణచేయును సమ్మమము సు
స్థిరమతులై నమహాత్ములకోరిక చెల్లదె? దైన్యము వే లగునే?

శంత—(తనలో) చిన్ననాఁటనుండి పెంచినవాఁడుగదా యని దాశరాజునందలి భక్తిచే నీనెచ్చెలి గాంధర్వమున కనుమతింప కున్నది. అట్టిభక్తియుఁ బ్రశంసనీయమే. (తెరలో)

ఉ. ఏమిది! సౌరభంబుగతి యిందు గనుంగొని నత్తు నంచు నా
రామముఁ జొచ్చి యింతకు ధరాపతి జాగొనరించుకారణం
బేమొకొ? దానికై వెదకు చేగెనొ యెందులకైన ముందు? లే
దా, ముదమంద దానిఁగని యచ్చెరువందుచు నిందె యాఁగెనో?

శంత—వచ్చినదే రాక గా నే నాలస్యము చేయుటచే సూతుఁడు తత్తఱపడుచున్నాఁడు. రమణీ! నీయభిప్రాయమున మనమనోరథము దాశరాజసమ్మతము గావింప నిశ్చయించితిని.

సత్య—(సంతోషదరహాసములతో సిగ్గు నటించును.)

శంత—ఇఁకఁ బోయి వచ్చెదను! (ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాఙ్కము.

శ్రీరస్తు.

ప్రతిజ్ఞాశాంతనవనాటకము

తృతీయాఙ్కము.

రంగము హస్తినాపురములోని కోటగుమ్మము.

(అంతఁ దనలోఁ దా నిట్లనుకొనుచు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విదూ—రాత్రియంతయు నిద్రలేమిచే రాజు తూఁగుటుయ్యాల లోఁ గూర్చుండి కునుకుచున్నాఁడు. అబ్బా! యిప్పటికిఁ గొంచెమువిశ్రాంతి గలిగినది. రామ రామా! ఇదెక్కడియవస్థ! అయ్యో,అయ్యో!! గంధవతి సత్యవతి, సత్యవతి యోజనగంధి, యోజనగంధి గంధవతి, సత్యవతి గంధవతి. ఎంతసేపు నిదే వేదపాఠము. తుదకీతఁడు "పెండ్లి యైనఁ గాని వెఱ్ఱి కుదురదు వెఱ్ఱి కుదిరినఁ గాని పెండ్లి కా" దన్నస్థితికి వచ్చినాఁడు—ఇది వెఱ్ఱి యని వెఱ్ఱి గాదు. తెలివి యని తెలివి గాదు. ఇదేమియోగమో తెలియకున్నది. (ఆలోచించి) జ్ఞానయోగమునకు నజ్ఞానయోగమునకు నడుమనున్న దీనినే కాంబోలు విప్రయోగ మందురు. (మందహాసముతో) ఇది విప్రయోగము గాదు రాజయోగమే. ఔరా! సిద్ధాంతి రాజయోగము రాజయోగమనుచుండ నేమోయనుకొంటిని. ఇదా రాజయోగము! ఈయోగము నాకుఁ గాదుగదా, నాశత్రువునకయిన వలదుబాబూ! (వికటహాసముతో) మనరాజునకిప్పుడీయోగము పట్టినదిగాని నిజముగా రాజయోగముమాత్ర మిట్లుండునా? కానీ! ఏదో

యొకయోగము. ఏ దయిననేమి? యోగులకు మోక్ష మున్నదో లేదో కాని కోరిక తీఱనిచో నీయోగులకు మాత్రము శరీరమోక్షము సిద్ధము. ఓరినాయనా! అదేమోకాని యీయోగులచేష్టలు మాత్రము చూడ వింతగా నుండును. ఎదుటివారు వీరికిఁ గనఁబడరు. వీరికిఁ గనఁబడువా రెదుటఁ గాదుగదా, కంచుకాగడాలు వేసి వెదకినఁ గాన రారు. ఔరా! ఏమి చెప్పుదును మనరాజుచర్యలు

చ. కను లరమోడ్చి విప్పుచు నెగాదిగఁ జూచును, కౌఁగిలింత ము
ద్దును నటియించు, నవ్వు, నెగదువ్వుచు మీసము లోరగంటఁ గ
న్గొనుఁ, జిటికల్ దలిర్చు నిదిగో నను, సైగ లొనర్చుఁ, దొంగి చూ
చును, వడి లేచుఁ, గొంకునడి చూచును, జెక్కిలి చేతఁ జేర్చెడున్.

(ఘంటాధ్వని విని) ఓహో! అపుడే జాముగంట మ్రోఁగినది. రాజసేవచేఁ దీఱిక లేదని నిత్యకర్మము లన్నియు నన్ను విడిచినవి గాని ముప్పొద్దు భోజనకర్మము మాత్రము నదల లేదు. మంత్రిపురోహితు లిపుడు రాజును జూడ వచ్చెద రఁట. రా జొంటరిగా నున్నాఁ డన్న చింత లేకుండఁగ వారిరాకఁ జూచి యింటికిఁ బోయి వచ్చెదను. (పరిక్రమించి వీథివంకఁ జూచి) ఆఁ! యజ్ఞతీర్థులశిష్యుఁడు శంకరుఁ డిటు వచ్చుచున్నాఁడు. వీని నడిగినఁ దెలియఁ గలదు.

శంకరుఁడు—(ప్రవేశించి) వసంతకా! స్నానము సంధ్యావందనమును లేక యింక నిట్లే యున్నా వేమి?

వసం—పుట్టినప్పు డొకస్నాన మైనది. ఇఁక సంధ్యావందన మందువా ఉపనయనమునాఁడే నాచేఁతఁ గా దని సంధ్య కొక్కవందనము చేసినాను.

శంక—(నవ్వి) నీవు మహాబ్రాహ్మణుఁడవు. నీ కివి యేల? కాని యానడుమ నిత్యపారాయణము చేయుదు నని సుందరకాండ పుస్తకము సంపాదించితివే! అది యేమయిన జరుగుచున్నదా?

వసం—నే నాపుస్తకము తెచ్చి వంటయింటిగూటిలోఁ బెట్టి నాను. ఇప్పటికి నక్కడనే యున్నది. ఎక్కడికిని జరుగ లేదు.

శంక—(నవ్వి) ఈనవ్వులాట కేమి గాని యెవ్వరికిని బెద్దరాజు గారి దర్శన మగుట లే దేమి?

వసం—నీకుఁ గావలయునా ?

శంక—నీవు చేయించెదవా ?

వసం—సందేహ మేమి? ఆఁడువేషము వేసికొని మేనికి మంచి గంధముపూసికొంటివేని యిపుడు చేయించెదను. ఇదే మంచిసమయము.

శంక—(నవ్వి) ఛీ! ఆఁడువేషమా? నీ వెపు డయిన వేసినావా యేమి?

వసం—అయ్యో! రావణవధలో మేనకవేషము, హరిశ్చంద్ర కథలో రంభవేషము వేసినవాఁడనే.

శంక—వేషముల కేమి గాని సందర్భము మాత్రము చక్కఁ గానున్నది. రావణవధలో మేనక యెందుకు వచ్చినదో ముందు చెప్పు.

వసం—నీవు రూపకములు వ్రాసినవాఁడవా చూచినవాఁడవా? కావలసిన నిప్పటినాటకకవుల నడుగుము. నాకుఁ బని యున్నది. మీా గురువుగా రేమిచేయుచున్నారో చెప్పుము.

శంక—వా రిపుడే పెద్దరాజుగారిని జూచుటకు బయలుదేఱి వచ్చుచున్నారు.

వసం—సరియే నేనును భోజనమునకు బయలుదేఱి పోయెదను.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది సంకీర్ణవిష్కంభము.

రంగము:—శయనమందిరము.

(అంత యథోక్తముగా శంతనుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

శంత—(చెక్కిలి చేతఁ జేర్చి తనలో) ఔరా యెంతపని జరిగినది? వ్యసనము లనర్థదాయకము లనుట యనుభవగోచర మైనది. అకటా వేఁట యెంత చేసినది? ఈనడుమఁ బూర్తిగా వేఁటయాడుట మానినవాఁడ నట్లె యుండక మరల మృగయావ్యాపార మేల తలఁపవలయు? తలఁచితిని బో, యమునాతీర కాననంబుల కంత దవ్వుగా నేల పోవలెను? సురభిగంధము తెరువుఁబట్టి పాంథాశ్రమ మేల చొరవలెను? చొచ్చితిని గాక, గంగావియోగము సంభవించినది మొదలుగాఁ గళత్రవాంఛ విడిచిననాకు సత్యవతిని జూచినంతనే యనురాగ ముదయింపవలయునా? ఆహా! దైవ మెప్పటి కేమి సమకూర్చునో తెలియదుగదా! (తిన్నగఁ గూర్చుండి) ఛీ! కామాంధుఁడనై యెంత తప్పు చేసితిని? గాంధర్వమున కొడఁబడని యాజవ్వనిపై వాంఛ వదలి వెంటనే యింటికి రాక దాశరాజుకడ కేగుట యెంతలజ్జాకరమో యూహింప నైతిని గదా? ఔరా! దాశరా జెక్కడ? నే నెక్కడ? అతఁడు నామనోరథమున కడ్డము చెప్పి రాజ్యశుల్క మడుగుట యెక్కడ? (దిండుకుఁ జేరఁ బడి) హా రమణీ! మనమనోరథము మటుమాయమయ్యెనని యెఱుఁగక యేమి తలంచుచున్నదానవో గదా! హా ప్రేయసీ! నీతండ్రియే నీకుఁ బ్రతికూలదైవ మయ్యె నని తెలిసినపిదపనైన నన్ను నిందింపకుందువుగదా? అదియే చాలును. (తలంచి నిట్టూర్పు పుచ్చి)

ఉ. అందమునందు నచ్చరల నొదలఁ దన్నిన మానవాంగనం
గందుము గాని యీసురభిగంధము గల్గినకాంత యెందుమే?
సుందరికమ్మతావి మెయిసోయగమున్ మనసారఁ గ్రోలుటే
మందును దైవమాయ? వగపారుతలంపున కయ్యె నక్కటా!

(తల వంచి స్మృతి తెచ్చుకొని) ఛీ! దాశపురమునుండి వచ్చినది మొదలుగా నేఁటివఱకు నీయంశమే తరిచి తరిచి తుద కొకదారికి వచ్చియు మరల నీయజ్ఞానమునఁ బడ నేల? (సధైర్యముగఁ దల యెత్తి యాలోచించి) నిజము నిజము. నిజభుజశక్తిచే నెల్ల పరరాజుల నోర్చి నన్ను సార్వభౌముని జేసినకుమారుని రాజ్యము నన్యునకు దారవోయ నే నెవ్వఁడను ? ఛీ! ఇట్టి తుచ్ఛసుఖమునకై స్వచ్ఛమైన యశస్సు గోల్పోవుటకంటె నవివేకము గలదా? ఇఁక నైనఁ దెలివి దెచ్చుకొని యీసంకల్పవికల్పములు బయలు పడకుండ మెలఁగితినా, కొంతకాల మిందు తలయెత్తికొని బ్రతుకవచ్చును గాని లేకున్నఁ బరిహాసపాత్రుఁడనై ప్రాణప్రియమైన యశస్సుతోఁ గూడఁ బ్రాణములు విడువవలసివచ్చును. (అని చెక్కిలి చేతఁ జేర్చి) నేను వేఁటనుండి వచ్చినది మొదలుగా మంత్రిపురోహితుల కెన్నఁడును వర్తమాన మంపక, వారే యెపుడయిన వచ్చినను సరిగా నొకనిముసమైన వారితో మాటలాడక కాలము గడపుచున్నాఁడ. ఇపుడు నన్నుఁ జూడ వచ్చుచున్నారమని వారే వర్తమానమంపిరి. దర్శన మీయక పోవుట తగదు. కాని సంభాషణసందర్భమున నేమి పొరపాటు వచ్చునో యని జంకుచున్నాఁడ—కానీ! మనసు నిలిపికొని యుండెద. (శబ్దశ్రవణ మభినయించి) ఎవ రక్కడ?

ప్రతీహారి—(వచ్చి) దేవా! మంత్రి పురోహితులు వచ్చిరి.

శంత—సరియే రానిమ్ము.

ప్రతీ—దేవర సెలవు—(వెళ్లును.)

(వసుభూతి యజ్ఞతీర్థులు ప్రవేశింతురు.)

శంత—గురువర్యా! నమస్కారము. అమాత్యా! రమ్ము. కూర్చుండుఁడు. (ఉచితాసనములు చూపును.)

యజ్ఞ—ఇష్టార్థసిద్ధి యగుఁ గాక. (కూర్చుందురు.)

శంత—అమాత్యా! నేఁ డే దయినఁ గుమారునియొద్దనుండి వార్త వచ్చెనా?

వసు—చిత్తము. చిత్తము. ఆశుభవార్త తెలుపుటకే వచ్చినారము. ఏకాదశీసోమవారము పదిపండె్రిండుగడియలప్రొద్దెక్కునప్పటికి హస్తినాపురము చేరఁ గల మని యువరాజు వ్రాసినజాబు నేఁటిసూర్యోదయసమయముననే యొకసేవకుఁడు తెచ్చి యిచ్చెను. ఆజా బిదిగో.

శంత—(గ్రహించి) చదివికొని సంతోషముతో) గురువర్యా! ఆసమయము పురప్రవేశమునకు మంచిదే కదా?

యజ్ఞ—దివ్య మయినది.

శంత—అట్లయిన రేపే కాఁబోలు!

యజ్ఞ—రేపు కాదు. నేఁడే.

శంత—ఏమి! నేఁడా? (తనలో) ఔరా! తిథివారములుగూడ మఱచితిని. వీ రే మనుకొందురో కదా! (ప్రకాశముగా) అమాత్యా! అట్లయిన విజయోత్సవముతోడిపురప్రవేశమునకుఁ దగినసన్నాహ మొనరించితివా?

వసు—సర్వము సిద్ధము: ఈవార్త తెలిపి దేవరయాజ్ఞ గైకొన వచ్చితిమి.

శంత—మహానందము. దీనపంగ్వంధభిక్షుకాదిజనంబులకు యథేష్టముగా నన్నవస్త్రదాన మొనరించి కోటలోనిభృత్యుల కెల్లరకు నొక్కొకనెలజీతము పసదనముగా నొసంగునది. మఱియుఁ గురుదేశమంతట విజయోత్సవము జరుపునట్లుగా నయ్యాదొరలకు మన్నీలకు నాజ్ఞాపత్రంబులు పంపునది. మనపురమున నేఁటి మొదలుగా మూఁడు దినములు బాహ్లికునియాజమాన్యమున విజయోత్సవము జరిగించునది.

నేఁటిసాయంకాలము మంత్రులను సభ్యులను సమావేశపఱచి విజయప్రశంస గావించునది. ఆసందర్భమున సభ్యులందఱకు యథోచితసత్కారములు గావింప బాహ్లికు నియమింప నున్నాఁడ. ఇంతకంటెఁ జెప్పఁదగిన దేమి?

యజ్ఞ—రాజన్యా! అన్నిదేవాలయములలోను నభిషేకార్చనములు జరిగించుట కూడఁ గావలయును,

శంత—అది తప్పక చేయఁదగినదియే. అమాత్యా! ఆయేర్పాటు ముందుగాఁ గావింపుము.

వసు—దేవరయాజ్ఞ.

శంత—ఇంక నే మయిన విశేషవార్తలు కలవా?

వసు—(సంశయముతో) వేఁటనుండి వచ్చినపిదప సార్వభౌముని దర్శనము లభింప లే దనెడిసభ్యులపరితాపము దప్ప వేఱేమియు లేదు.

శంత—అవును నిజమే. సభ కొకమా రయిన వెళ్ళ లే దని నేనును మనసులో ననుకొనుచునే యుందును గాని మంత్రిపురోహితులు రాజకార్యములు చక్కఁబెట్టుచుండిరి గదా యని పాలుమాలితిని. ఇంతకును మనస్సు కుదురుగా నుండక పోవుటయే కారణము.

యజ్ఞ—(తనలో) ఆఁ! కొంచెము సందు దొరకినది. (ప్రకాశముగా) మీరు వేఁటచే నలసియుందు రని యింతదనుకఁ దలచితిని గాని యిపుడు మిమ్ముఁ జూడఁగా మీమనసు స్వస్థముగా లే దని నాకును దోఁచుచున్నది.

వసు—మహారాజా! యజ్ఞతీర్థులు సెలవిచ్చినట్లే నేనును దలఁచుచున్నాను. అంతరంగికుఁడ నగుటచే నడుగవలసి యడుగుచున్నాఁడ. నామనవి యన్యథాకరింపక మనోవైకల్యంబునకుఁ గారణ మేటిఁగింపుఁడు.

శంత——(తనలో) ఏమి చెప్పుదును? ఏమియు లే దని యెట్లు బొంకుదును? అకటా! మరల నీప్రసంగ మెత్తుట మానుచున్నపుండు రేపుట కదా?

వసు——రాజన్యా! సంశయ మేల?

మ. కన రాఁ డెందును ని న్నెదుర్కొన మదిం గాంక్షించుశత్రుండు నీ
కనురక్తుల్ ప్రజ లెల్ల నెల్లదొర లజ్ఞాయత్తులై కప్పము
ప్పన మర్పింతురు సర్వసస్యఫలసంపత్పూర్ణమై నీదుమే
దిని రాజిల్లెడు నింక నీహృదయ మార్తిం జెందఁగా నేలొకో?

శంత——అమాత్యా! ఏదో వచ్చినది. వచ్చినది వచ్చినట్లే యణఁగినది. అడఁగినబెడఁద మరలఁ ద్రివ్వ నేల?

యజ్ఞ——వసుభూతీ! ఇఁక నడుగ నేల? తెలియుచునే యున్నది. రాజుగారు చెప్పవలసినమాట నేనే చెప్పెద వినుము.

చ. కలవు సమస్తసంపదలు గాని కళత్రము లేదు, కానఁ గా
నల నివసింతు నన్నను మనంబు విరాగము గాదు, పెండ్లికై
మలయుదు నన్న నింతకును మాని సుతుం డతిలోకవీరుఁడై
వెలయఁగఁబొడియానె మఱిపెండిలి? యం చెదఁ గుందుచుండెడున్.

శంత——(తనలో) ఓహో! ఎపు డయిన నా పరాకుమాటలు విని వసంతకుఁ డీయనకుఁ జెప్పియుండునేమో! అయ్యో! ఎట్లో మనసు కుదురుపఱుచుకొనఁ జూచితిని గాని దైవము నన్ను వీథిని బెట్టక మానదు కాఁబోలు! (ప్రకాశముగా) ఆర్యా! మీరు చెప్పినదానిలోఁ గొంత నిజము గలదు గాని యిపు డట్టియాలోచన మిసుమంతయు లేదు.

వసు——(తనలో) కానీ! యజ్ఞతీర్థులయాలోచన మూరక పో లేదు. (ప్రకాశముగా) రాజేంద్రా! అట్లయిన నణఁగినబెడఁద మరల ద్రవ్వుట కే మున్నది?

చ. తలఁచినకోర్కి యెన్నఁడు వృథా చన, దాడినమాట కెన్నఁడుం
గలుగదు భంగపాటు, పడి గాంచదు చేసినచేత యెన్నఁడుం,
దలఁకి యెఱుంగ దెన్నఁడును ధైర్యము, నీ కిపు డూరకిందు కొం
దలపడ నేల? మాకును మనం బెఱిఁగింపఁగ సంశయం బొకో!

శంత—సంశయమున కే మున్నది? వివాహచింత గలిగిన మాట సత్యమే కాని కుమారుఁడు ప్రాజ్ఞుఁడై రాజ్యార్హుఁడై యుండ బెండ్లి యుచితము గా దని యాచింత వదలితిని.

యజ్ఞ—ఉచిత మన్నను గా దన్నను విధి యె ట్లున్నదో యట్లు కాక తప్పదు. కాని—

ఉ. కౌరవరాజ్యగౌరవము గాశ్యసి నల్లడ మ్రోఁగునట్లుగా
భారతభూమి కెల్ల నిను భర్తఁగఁ జేసె సుతుండు, కాని, భూ
భారము నెత్తి నూనుటయె భాగ్యమొకో? కన జోగి గాక సం
సారియుఁ గాక యి ట్లునికి చందము యందము కౌరవేశ్వరా!

వసు—అదియుం గాక, భూవరా!

గీ. ఒక్కఁ డెన్నఁ గన్న గా దొక్కఁ గొడుకు
కొడుకు గాఁ డనులోకోక్తి నెదఁ దలంచి
కుందుచుంటిమి నీ కొక్కఁ గొడుకె యగుటఁ
గానఁ బెండ్లాడు టుచితంబు గాదె యరయ?

శంత—ఒక్కఁడే పుత్త్రుఁ డని సంశయింపఁ బని లేదు. త్రిలోకపావని యగుపావని నాతనయుని నా కర్పించునెడ "లోకహితార్థం బుగ నిక్కుమారుండు చిరంజీవియై యుండువాఁ" డని వచియించె.

వసు—పుత్త్రప్రేమాతిశయంబున నాశీర్వదించి పలికినను, నమ్మహాదేవి మాట యమోఘమే యగు ననుకొందము. అయినను క్షాత్త్రధర్మమును బట్టి నా కిట్లు తోఁచుచున్నది.

ఉ. వీరుఁడు నస్త్రశస్త్రగతివేత్తయు సంగరరంగ మేగువో
ధీరుఁడు, నేమి యైన వెనుదీయనిసాహస మొప్పఁ బోరువో
ఘోరుఁడు, నెల్లభూపతులకుం మదిఁ గంటక మైనవాఁడు, నీ
శూరకుమారుఁ, డాహవమె చూ యపమృత్యువు రాజజాతికిన్

శంత—అమాత్యా! నీమాటలు కుమారునెడ నన్వయింపవు అతని ధైర్యశౌర్యసాహసంబులకు శంకించి యతని మనుగడం గూర్చి జడియఁబని లేదు.

గీ. అఖిలశస్త్రాస్త్రవిద్యారహస్యవేత్త
యమరతటినీతనూజాతుఁ డధికబలుఁడు
పరశురామునిష్యుఁ డాబాలు నెట్ల
కాలమృత్యువు గదియంగఁ గడఁగు నయ్య!

యజ్ఞ—ఉ. నీయనినట్లు నీసుతుని నిత్యత నిక్కమె యైన మామదిం
బాయద యేకపుత్రుఁ డనపత్యున కే డనుధర్మసంశయం
బీయనుమాన మిట్లు మది నేఁచుట నొక్కటి విన్నవింతు శా
స్త్రీయవివాహపద్ధతిని జెందుము వెండియుఁ బుత్రసంతతిన్.

వసు—తొలుతఁ గలిగిన సంకల్పమును గురువర్యానాతిని రిత్త గావింపక దేవర యొక కన్నెలమిన్నను దేవేరిఁగాఁ గైకొనుటయుచితము

యజ్ఞ—అదిగాక సర్వజన సమ్మతి మైన యీకోర్కి కాటంక మేమి? 'నిరాశ్రమో నతిష్ఠేత' యని ధర్మశాస్త్రము శాసించుచుండ మహారాజు లిట్లుంపుట యుచితమా?

శంత—తలఁపరానిది తెలుపఁదగ దని నిశ్చితాభిప్రాయమును సంగ్రహించి చెప్పినను మీరు వినకున్నారు. తొలుత నాకుదయించిన సంకల్పము వెనుక ననుచితస్థితికి వచ్చుటచేతనే వెనుక జంకినది.

వసు—ఏమి! ఘంటాపథ మయిన యీ సంకల్ప మనుచిత మెట్లయినది?

శంత—కాలకర్మవశమునఁ నట్లైయైనది. పెక్కేల? వినుఁడు

ఉ. ఉత్తమరాజు కన్నది వయో గుణరూపవచోవిలాస సం
పత్తిని గన్నచిన్న దభిమానకుమారిక యాచు దాశభూ
భృత్తునియింట నున్న దలవేఁటకుఁ బోయిననాఁడు దానిపైఁ
జిత్తము నాటికొన్నది-యిసీ! పయిమాటలు చెప్ప నేటికిఁకా?

యజ్ఞ—యోజనగంధి యనుపేరు వడసిన యుపరిచరపుత్రి యగు సత్యవతియా?

శంత—అవును. ఆర్యా! మీ రెట్లెఱుఁగుదురు?

యజ్ఞ—ఆమె సౌందర్య సౌశీల్యాదులు వినియుంటిని. తేనికిఁ దగిన కన్యారత్నమే. కొంం కేల?

శంత—మీ రన్యథా తలంతు రని మనశ్శల్యమైన యీ యొక్కమాట చెప్పలేక చెప్పుచున్నాను నా కాకన్నెయం దుదయించిన వాఁడు నా పరోక్షమున రాజు గావలయు నని దాశరాజొక్క వర మడిగెను.

య—వసు—(ఆశ్చర్యవిషాదము లభినయింతురు.)

శంత—ఇట్టిది గావుననే మీ కీ యుదంతము తెలుప ననుమానించితిని.

వసు—ఈవర మీకున్న దేవర పరిణయవాంఛ సఫలముగాదా?

య—సచివోత్తమా! అట్లు కాదు.

మ. చిరకాలం బుదయింప కిప్పుడు మదిం జేకొన్న యీ వాంఛ కే
తరుణీరత్నము మూల మయ్యెదియ యుద్వాహార్హమా, దాన ని
వ్వర మడ్డం బగు, నింక నొక్కవెలఁదిన్ వాంఛింపఁ డింకెట్లు తే
న్నరయుం బెండిలికోర్కి? సంగర మనర్హంబే కదా యియ్యెడన్!

శంత—(తనలో) గురువర్యుని యాలోచనము సరిగా నున్నది.

వసు—(తనలో) యజ్ఞతీర్థులమాట నిజము. దాశరా జీవరము విడువఁడు; రాక్షసవివాహమున కితఁ డిష్టపడఁడు. ఇది యెట్లయిన గాంగేయునకుఁ దెలియక మానదు. మహోదారుఁ డగునాతని కడ్డము చెప్పువారు లేరు. ఔరా! కౌరవాన్వయమున నెంత వింతపుట్టనున్నది! ఎట్లయిన నితఁడు సత్యవతిని బెండ్లాడుటయు దేవవ్రతుఁడు రాజ్యహీనుఁ డగుటయు సిద్ధము.

యజ్ఞ—(తనలో) ఔరా! చిరకాలమునుండి కురురాజకులము నాశ్రయించి సుఖించుచున్నందుకు రాఁదగిన విచారమంతయు నొక్కమాటే వచ్చినది. ఇతఁడు రాజు, అతఁడు యువరాజు. వీరిలో నొకరి యానంద మింకొకరివిచారమునకు హేతు వగును. ఇట్టియెడ నేమి చెప్పఁదగును?

వసు—మహారాజా! మీకుఁ గళత్రప్రాప్తియు, యువరాజునకు రాజ్యప్రాప్తియు రెండును రెండుకన్నులఁ జూచి యానందింపఁ దగిన మా కేమి చెప్పుటకును నోరాడకున్నది.

శంత—ఇం దెవరు చెప్పఁదగిన దేమున్నది? కుమారుని రాజ్యముకంటె నాకుఁ బరిణయ మెక్కుడు గాదు. సర్వథా నే నాచింత వదలి యుంటిని. గురువర్యా! కర్మవశమునఁ గానియాలోచనము గలిగి యది ప్రమాదవశమున బయటఁ బడుటచేఁ గౌరవగౌరవమునకుఁ గలంకము దెచ్చితినని పెద్దలకుఁ దలచూప నోడి కొందలపడుచున్నాను. కావున నిప్పటినాయాలోచనము చెప్పెద వినుఁడు.

ఉ. కౌరవవీరు లెవ్వరికిఁ గల్గనిదివ్యపరాక్రమంబునన్
భారతభూమిఁ గల్గునరపాలుర నెల్లర నోర్చెఁ బుత్రుఁ, డ
వ్వీరుని రాజుఁగా నిలిపి పెద్దలమార్గముఁ బట్టి కానకుం
జేరి సుఖించువాఁడ మునిసేవ యొనర్చుచు బ్రహ్మనిష్ఠమై.

యజ్ఞ—రాజా! సకలకామముల నీవు వదలి వార్ధకమునఁ

బుత్రులకు రాజ్య మిచ్చి యరణ్యములకుఁ బోవుట వృద్ధభూపతుల యాచారమే కాని మీ కెపు డది తగదు. ఇప్పటి వైరాగ్యము మనోవైకల్యమునఁగలిగినది గాని కామక్రోధాదులను జయించుటచే జనియించినది గాదు. పోనీ! యీవిషయ మి ట్లుండనిండు. ఈ వరమున నొకవేళ సత్యవతీపుత్రుఁడు రా జగు ననియే తలంతము. అయిననేమి? వాఁడు పేరునకు రా జగును గాని మహాశూరుఁడు రాజనీతికోవిదుఁడు నగు దేవవ్రతునిసాహాయ్యము లేక రాజ్యము చేయఁగలుగునా? అట్టియెడఁ బ్రాహ్మలోకము మందాకినీనందను రా జనక సత్యవతీ తనయుని రా జనునా? ఇఁకనో గాంగేయుఁ డౌదార్యము చూపి తనంతఁ దానే యీవర మిచ్చినను నీకు రాఁదగిన యపవాద మె ట్లయిన రాక మానదు. అట్టివట్టినిందకై జంకినను బ్రయోజనము లేదు.

చ. జనవర! యగ్నిహోత్రమును సంతతియు న్నిగమంబు నీశ్వరా
ర్చనమును సాధుసంగమును సత్కులజాతుల కెందు మానఁగాఁ
జన దని చెప్పి రార్యమతశాసకు లైనమునీంద్రు లట్లు చూఁ
చిన మరలం గళత్రమును జేకొను టెంతయు సహ్యమే సుమీ!

శంత—(ఆలోచించి) గురువర్యా! వేయేల? నా పుత్రుని రాజ్యము నే నన్యునకు దారవోయ సమ్మతింపను. ఇఁక నే నీపాడు సంసారమున కాసింపను. కావున ననుగ్రహించి యిహపరసాధన మైన జ్ఞానమార్గ ముపదేశింపుము.

యజ్ఞ—భూవరా! దేవవ్రతుఁడు మీపుత్రుఁ డగుటయే మీకుభయలోకసాధన మైన రాజమార్గము.

ఉ. సూర్యుఁడు దివ్యతేజమున సోముని వన్నెకుఁ దెచ్చినట్టు లౌ
దార్యముపుట్టి నిల్లగుసుధాకరువంశము వన్నెఁ దెచ్చితీ
వర్యమసన్నిభం బయినయాత్మజతేజమునం, బరాత్మవి
ద్వర్యుఁ డతండె నీ కుభయతారణకారణ మం చెఱుంగుమీ!

శంత—గురువరా! నమస్కారము. ఇఁక నేను స్నానము చేసి పూజాగృహమున కేగెదను.

యజ్ఞ—శ్రేయస్సు గలుగుఁగాక. ఇఁకఁబోయివచ్చెదము. (లేచును)

వసు—పితాపుత్రుల యభ్యుదయముమాత్రము నేను గోరుచున్నాఁడ. యువరాజు వచ్చువేళయినది. ఇఁక సెలవిమ్ము (లేచును)

శంత—మంచిది. కుమారు నభినందించి తోడ్కొని రండు.

(ఇరువురు నేపథ్యాన్తరితులై వచ్చి పరిక్రమింతురు.)

శంత—(నిశ్చింతత నభినయించి) ఛీ! పాడుకోరిక యెంతపని చేసినది? తొలుతనే యీతెలివి యున్నచో నీచర్చయే రాకుండును గదా! నే నింతదనుక మనోవైకల్యమున నిట్లు పడియుండుటఁ గదా నాపనికిమాలినసంకల్ప మిట్లు బయటఁ బడినది! కానీ గతించినదాని కిపు డేమి చేయుదును? (ఇంచుక యాలోచించి) నా కుభయసాధనమైన జ్ఞానమార్గ ముపదేశింపు మని కోరఁగా, నాగురుఁడు "నీపుత్రుఁడే నీ కుభయతారణకారణ" మని వచించె. దీనిభావ మేమైయుండును? నాకుమారుఁడే యీవర మిచ్చి సత్యవతిని గొని వచ్చునని కాదు గదా? (సాశంకముగా) అకటా! ఇదియే నిజమైనచో నాజీవన మెంతయవమానముపా లగును? తెలిసినచో నతఁ డంతటి మహాసాహసుఁ డగుటకు సందేహము లేదు. కాని మంత్రిపురోహితు లతనికిఁ జెప్పుదురా? (ఊహించి) అయ్యో వెఱ్ఱి! వారు చెప్పకున్న నెట్లయిన నింతవఱకు వచ్చినప్రసంగ మతనికిఁ దెలియకుండునా? ఔరా! కామాంధత్వమున నాచరిత్ర మెంతలజ్జాకరమైనది? (ధైర్యమవలంబించి) కానీ! ఇఁక నే నావిచారణ చేయకున్నచో నెవరే మనుకొన్నను భయములేదు. ఇఁక నామార్గమునకు నే నుపాయ మాలోచించుకొనియెద. (లేచి) స్నానమందిరమునకుఁ బోయెదను. (నిష్క్రమించును.)

రంగము:—పురవీథి.

వసు—(పరిక్రమించుచు) గురూత్తమా! కురువంశకీర్తికి గొప్ప కళంకము రానున్నదని తోఁచుచున్నది.

యజ్ఞ—(పరిక్రమించుచు) సందేహ మేమి? లోకాపవాదము నకు జడిసి యితఁడు పెండ్లి వల దనుచున్నాఁడు గాని నిరీహఁడే గాడు. కావున నితఁడు సత్యవతీబద్ధచిత్తుఁడై కుందుచుండుట తప్పదు. ఇఁకనో పరేంగితజ్ఞానియు విశేషప్రతిభాశాలియు నగు దేవవ్రతుఁ డీతనిహృదయ మెల్లను గ్రహింపక మానఁడు.

వసు—అదియే శంకించుచున్నాను. కాని మనము మాత్రము యువరాజున కీయుదంతము చెప్పఁ దగదు.

యజ్ఞ—సత్యమే. కాని, తుద కతనికిఁ దెలియకపోదు.

వసు—మనచేత నైనంతవఱకుఁ దప్పించుకొని మాటలాడుట యే మనపని.

యజ్ఞ—ఆహా! చిరకాలమునుండి కౌరవవంశము నాశ్రయించి జీవించుచున్నందుకుఁ దుద కీపెద్దవయసున నేమి వైపరీత్యము చూతుమో యని భయముగా నున్నది.

వసు—సత్యము సత్యము. ముందు చూచిన నుయ్యి, వెనుకఁ జూచిన గొయ్యి యున్నట్లున్నది. నాయెఱుఁగినంతలో రాజసంబంధమయిన యిట్టివిషయ మేదియుఁ దటస్థింప లేదు. నేఁటికి సంప్రాప్తమైనది. కానిం డేమగునో చూతము.

(తెరలో జయభేరీరవము రథనేమిధ్వానము.)

యజ్ఞ—అదిగో యువరాజురథము పురద్వారముకడ నిలిచినది. రమ్ము రమ్ము. (వడిగా నడచుట యభినయింతురు.)

వసు—(పరిక్రమించి) అపుడే కుమారరాజు రథము దిగి సపరివారుఁడై ద్వారముఁ జేరుచుండె.

రంగము:—పురద్వారము.

(అంత యథోక్తముగా ముందు దేవవ్రతబాహ్లికులు వెనుక జయసింహ జయసేనులు ప్రక్కల వందిమాగధులు ప్రవేశించుచున్నారు.

వసు—యజ్ఞ, (ఎదురుగా నేగి పుష్పహారము లర్పింతురు.)

దేవ—(గ్రహించి) ఆర్యులారా! నమస్కారము.

వసు, యజ్ఞ—కళ్యాణ మగుఁగాక.

బాహ్లి—గురువరా! నమస్కారము.

యజ్ఞ—పుత్రపౌత్రాభివృద్ధి యగుఁ గాక.

బాహ్లి—అమాత్యా! అన్నగారి కారోగ్యమా?

వసు—చిత్తము. మీయాజమాన్యమున నివ్వివాహోత్సవము జరుగఁ దగు నని సెల విచ్చిరి.

దేవ—సచివోత్తమా! జనకపాదులఁ గూడ నాచిత్తము తత్తఱించుచున్నది. శీఘ్రముగాఁ గోటకుఁ బోవు నేర్పాటు చేయుము.

వసు—చిత్తము. చిత్తము.

(అంత వీథి కిరువంకల విజయపతాక లెగురుచుండ, అందందు నిరుఁగడలఁ బాతిన యరఁటిచెట్లతోడి స్తంభములకుఁగట్టిన రాజకుమార రాజనామాంకితంబు లగు విచిత్రాంబరము లెదురుగాఁ గన్నులపండు వగుచుండ ముందు దూరముగా నృత్తగీతవాద్యములు వీనులవిం. దగు

చుండ, ఉండుఁడు. చూడనిండు. తొలఁగుడు. లెండు. నడువుఁడు—
అను మాటలు వినఁబడుచుండ నందఱు పరిక్రమింతురు.)

(తెరలో మంగళవాద్యధ్వని—పిదప)

వంది—చ. జయము జయంబు దివ్యశరశస్త్రవినిర్జితశత్రుభూవరా!
జయము జయంబు రాజనయశాస్త్రవశీకృతమానవేశ్వరా!
జయము జయంబు శాంతనవ సర్వదిశానృపమౌళిశేఖరా!
జయము జయంబు దిగ్విజయ సంచితదివ్యయశోధురంధరా !

మాగ—సీ. మాగధంబును గెల్వ మాటలా? నీప్రతా
పాగ్నిలో నాహుతి యయ్యెఁ గాని
ప్రాగ్జ్యోతిషావనీవరుఁడు సామాన్యుఁడా?
నీయస్త్రముల డిల్లపోయెఁ గాని
గాంధారరాజుదుర్గము ముట్ట శక్యమా?
నీకృపాణము దానిఁ దాఁకెఁ గాని
మాహిష్మతీనాథుమద మప్రసిద్ధమా ?
యది నీశరంబుల నణఁగెఁ గాని

గీ. దక్షిణోత్తరపూర్వదిగ్ధరణినాథ
సరసిజాంజలి పూజిత చరణయుగళ!
భరతసామ్రాజ్యయువరాజ! భవ్యతేజ !
శంతనుకుమార! కురువీర జయము జయము.

దేవ—(చిఱునవ్వు నవ్వును.)

అందఱు—జయము జయము కుమార సార్వభౌమా.

(తెరలో మృదంగధ్వని)

వంది, మాగ—బంధురవృత్తము.

కురుకులతిలకునిఁ గనుఁగొన దగు మీ కోర్కులు పండఁగ వేడుకతో

నరినరపతితతిమద మణఁచినయీూహ స్త్రీపురీశకుమారవరున్
భరతునివశమున ముసు పరఁగినభూభాగము గెల్చినవీరమణిన్
గురుతరయశమును జనకున కిలలోఁ గూర్చినభర్తుని శాంతనవుణ్

అందఱు—కురుకుమారసార్వభౌమా! జయము జయము.

వసు—కుమారరాజా! కోటయొద్దకు వచ్చితిమి.

(అందఱు నిలిచెదరు.)

రంగము:—దుర్గసింహద్వారపురోభాగము.

బాహ్లి—మీరాయందఱకు భోజనసమయ మతిక్రమించు చున్నట్లున్నది. ఇప్పటి కీయుత్సవము చాలింతము.

వసు—చిత్తము. ప్రభువుల సెలవు. మీరును దూరప్రయాణ మొనరించి యలసి యుంటిరి.

యజ్ఞ—చ. సకలకలాప్రవీణ! సయసత్యదయాభరణా! మహాహవ
ప్రకటభుజాబలుండ వయి రాజుల నెల్లర నోర్చి వచ్చిని
న్నకలుష మైనప్రేమ మనసారఁగఁ గౌఁగిటఁ జేర్చి విశ్వనా
యకుఁ డగుశంతనుండు ముదమందెడుఁ గాత శుభంబు గావుతణ్.

దేవ—గురువరా! నందనము. నాయనగారిని సందర్శించి వచ్చెదను.

నంది,మాగ—జయము జయము. కౌరవసార్వభౌమా! జయము జయము. కుమారసార్వభౌమా! (అందఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

శ్రీరస్తు.

ప్రతిజ్ఞాశాంతనవనాటకము

చతుర్థాఙ్కము.

రంగము—దాశరాజు మేడక్రిందిద్వారము.

(తెరలో) వీరసేనా! పైకి వెళ్లుట కిది సమయము గాదు.

వీర—(ప్రవేశించి) ఏమోయి శూరసేనా! మంత్రిగారి కిచ్చిన యీలేఖపట్టుకొని నిన్నటినుండి తిరుగుచున్నాను. ఎపుడును సమయమే దొరక కున్న దేమి?

శూర—(ప్రవేశించి) అవును గాని యీనడుమ నీవు హస్తినాపురము వెళ్ళినావంట! ఎందుకు?

వీర—మాబందుగులయింటిలోఁ బెండ్లి యయినది. అందుకు వెళ్ళి వచ్చినాను.

శూర—ఆపట్టణ మంతయుఁ జూచినావు కాఁబోలు! విశేషము లేవయినఁ జెప్పవా?

వీర—ఏమి చెప్పుదును? ఆనగర మంతయు యువరాజుగారి విజయోత్సవములలో మునిఁగి యున్నది. అబ్బా! అది నగరము గాదు. కన్నులవైకుంఠమే.

శూర—కన్నులకఱవుదీఱ నీ వారాజులను జూచితివి కాఁబోలు!

వీర—పెద్దచక్రవర్తిగారిని జూడలేదు.

శూర—ఏమి? వా రుత్సవము జరుగునపుడు రాలేదా?

వీర—లేదులేదు. సరియేకాని, మనరాజుగారు పైచావడిలో లేరా యేమి?

శూర—ఏమో! తెలియదు.

వీర—తెలియక యెట్లు చెప్పుచున్నావు?

శూర—'రాణిగారు చావడిలోనికి వచ్చియున్నారు. ఇపు డెవరిని పైకి రానీయఁగూడ' దని మాలిని చెప్పివెళ్ళినది.

వీర—అట్లయిన వెళ్ళిపోయెదను.

శూర—అట్లు చేయుము. (ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది ప్రవేశకము.

రంగము:—మేడమీఁది చావడి.

[ఆసందిపైఁ గూర్చుండి యాలోచించుచున్న దాశరాజపత్ని పద్మావతి ప్రవేశించుచున్నది.]

పద్మా—ఎపుడో శంతనుఁడు వచ్చును సత్యవతిని పెండ్లాడు నని కొండంతాసతో నుండఁగా నతఁడు వచ్చుటయు వచ్చినదారినే వెళ్లుటయుఁ గూడ సంభవించినదఁట. అకటా యిపు డేమి గతి! అమ్మా సత్యవతీ! నీభాగ్య మిట్లున్నదా! ఏముహూర్తమున భూమిమీఁదఁ బడితివో! పుట్టినది మొదలుగా నీజన్మము కష్టములపాలే యగుచున్నది. తల్లిని గోల్పోయి తండ్రికి దూరమై కన్నులు తెఱవనికసుఁగందవై మాయిల్లు చేరితివి. మాభాగ్యవశమున శ్రీమహాలక్ష్మియే మాయిల్లు చేరిన దని తలఁచి నీమొగము చూచినంతనే సంతానము లేని చింత వదలి పరమానురాగముతో నిన్నుఁ బెంచి పెద్దదానిం జేసి విద్యాబుద్ధులు నేర్పితిమి. అయిన నేమి? నీవలన నైన ముద్దుముచ్చటలు దీఱకుండ దైవము మా కడ్డునడుచుండె. మే మింతియే నోఁచితిమి కాఁబోలు! (ఉస్సురని) కుమారీ! ఉపరిచరునిమాట కెదురాడ లేక మీతండ్రి నీ కేదో మహారాజ్ఞీయోగము పట్టు నని, పేరాసవడి లోకములో నెంతగతిలేనికులబాలికయుఁ జేయరానికష్టపుఁబనికి నిన్ను

నియమించె. అట్టినీచకార్యమున నిన్నుఁ జొనుపుట తగ దని యెఱిఁగి యు తాతిగుండెదాననై యామాటలు వినుచు నిశ్చేష్టప్రతిమనై యూరక నిలిచితిని గాని యీముద్దరా లేమి యోడ గడపుటయేమి యని నివారింప నైతిని. అకటా! అట్టియెడ లజ్జావిషాదవిస్మయములు ముప్పిరిగొన దీనాననముతో నావైపు తిరిగి తిరిగి చూచుచు యమున కేగినతొలుతనాఁటి నీమొగము తలఁచికొన నిపుడు గూడఁ గడుపు చెఱు వగుచున్నది గదే తల్లీ! అయ్యో యెంతతప్పు చేసితిమి! నిన్నంత కష్టపెట్టియు నేమి ఫలము గాంచితిమి? (ఆలోచించి) ఔరా! ఎంత పని జరిగినది? దీనిని బట్టి చూడఁగా నిఁక నీసంబంధము కుదుర దేమో యని తోఁచుచున్నది? ఇంకను శంతనుఁడే మనపిల్లను పెండ్లాడు నని చెప్పెడి యీయనమాటల నెన్నాళ్లు నమ్మిచుందును? (తలఁచి) ఏవర్తమానము తెలియక జాగగుచున్నకొలఁదిని బిడ్డ బెంగ పెట్టి కొని చిక్కిపోవుచున్నది. ఏమో యమునగఁ దలఁచి వచ్చి సిగ్గుపడి వెనుక మరలిపోవుచుండును. దానిబెంగ నూస్ప నా కేమియు నుపా యము తోఁచకున్నది. (ఊహించి) దైవఘటన యెట్లుండునో తుద కట్లే జరుగు ననుమాట నిజమే కాని కన్నెలకుఁ బెండ్లిచేయుటలో సంపన్నులకుఁ గలిగెడికలఁత దరిద్రులకుఁ గలుగ దని చెప్పవచ్చును. అందును రాజకుటుంబములలోనికన్నెలకుఁ బెండ్లి యగుట విశ్వప్రయ త్నమూల మగుచున్నది.—కానీ! యిపు డాయన వచ్చును గదా? ఈసంబంధము కుదురు నని నమ్మకము నిశ్చయముగా నున్నదా, లేని చో నింకొకవరునిఁ జూతురా? యని యడిగెదను. (ద్వారమువంకఁ జూచి) ఆఁ! వచ్చుచున్నారు. (లేచును.)

దాశరాజు.—(ప్రవేశించి) ప్రియసీ! కూర్చుండుము.

(ఇరువురు నుపవసింతురు.)

పద్మా—మనపిల్ల పెండ్లిమాట యేమి?

దాశ—శంతనుఁడు పెండ్లాడుట నిశ్చయమే.

పద్మా—ఎప్పుడు?

దాశ—అది నే నెట్లు చెప్పఁగలను? దైవఘటన యెప్పటికో యప్పుడు.

పద్మా—ఎప్పుడు నిట్లే చెప్పుచుంటిరి. దీని కవధి లేదా?

దాశ—దైవాయత్త మయిన కార్యమునకు మనయత్న మేమి యక్కఱకు వచ్చును? ఇది తొందరపడఁ దగిన విషయమా? ఇంత కును శంతనుఁడు కుమారునిదిగ్విజయోత్సవమున నితరకార్యములుమఱ చియుండును. ఆయుత్సవములు నిప్పటికి సమాప్తము లయి యుండును. ఎట్లయినను, అయినంతజాగిఁకఁ గాఁబో దని నా నమ్మకము.

పద్మా—ఏమో! పిల్ల బెంగచే సగ మయినది చూచితిరిగదా!

దాశ—అవును. ఏమి చేయుదును? ఉపచరిచరునిమాటలను నమ్మి సమయము ప్రతీక్షించుచుండవలసినదే.

పద్మా—అట్లయిన నిజము తెలియక లోలోనఁ బరితపించు చున్నదానికి ధైర్యము చెప్పవలసి యున్నది. మే మెవరము చెప్పినను మీరు చెప్పినట్లుగా నుండదు.

దాశ—నిజము చెప్పినచోఁ గేవలము దైవమునిూఁదనే భార ము పెట్టవలసివచ్చును గదా యని మఱింత పరితపించునేమో! అయి నను జూచి వచ్చెదను (ప్రక్కకుఁ జూచి) సత్యవతి యీ గదిలోనే యున్నది గదా?

పద్మా—అదిగో! ఈగదిలోనే వెఱ్ఱిపిల్లవలె నొక్కతెయు నేదో చూచుచుఁ గూర్చుచున్నది.

దాశ—సరియే నీవు వెళ్లుము. నేను మంత్రితోఁ దొందరగా మాటలాడవలసినవిషయ మున్నది. అతనితో మాటలాడి యిపుడే వచ్చి సత్యవతిని జూచెదను. (అని నేపథ్యాన్తరితులై వెడలుదురు.)

రంగము—అందే గది.

(అంతఁ జిత్తరువు పరిశీలించుచున్న సత్యవతి యథోక్తముగాఁ బ్రవేశించుచున్నది.)

సత్య—(చిత్తరువు పరిశీలించి) ఇప్పటి కెట్లో యామహారాజు పోలిక తెచ్చితిని. కాని చిత్రికలను గూడ శిక్షింపఁ జాలెడి సౌందర్య సారం బైనయాలావణ్యము నెట్లు సరిచేయఁగలను? హా! మనోహరా!

చ. అరసినయంత చిత్తమునఁ నంటినయంతయు నైన నీ మనో
హర మగురూపు వ్రాసి ముదమందఁగఁ జూచినఁ జూపుఁ జిత్తమున్
'బరవశ మైతి వీ వనఁగ భ్రాంతిని జెందితి వీవు' నాఁ బర
స్పరముసు బోరి వ్రాఁతపని సాగఁగ నీయఁగ వి దేమిచిత్రమో!

(చిత్రపటము చూచి) ముఖము చూచినంతనే హృదయము తెలియునట్లు వ్రాయునేర్పు నా వంటిదానికి శక్య మగునా? చిత్తవైకల్య మభినయించి) రాఁబోవుమంచి గాని చెడ్డ గాని ముందుగా మనస్సున కెఱుకపడు నఁట. అపు డపుడు నాయుల్లము కలవరపడుచుండుట చూడ నేమి రానున్నదో తోఁచకున్నది. (ఆలోచించి) అభీష్టసిద్ధి కెదురుచూచు వారిచిత్తము లనిష్టమును శంకించుటయు నైజమే. (శబ్దశ్రవణమభినయించి)మనోరమకాఁబోలు(చిత్రఫలకము దాఁచును)

మనో—(సత్వరముగ వచ్చి) చెలీ! యెన్నాళ్ళకు నిన్నుఁ జూడఁ గలిగితినే (అని సత్యవతిని కౌఁగిలించును.)

సత్య—నీవు వచ్చితి వని తెలియఁగానే నీకు వర్తమానమంపితిని. మాలిని నీతోఁ జెప్పినది గదా?

మనో—చెప్పినది (నవ్వుచు) ఇపు డేడ గడపుట మాని వైచితివఁట కారణ మేమే !

సత్య—నాయనగారి యాజ్ఞయే.

మనో—సరియే కాని నీ మొగము చూడఁగా నేదోయొక పెద్ద యాలోచన చేయుచున్న ట్లున్నది. అ దేదో చెప్పవా?

సత్య—ఆలోచన యే మున్నది. నీ వెప్పుడు వచ్చెద వనియే.

మనో—చెలీ! నాదగ్గఱనా దాఁపఱికము!

సత్య—సరియే దాని కేమి గాని ప్రభువర్యులహృదయ మె ట్లుండునో చెప్పుము.

మనో—అది నా కెట్లు తెలియును? అయినను న న్నడిగితివి గావున వినికిని బట్టి తెల్పెద వినుము.

చ. చన వయినట్టు లుండి విరసం బగు నప్పుడె, రాయి యయ్యు నం
తనె కరఁగుఁ, గనంబడక దగ్గఱ నుండును, జొచ్చి చూడఁగా
ననువుగ నుండి లోఁ దగు, దయామయ మయ్యును వజ్రతుల్య మై
కనఁబడు, నిట్టి దట్టి దనఁగా వశమే ప్రభుచిత్త మేరికిన్?

సత్య—ఔనే! సౌందర్యముతోఁ గూడ సౌజన్య ముండు ననుటలో నీయభిప్రాయ మేమి?

మనో—ఏమో! ఇది పెక్కు-చోట్ల విపరీత మగుచున్నది.

సత్య—అవును నిజమే. అది శరీరధర్మము. ఇది మనోధర్మము. అంతరంగ బహిరంగధర్మముల కైక్య మె ట్లుండును.

మనో—(నవ్వి) ఇ దంతయు నేల? నీవు వ్రాయుచిత్తరువు చూప రాదా?

సత్య—(తేఱిచూచి నవ్వుచు) మాలిని యెపుడో చాటున నుండి చూచి యిపుడు నీతోఁ జెప్పి యుండును. లేకున్న నీ కెట్లు తెలియును? కాని చూచినచో నవ్వుదు వేమో! (చిత్రఫలకమిచ్చును.)

మనో—(చూచి) సఖి! నావాదము వదలుకొన్నాను. ఈ

నిరుపమానతేజస్సంపదతో సుగుణసంపద యుండుట కబ్బురమేమి? నిజముగా నితఁడు శంతనుఁడే కదా?

సత్య—(మందహాసముతో) చెలీ!

ఉ. ఒకనిని బోలి వేఱొకరుఁ డుండు నొకో! కవపిల్లలందు నిం
చుకయును బోల్కిభేదమును జూడమె? యొండొకమేని తీరు నిం
కొకయెడ సృష్టికర్త మదియుక్ సరిపుచ్చఁగ లేకయుండఁ, బొం
దిక సరిపుచ్చ శక్యమగునే ననుబోఁటుల చేతి కుంచెకున్?

మనో—సరిలే. ఈచిత్రవర్ణనమే నాసంశయము తీర్చినది. కాని, మీపరస్పరసందర్శనాదిప్రసంగ మ్మెఱిఁగించి నాకుతూహలము దీర్పవా?

సత్య—మృగయావిహారార్థ మడవుల కేతెంచిన యాపౌరవో త్తముఁడు సురభిగంధము తెరువుఁబట్టి మనపాంథాశ్రమమున కరు దెంచె. ఇఁకఁ జెప్పఁదగిన దేమున్నది? కాని యి దొక్కటి వినుము.

చ. జనవర! నీదుకోర్కి గురుసమ్మతి నందుట యుక్తమన్న నా
మనవి గణించి యానృపుఁడు మాజనకుం గని యేగి నేఁటి క
య్యెనుగద యాఱువారములు నింతకు నప్పటి వారిమాటలె
ట్లును దెలియంగరామి మదిలోపల నుయ్యెల లూఁగుఁ గోరికల్.

మనో—ఇంతలోఁ దత్తఱ మేల? మీతండ్రి చెప్పకుండునా? (చప్పుడు విని) ఎవరో వచ్చుచున్నారు.

సత్య—(చిత్తరువు దాఁచి) నాయనగారేమో!

దాశ—(ప్రవేశించి కూరుచుండి) కుమారీ! ఉపరిచరుని మాట కెదురు చెప్పలేక నిన్నుఁ గష్టపెట్టుచుంటి మని మీయమ్మయు నేను నెంతో విచారించుచుందుము. ఇప్పటికి నీకష్టము గట్టెక్కినది. చూచితివా నీజనకుని దూరదృష్టికి ఫలము! శంతనుఁడు నిన్నుఁ గోరి మన యింటికి వచ్చెను.

మనో—మహర్షులదూరాలోచన మూరక పోవునా?

సత్య—(సంతోషముతో సిగ్గు నటించును.)

దాశ—అమ్మా! నీవు నాయెడఁ జూపిన భక్తిగౌరవముల కెంతయు నానందించితిని జుమీ!

మనో—పిల్లల వయోనయములు తల్లిదండ్రులశిక్షను బట్టి యుండును. ఇం దాశ్చర్య మేమి? కాని, యామహారాజునకుఁ జెప్పిన మాట వినఁ గుతూహల మగుచున్నది.

దాశ—వేఱుమాట యేమి పుట్టును?

చ. వరునకుఁ జెప్పినట్టి గుణవర్గము గల్గినరాజు సర్వభూ
వరులకు రాజు శీతకరవంశపయోనిధిరాజు కౌరవే
శ్వరుఁ డగు శంతనుం డడుగ వచ్చినఁ గన్య నొసంగ ముందు వె
న్కరయుదు నొక్కొ? నే నతని నల్లునిగా మదిఁగోరుచుండియుజ్.

మనో—ఔను. కౌరవాన్వయముతోడి చుట్టఱికము కోరినను లభించునది గాదు. అట్టిది యప్రయత్నముగా వచ్చుచుండ వల దనువా రుందురా?

సత్య—(లజ్జ నటించును.)

మనో—అట్లయినచోఁ బరిణయమునకు విలంబ మేల యగుచున్నది?

దాశ—ఎందుచే నగుచున్నదో చెప్పఁజాలను గాని తప్పక కార్యము మాత్రము నెఱవేఱు నని చెప్పఁగలను.

సత్య—(తనలో) ఇతనిమాటలు పరిశీలింప నేదో యొకగొప్ప యంతరాయము వచ్చి యుండు నని తోఁచుచున్నది.

మనో—ఆకౌరవేశ్వరుఁడు మరల వార్తయైనఁ బంపక తాను తాక యూర కుండుటకు మీ కేమికారణము గనఁబడుచున్నది?

దాశ—(తనలో) ఎట్లు చెప్పుదును? చెప్ప కున్నచో వీరు మఱియు సంశయింతురు_కానీ! జరిగినదానిని దెల్పి వీరిసంశయము తొలఁగించుట యుక్తము. (ప్రకాశముగా)

చ. అనఘచరిత్ర! సత్యవతియందు జనించిన నీ సుతుండు నీ
వెనుక ధరిత్రి నేలుటకు వేడ్క_ వరంబు నొసంగు దేని నా
తనువును నీదుకోరికయు ధన్యతఁ గాంచు ననంగ నాఘనుం
డనుమతి చూప కేగెఁ దనయానసమం దొకవింత దోఁపఁగ౯.

సత్య—నివ్వెఱపడి (తనలో) అకటా! ఆమహారాజునకుఁ బుత్రు లున్నారు కాఁబోలు!

మనో—(సవిస్మయముగా) అయ్యో! ఈ వర మతనికి వింత గలిగింపఁ గారణ మేమో!

దాశ—దేవవ్రతుఁ డనుపుత్రుఁ డుండుటయే.

సత్య—(మనోవేదన నణఁచికొనును.)

మనో—(నివ్వెఱపడును.)

దాశ—మనోరమా! వెఱ పేల? ఈకారణమున నతఁడు పెండ్లి మాను నని తలఁచెదవా?

సత్య—(తనలో) సంశయమేల?

మనో—ఈవర మిచ్చి సత్యవతినే పరిణయ మగునా యని —

దాశ—కుమారీ సంశయించెద వేల? ఈమాట నీ కిపుడు నిజముగాఁ దెలుపఁ దగినదియే కాదు. కాని యూరక జాగగుచుం డుటచేఁ గారణము తెలియక యే మనుకొందువో యని చెప్పితిని. ఈ వరమైన, నుపచరునియాజ్ఞచే నడిగినది గాని వేఱు గాదు. ఆమహర్షి యాలోచనమునఁ గొంత సత్యమై కొంత యసత్య మగునా? కావున మన కోరిక తప్పక నెఱవేఱును.

మనో—అవును. త్రికాలవేత్త లగుమహర్షులమాట లనర్థములు కాఁజాలవు.

దాశ—(లేచి) కుమారీ ! ఆమహామునిమాటను నేను నమ్ము చున్నాను. మీయమ్మ నమ్ముచున్నది. దానిమాటను బట్టియే నీయను మానముఁ బాప నిందు వచ్చితిని. నీవు గూడ నట్లే నమ్ముము. సంశ యింపకుము. నేను బోయి వచ్చెదను. (నిష్క్రమించును.)

సత్య—చెలీ! వింటివి గదా? నేఁటితో నాయాస యడు గంటినట్లే. (చెక్కిలి చేతఁ జేర్చి యూహించి) అకటా! సకలధర్మము లెఱింగినయావిభునకు రాజ్యశుల్క మిష్టము గా దనుట స్పష్టము గదా! కావున నివ్వరముస కాతఁ డంగీకరింపఁడు. దీనిని విడిచి న న్నిచ్చుట కీతఁ డంగీకరింపఁడు. హా! పుబ్బలోఁ బుట్టి మఘలో మా డిన దన్నట్లుగా నామనోరథ మెంతలో వ్యర్థ మైనది! అయ్యో!

చ. కలుగఁగ నేల యీసురభిగంధము! దీనికిఁ గారవేశ్వరుం
డలరఁగ నేల! నా కతనియం దనురక్తి జనింప నేల! మా
తలఁపు వరంబునం బ్రతిహతిం బయి పోవఁగ నేల! చిత్తముల్
కలసినవారికూటమి నకారణవైరమి దేల దైవమా?

అకటా చెలీ! ఈవర మీయకున్నను నావంటికన్నె లామహారాజునకు వేనవేలు దొరకుదురు గాని నాతండ్రి యీవరమే విడువ కున్నచో నమ్మహీవరునివంటివరుఁడు నాకు దొరకునా? (ఆలోచించి) ఛీ! దొర కిన నేమి? ఒకనికి మన సిచ్చి వేఱొకనికిఁ జే యిచ్చుట యుత్తమ కన్యలధర్మమా? హా! యెంతమందమతిని! పెంచినవారిమన సాక్ష మాఱు చివుక్క మను నని గాంధర్వమున కొడఁబడక మనసారఁ గామించినవానికూర్మికిఁ గలకాలము దూరము గావలసి వచ్చినదిగదా?

మనో—సఖీ! జరిగినదానికి విచారింపకుము. ఉపరిచరమహర్షి మాటయే పాటించుచుండుము.

సత్య—ఎక్కడిమాట! దైవము పౌరుషమునకుఁ దోడ్పడును గాని తనంతఁ దానే యేకార్యమును జేయఁబోదు. ఇందు పురుష యత్నము ప్రతికూలముగా నుండ నిఁక దైవ మెట్లనుకూలించును? ఔరా యెంతవంతపాల్పడితిని!

ఉ. కోరినవాఁడు నిక్క మగు కూరిమి దెల్పినవాఁడు నన్ను దే
వేరిఁగఁ గైకొనంగఁ దలపెట్టినవాఁడు సముద్రమేఖలో
ర్వీరమ నేలువాఁడు కనువిం దగునవ్వుమొగంబువాఁడు నౌ
భారతరాజు భర్త యగుభాగ్యము నా కిఁకఁ గల్గునే చెలీ!

మనో—చెలీ! తొందరపడి నిరాశ చెంద నేల? సీతలిదండ్రుల కంటె నీ కెక్కువ తెలియునా?

సత్య—తెలియుట కే మున్నది? అతఁడు నిరాశ చేసికొనిన మాట నిక్కము. కాకున్న-చో గాంధర్వము నపేక్షించి కూర్మి చూపినవాఁ డింతకు రాకున్న మానె వార్తయైనఁ బంప కుండునా?

మనో—అట్లు కాదు. ఇది మిక్కిలి దూర మాలోచింపవలసినవిషయ మగుటచే జాగగుచున్న దని తలఁచెదను.

సత్య—ఇంక నతఁ డాలోచించున దేమి? మనసు విఱిగిన మరల నతుకు కొనునా? వట్టిమాట. (ఆలోచించి) చెలీ! కార్యము పాకము తప్పినది. ఇఁక నే మయినను బ్రయోజనము లేదు.

ఉ. అక్కట! వెఱ్ఱిబుద్ధిమెయి నందనిపండ్లకు నఱ్ఱు సాఁచిన
ట్లక్కురువీరుఁ గోరి హృదయార్తికిఁ జిక్కితి మారుబారికిం
దక్కితిఁ గాక, కల్గునొకొ తక్కువనోములు నోఁచినట్టినా
కెక్కువలాభ, మింక సుఖ మేదినయాంబ్రతు కేల భూమిపై ?

హా మనోహరా! "మనమనోరథము దాశరాజసమ్మతము గావింప నిశ్చయించితి" నని నాఁడు నీ వన్నకూర్మిపలుకు దలంప నిపుడు

గుండె నీరగుచున్నది. పితృభక్తిచేనైనను నిన్నట్లు పంపుట నాదే పొరపాటు, నేనే వంచకురాలను. అంతర మెఱుఁగక యకారణముగ నీ కాస గొల్పితిని. అకటా! పన్నేమను కొందువో కదా!

వసుధావృత్తములు.

(1) ధరణీరమణా, పరమాదరణా! వరణీయగుణా, భరణా రమణా!
నినుమోసముచే, సినకన్నియచే, కొన నీవెడఁగో, ర్కినిజేసెదొకో!
నను దూఱెదవో, ననుఁగోరెదవో! నినుఁ జేరఁగనా, కనువేర్పడునా?

హా! ప్రాణప్రియా! తలఁచినవరుఁడు తానయై ప్రార్థింప నడ్డము చెప్పునా యని గురుసమ్మతి నపేక్షించి, నీ కేదు రాడిన నాపాపమే వరరూపమున నన్ను బాధింపఁ జొచ్చినది. కానిమ్ము. ఈ జన్మమునఁ గాకున్న ముందుజన్మమున కైన నా నిశ్చలానురాగమే నాకు నీపొందు సమకూర్చును. నీకివే వేయి వందనములు.

మనో—(భుజముపై చేయి వైచి) సఖీ! ఏమీ వెఱ్ఱి. నీజనకుఁడు దేవపూజ్యుఁడగు తపోధనుఁడు. అతని మాట విశ్వసింపవా?

సత్య—చెలీ! ఏమి విశ్వాసము!

మ. అనురాగంపురసంబునన్ మధురమై యాశావిశాలంబునై
ఘనగంభీరత సుప్రసన్నమగు దీర్ఘ ప్రేక్షణం బాశయం
బును బైఁ జిల్కెడిసుస్మితంబును ముదంబుం గూర్చు వాక్యామృతం
బున నాయుల్లము దన్పినట్టి గుణధాముం జూతునే వెండియున్?

(ఇంచుక యాలోచించి) రాజ్యవరమున నిరస్తమనోరథుఁడగు కురువంశవీరుఁ డింకను నన్నుఁ దలఁపట్టు ననుట రిత్తమాట. (లేచి, ఉస్సురని) హా దైవమా! నా పూర్వ జన్మ సుకృత మిట్లున్నదా?

మనో—(లేచి సత్యవతి చేయి పట్టికొనును.)

---

(1) ఈ పద్యము పల్లవిగఁ దక్కిన పద్యములు చరణములుగను పాడుదురు.

సత్య—చ. మనసున కెక్కినట్టి నవమన్మథుఁ డాసలమీర జీవనం
బునకు నిదాన మైనకురుభూవరుకూర్మికి దూర మైననా
మనుగడ గాంచుభాగ్య మవమానము గాక మఱేమి గల్గుఁ? గా
వున నిఁక నీరో నిప్పొ సుఖపూర్తికి మార్గము గాఁగఁ జూచెదన్

(అని పరిక్రమించును.)

మనో—(నిలిపి) ఏ మీయవివేకసంభాషణము! మీజనకుని మాట యమోఘ మని యెఱిఁగియు నీభ్రాంతి యేల? దైవ మను కూలించును. నమ్ముము.

సత్య—చెలీ! నే నేమి చేయుదును? నామనసు నాలో లేదు. ఇఁక నే నిందు నిలువఁ జాలను.

మనో—అట్లయిన నెండవేఁడిమి తగ్గినది. చిత్తవిశ్రాంతి గలుగఁ జల్లగా నాశ్రమంబున నించుక సేపు విహరించి వత్తము రమ్ము.

(ఇరువురు పరిక్రమించుచుండ)

సత్య—చెలీ! పురుషయత్నము ప్రతికూలముగా నుండ నిఁక దైవ మెట్లనుకూలించునే?

మనో—ఇఁక నాలోచింపక రమ్ము. సందర్భ మంతయుఁ బరిశీలింపఁగా నా కొకటి తోఁచుచున్నది. ఇది చెప్పవలసిన మాట గాదు గాని చెప్పెద వినుము. ఇఁక నీ భాగ్య మంతయు దేవవ్రతుని పితృభక్తితో నున్న దని నాయభిప్రాయము.

(నిష్క్రమింతురు.)

ఇది చతుర్థాంకము.

—x—

శ్రీరస్తు.

ప్రతిజ్ఞాశాంతనవ నాటకము

ప్రథమాఙ్కము.

రంగము:—కౌరవరాజసభామందిరములో యువరాజుగది.

(కూర్చుండి యాలోచించుచున్న దేవవ్రతుఁడు ప్రవేశించును.)

దేవ—(తనలో) భరతఖండ మంతయు హస్తగతమై యుండఁ బరమానందములో నుండవలసిన యీసమయమున నితఁ డిట్లు మనోవ్యథతో నుండఁ గారణ మేమో తెలియకున్నదిగదా? వేఁట సలిపి వచ్చినప్పటినుండియు నిట్లే యుండెనఁట. నన్ను దిగ్విజయమునకుఁ బంపిననాఁటి యీతని ముఖవికాసములో వేయవవంతయినను విజయోత్సవమునాఁడు గనఁబడలేదు. అపుడే నా కనుమానము గలిగినది. పిదప నిట్లుండఁ గారణ మేమని యెన్నిమాఱు లడిగినను 'నీవు సకలరాజకార్యములు నిర్వహించుచుండ నా కేమి కొదవ యని నిర్విచారముగాఁ బ్రసన్నముగా నుంటి' నని బదులు చెప్పెను గాని ముఖలక్షణము మాత్ర మీతనిచిత్తవైకల్యమును జాటుచునే యున్నది. ఇందు కేదో ప్రబల మయినకారణ ముండు నని తలఁచి మంత్రిపురోహితులను రెండుసారు లడిగితిని గాని వారును దేల్చి వైచి యేమియుఁ దెలియనిరీతిగా మాటలాడిరి గాని మూల మెఱిఁగింపరైరి. నిజముగా వారికిఁ దెలియకుండునా? (ఊహించి) ఆపదలు వచ్చినపుడు గాని భయహేతువు గలిగినపుడు గాని యితరుల వలనఁ బరాభవము సంభవించినపుడు గాని తలఁచిన పని నెఱవేఱక

పోయినపుడు గాని చిత్తము కలఁతఁ జెందుట నైజము. ఇం దీతనికి మొదటిమూఁడును దటస్థింపలే దని చెప్పవచ్చును. ఇఁక నాల్గవ దానిం గూర్చి యాలోచింతము. ఇతఁడు వేఁట కేగినస్థల మేది? యమునాతీరముగదా? అందలి రాజులలో మాకు వశ్యులు గానివా రెవ రున్నారు? ఇంతకు నితఁడు వారిని గోరఁదగిన దేమి? కోరినచో నది ఫలింపక పోవుట యేమి? (ఊహించి) ఆఁ! నిజము నిజము. ఆ మనోరథ మిట్టిది గావుననే యింత గోప్యమై వేదనాహేతు వగుచున్నది. సామాన్య మయిన దయ్యేనేని యింతరహస్యముగా నుండునా? (మరల నాలోచించి) కాని దీనికి మాత్రి మింతగా లోలోపలఁ గుంద నేల? (తల యూఁచి) అం దేమిమర్మ మున్నదో! కానీ! నేఁడు ముందుగా ర మ్మని యజ్ఞతీర్థులకు వర్తమానించితినిగదా? ఆయనయు వచ్చుచుండును. 'తెలిసినచో నీఁక దాఁచకుండఁ జెప్పవలయు' నని నిక్కచ్చి చేసి యడిగెదను. (ద్వారమునంకఁ జూచి) ఆఁ! గురువర్యా! నమస్కారము దయచేయుఁడు.

యజ్ఞ—(ప్రవేశించి) సకల శ్రేయోఽభివృద్ధి యగుఁ గాక (కూర్చుండును.)

దేవ—ఆర్యా! విశేషము లేమి?

యజ్ఞ—సార్వభౌముఁడు రాజ్యవ్యవహారము వదలికొన్నను కుమారసార్వభౌముఁడు ప్రజానురంజకముగాఁ బాలించుచుండె నని పౌరు లెల్లరు పరమానందమగ్ను లగుచున్నారు. ఇంతకంటె వేఱేమి?

దేవ—సరియే కాని, నిన్న గాని నేఁడు గాని మీరు నాయన గారిని జూచితిరా!

యజ్ఞ—చూడక యేమి? నిత్య మొకమాఱు దర్శనము చేయుచునే యుందును.

దేవ—రెండుమాఱు లడిగినను మీరు నాయనగారి విచారమునకుఁ గారణము చెప్పలేదు. నిజముగా మీకుఁ దెలిసినచో నా

యందలి వాత్సల్యమునుబట్టి నేఁడు చెప్పక తప్ప దని కోరుచున్నాను. తెలిసినచో నన నేల? మీరుఁ దెలిసియున్న దని యే నానమ్మకము.

యజ్ఞ—(తల వంచి యాలోచించును.)

దేవ—గురువరా! యిఁక సంశయము వలదు.

యజ్ఞ—(తనలో) ఇది ప్రాణసంకటముగా నున్నది. ఏమి చెప్పుదును? ఎట్లు చెప్పుదును?

దేవ—అయ్యా! ఇది మొగమోటమునకు సమయము గాదు.

యజ్ఞ—కుమారా! అప్రియ మైనది సత్య మైనను జెప్పఁదగ దని నీతివచనము.

దేవ—ఆర్యా! ఇఁక నామనసు నొప్పింపవలదు. రాజకార్యమున మీవంటివారికి దాక్షిణ్య మొంతమాత్రము తగదు.

యజ్ఞ—(తనలో) అకటా! రాజసేవలో నున్నకష్ట మిదియే కదా! స్వేచ్ఛ యనునది లేనే లేదు. ఇష్టము గానిమాట యైనను జెప్పవలయును. అనిష్ట మైనపని యైనను జేయవలయును. ఇపు డామాట చెప్పుటకుఁ జప్పున నోరు రాకున్నది. ఇతఁడు బలాత్కరించి నాహృదయము పైకి లాగుచుండె. ఔరా! ఏమి చేయుదును?

దేవ—గురువరా! మీకు నిజముగా నాయందు వాత్సల్యమే కల దేని యింక సంశయింపక చెప్పెద రని నానమ్మిక.

యజ్ఞ—కుమారా! తుద కెట్టు నామీఁదఁ బడ నున్నది కాఁబోలు! కానిమ్ము. దైవము నానోటఁ బలికింప నుండఁగా నిందు నాయత్న మే ముండును? చెప్పెద వినుము. మొన్న యమునాతీరమునకు వేఁటకుఁ బోయినపుడు దాశరాజునకుఁ బెంపుడుకూఁతు రైన యుపరిచరమహర్షి పుత్రిక యగుసత్యవతియందు మహారాజున కనురాగముదయించె నఁట.

దేవ—(సోత్సాహముగఁ దల యెత్తి) తరువాత.

యజ్ఞ—అంత నీయన దాశరాజుకడ కేగి తనయభిలాష మెఱిఁగించె నఁట.

దేవ—సరియే. ఆమెకు గాంధర్వ మనిష్ట మని తెలిసినది. తరువాత.

యజ్ఞ—(సంశయములో నూరకొనును.)

దేవ—చ. గురువర! తండ్రికోర్కి సమకూర్చెద నెంతటికష్ట మైన లే
కరమర, న్యాయంబు వినయంబు బలంబు భయంబు నోలి నె
ప్పరుసన నైనఁ జూపి తుదిఁ బ్రాణము నైనను దారవోసి యిం
కరయఁగ నేల? తద్విషయ మంతయు నా కెఱిఁగింపు మియ్యెడన్.

యజ్ఞ—అంతటివాఁడ వని యెఱిఁగియే సంశయించితిని. కానిమ్ము. ఇంతవఱకు వచ్చినపిదపఁ జెప్పక తప్పునా? వినుము. అందు కతఁడు "నీ కీకన్నెయందుఁ బుట్టినవాఁడు నీపరోక్షంబున రాజగుటకు వర మొసంగుదు వేని కన్య నిచ్చెద" నని బదులు చెప్పెనఁట.

దేవ—మేలు మేలు. ఆకారణ మిప్పటికి బోధపడినది.

యజ్ఞ—అందు కితఁడు విముఖుఁడై వచ్చి మంచిచెడులు చర్చించుకొని వివాహవాంఛ వదలికొని యప్పటినుండియు నిట్లు యుండెను.

దేవ—పరిణయవాంఛ వదలుటకు దాశరా జడిగినవరమే కాని వేఱొండుకారణము లే దని తెలిసినది గదా!

యజ్ఞ—సత్యము సత్యము.

దేవ—గురువరా! వంశాభివృద్ధికిని ధర్మాచరణమునకును మూలమైన సార్వభౌమునిమనోరథము రిత్త యగుట ధర్మమా?

యజ్ఞ—కుమారా! ఇది రాజయువరాజులకు సంబంధించిన యాంతరంగికవిషయము. ఇందు నే నేమి చెప్పుదును?

గీ. పిన్ననైనను దెలివికిఁ బెద్దవాఁడ
వెఱుఁగుదువు ధర్మమర్మంబు లెల్లఁ గీర్తి
కాముఁడవు శూరుఁడవు వృద్ధిఁ గాంచఁదగిన
చిన్ని మొలకవు నీవె చర్చించుకొనుము.

దేవ—అయినను, మీరును మంత్రియు నేమాలోచించినారు.

యజ్ఞ—కుమారా! ఆలోచన కేమున్నది?

చ. అనఘుఁడు రాజరాజు నగునాతని పెండిలియుం బ్రజానురం
జన మగునీదురాజ్యమును జక్కఁగఁ జూడఁగ నొక్కరూప మా
కనుఁగవ, కట్టిచో నొకటి గాంచిన నొక్కటి గాంచఁబోము నా
మనమునఁ గుందుచుంటి మిఁక మామది దెల్పుట యెట్టు లియ్యెడన్?

దేవ—తేనియం దట్టిభక్తియు నాయం దట్టియనురక్తియు నుండుట సహజమే కావున మీరు కర్తవ్యము నిర్ణయింపఁ జాల కుంటి రని తలఁచెదను. కాని చిరకాలంబునకు దైవికముగా జనియించిన మాతండ్రి మనోరథము దీర్పక నేను రాజ్యమునఁ బొందునానందమేమి?

యజ్ఞ—(తనలో) ఆహా! కొడుకనఁగా నితఁడే కొడుకుగాని లోకములో నందఱు కొడుకులా? కుమారా! మహావీరుఁడ వగునీ మహౌదార్యము నే నెఱుఁగనిది గాదు. నే నవు నన్నను గాదన్నను నీ వెట్లయిన నీజనకునియభిలాషము నెఱవేర్పక పో వని యెఱిఁగియే యింతదనుకఁ దెలుప నైతిని. అకటా! దైవసంకల్పము! అట్లు సామ్రాజ్యలక్ష్మి యాతనిమొగమునఁ దాండవ మాడుచుండ నీజగదేకవీరుఁడు రాజ్యహీనుఁ డగునే? అయ్యో! కౌరవకులమున నిట్టివింత పుట్టు నని కల నైనఁ దలంప నైతిని. పితృభక్తిపరాయణుఁడు సర్వస్వతంత్రుఁడు నగు నితని కేమి చెప్పిన నేమి లాభము! అయిన నొక్కటి యని చూచెద. (ప్రకాశముగా) కుమారా! రాజు ప్రజాభిప్రాయమును గనుఁగొన చుండవలయు. లోకహితముగఁ బ్రజాపాలనము చేయుచున్న నీమూర్ధాభిషేకమున కెదురుచూచుచున్న మంత్రిసామంతాదిప్రకృతివర్గమున కుత్సాహభంగ మగును గదా యని విచారము.

దేవ—గురువరా! తనవారిని సంతోషపెట్టి కదా యితరులను సుఖపెట్టవలెను. నాకు నాజనకుఁడే సకలజగము. కన్నతండ్రిని గాదని నేను లోకమున కొనరించుహితము మాత్ర మేమి వన్నె కెక్కును? అది గాక నాయందలియవ్యాజానురాగమున నాతండ్రి యావర మిచ్చుట కిష్టపడఁ డయ్యెఁ గాని నిరంకుశాధికారము గల యతఁడే యావర మిచ్చినచో నేను జేయున దే మున్నది?

యజ్ఞ—ఇపు డయిన నతఁ డట్లు స్వతంత్రించి పెడ్లాడినచో వల దనువా రున్నారా?

దేవ—గురువరా! అది యెట్లు పొసఁగును? నాతండ్రి నన్నుఁ గాదని స్వతంత్రించువాఁడే యయ్యె నేని యపుడే దాశరాజున కావర మిచ్చి యుండును గాని విముఖుఁడై యిచ్చి లోలోనఁ గుంది యుండునా? అతని నిర్వ్యాజపుత్రానురాగమున కదియే నిదర్శనము. కావున నేనే స్వతంత్రించి నాజనకపాదులయభిమతము కొనసాగింతును వినుము.

చ. జననుత! యిప్పుడే ప్రతిన సల్పెద నాయనకోర్కి దీర్ప, నా
ధనఘనరాజ్యసౌఖ్యము తుదం దనుసౌఖ్యము పోవుఁ గాక నే
వెనుకకుఁ బోవ నింకఁ గని పెంచినవారిని గష్టపెట్టు దు
ర్జనుఁ డగువానిజన్మ మొకజన్మమె యాతఁడు నొక్కమర్త్యుఁడే?

యజ్ఞ—(తనలో) ఆహా! కొడుకునకుఁ దగినవాఁడు తండ్రి. తండ్రికిఁ దగినవాఁడు కొడుకు. తండ్రికొడుకుల ప్రేమబంధమిట్లు కదా యుండవలయు? కొడుకును జూచి యతఁడు శరీరసౌఖ్యము విడనాడుట కిష్టపడియె. తండ్రిని జూచి యితఁడు రాజ్యసౌఖ్యము విడుచుట కిష్టపడియె. వెఱ్ఱి వదలక మంత్రి భ్రాంతిపడెను గాని కుమారరాజుసాహసౌదార్యము లెఱుఁగనివాఁడా? సెబాసు కుమారా! నినుబోఁటిస్వార్థపరిత్యాగి యిఁక లోకమునఁ బుట్టఁబోఁడు. (ప్రకాశముగా) కుమారా! నీనిశ్చయమునకు సంతోషపరవశుఁడ నైతిని. వివిధసుగుణముల

కాకరంబై విశ్వము నతిశయించు సౌజన్య మొక్కటియే లోకమున వందనీయము. పితృభక్తిని నీవు శ్రీరామచంద్రునిఁబోల్కి నుభయలోక కీర్తనీయ మగుకీర్తి నొందెదవు గాక.

దేవ—గురూత్తమా! నాయాశయంబు ననురాగముతో నామోదించినందుకు వందనము. ఇఁకఁ గాలవిలంబనము గాకుండ దాశపురమునకుఁ బోవలయు. (శబ్దశ్రవణ మభినయించి తొంగిచూచి) మంత్రియు సభ్యులును సభాగృహమునకు వచ్చిరి. మనము నచ్చటి కేగుదము. (అంత నొక వంకనుండి మంత్రియుఁ గొందఱు సభ్యులును, ప్రవేశించి యథోచితాసనంబుల నుపవసింతురు. నేపథ్యా న్నరితులై వచ్చి యజ్ఞతీర్థులును యువరాజును బ్రవేశింతురు.)

అందఱు—(లేచెదరు.)

దేవ—కూర్చుండుఁడు. (అని యువరాజపీఠ మధివసించును.)

అందఱు—(ఉపవసింతురు)

దేవ—అమాత్యా! విశేషము లేమి?

వసు—(లేచి) కుమారసార్వభౌమా! దేశమం దంతట విజయోత్సవములు జరిగినట్లుగా నయ్యామండలాధికారుల యొద్దనుండి జాబులు వచ్చినవి. ఆయాప్రదేశములనుండి వచ్చినకానుకలు భాండాగారమునకుఁ జేర్పించితిని. ఇంక మనము జయించిన రాజసంస్థానములలో నెల్ల మనచే నియమింపఁబడిన మంత్రి యొక్కొక్కఁడు కొంతకాలము వఱకుఁ దప్పక యుండవలయుననియు నట్టి మంత్రినిర్ణయము కుమారుఁడు కావింపఁ దగు ననియు సార్వభౌములు సెలవిచ్చిరి. (కూర్చుండును.)

దేవ—అవును. నాయనగా రీమాట నాతోఁ గూడఁ జెప్పిరి. ఇది మిక్కిలి యాలోచించి చేయఁదగిన పని. ఇందుకు నే నొక విధాన మూహించితిని గాని సభ్యుల యభిప్రాయముగూడఁ దెలిసికొందము. సభ్యులారా! ఎట్టివా రీమంత్రిపదవులకుఁ దగియుందు రని మీయభిప్రాయము? గురువరా! ముందు మీయభిప్రాయము తెలుపుఁడు.

యజ్ఞ—(లేచి) కుమారసార్వభౌమా! ఆన్వీక్షకీత్రయీవార్తా దండనీతులు చక్కఁగాఁ దెలిసికొని దయాసత్యశౌచములు గలిగిన యుత్తమకుటుంబములోని మధ్యవయస్కులను నియమింపఁ దగు నని నాయభిప్రాయము. (కూర్చుండును)

దేవ—అమాత్యా! నీయభిప్రాయ మేమి?

వసు—(లేచి) యజ్ఞతీర్థులయభిప్రాయముతో నేను నేకీభవించుచున్నాను గాని మధ్యవయస్కు లన్న పద మొకటియుఁ దీసివేయ వలయు నని విన్నవించుచున్నాను.

ఒకసభ్యుఁడు—(ఇంకొకనితో జనాంతికము) ఇతఁ డెందుచేత నీమార్పు గోరెనో తెలిసినదా?

ఇంకొకసభ్యుఁడు—(లేచి) కుమారసార్వభౌమా! ఇట్లు మార్చిన యెడల బూర్వవయస్కులకుఁ గూడ నవకాశము గలుగును. అట్టివారు లోకహితము కనుఁగొనుటలో ననుభవము లేక తొందర పడుదురు. కావున 'ఏ తప్పక' అని చేర్చి మధ్యవయస్కులనే తప్పక నియమింపఁ దగు నన్న యెడల జక్కఁగా నుండునని నాయాశయము. (కూర్చుండును.)

వేఱొకసభ్యుఁడు—(లేచి) కుమారసార్వభౌమా! "ఆన్వీక్షకీత్రయీవార్తా" యనునది తీసివైచినచో సరిపడు నని నా యభిప్రాయము. (కూర్చుండును.)

మఱొకసభ్యుఁడు—(ఇంకొకనితో నపవారితము) ఇతని యభిప్రాయము గ్రహించితివి గదా!

ఇంకొకసభ్యుఁడు—(లేచి) కుమారసార్వభౌమా! నాదొక్క మనవి. మంత్రిపని నయానయములు విచారించుచు సుఖముగా జీతము బత్తెము ననుభవించుట గాదు. విజ్ఞానము వలదా? అర్థానర్థములు ధర్మాధర్మములు తెలియవలదా? ఆన్వీక్షక్యాదులను విడిచినచో నవి యెట్లు తెలియ నగును? మంత్రి సంపూర్ణవిద్యాయుతుఁడై యుండవలయును గాని దండ మొక్కటియే తెలిసి యుండినఁ జాలదు. కావున

'శుక్రబృహస్పతినీతులను జక్కఁగా బఠించి' అని కూడ జేర్చినచో బాగుగా నుండు నని నా యభిప్రాయము. (కూర్చుండును.)

దేవ—ఇంక నెవరైన మార్పులు చేయఁ గోరుదురా?

సభ్యులు—లేదు లేదు.

దేవ—అట్లయిన నిపుడు చెప్పినవారి యభిప్రాయములను బట్టి నాకుఁ దోఁచిన యభిప్రాయమును వ్రాసి చదివెద (వ్రాఁతయభినయించి) అందఱు సావధానముగా వినుఁడు. 'అన్వీక్షకీత్రయీ వార్త్తాదండనీతులు చక్కఁగా నెఱిఁగి శుక్రబృహస్పతినీతులు చక్కఁగాఁ బఠించి దయా సత్యశౌచములు గలిగిన యుత్తమకుటుంబములోనివారిని మధ్యవయస్కులను, కావలసినంతమంది వారు లభింపనిచోఁ బూర్వవయస్కులను సార్వభౌముని సమ్మతిఁ బడసినవారిని నవీనార్జిత సంస్థానములలోఁ గౌరవసామ్రాజ్యపక్ష మంత్రులనుగా నియమింపఁదగును.'' (అని చదివి) ఇది మీ యందఱ మనసున కెక్కినదా?

పెక్కండ్రు—దివ్యముగా నున్నది.

దేవ—అమాత్యా! ఈ పత్రము సార్వభౌముని యొద్దకుఁ బంపుము. (అని యిచ్చును.)

వసు—(గ్రహించి) చిత్తము చిత్తము.

దేవ—ఇంక నేవయిన విశేషాంశములు గలవా?

వసు—నేఁటికి లేవు.

దేవ—(సభ్యులవంకఁ జూచి) అట్లయిన సభ చాలింతము.

సభ్యులు—(లేచి నమస్కరించి వెళ్లుదురు.)

దేవ—అమాత్యా! శీఘ్రముగా దాశపురమునకుఁ బోవలసి యున్నది. (అనుచుండ)

వసు—(సాభిప్రాయముగా యజ్ఞతీర్థులను జూచును.)

దేవ—అట్లు చూచెద వేల ? నా మాట వినుము. కావున నుచిత మైనచతురంగబలమును దగినంతపరివారమును గావలసిన పరికరములను సమకూర్చి ప్రియాణసన్నాహము గావింపుము. గురువరా ! రేపు ప్రయాణమున కనుకూల మయినదే కదా!

యజ్ఞ—పదిగడియల ప్రొద్దెక్కిన తరువాతఁ బండ్రెండు గడియలవఱకు శుభసమయము.

దేవ—అపుడు మనము ముగ్గురముమాత్రము పురోద్యాన చంద్రశాలనుండి బయలుదేఱెదము. ఈ రాత్రియే బలమును బరివారమును వివిధపరికరములతోఁ బంపివేయుము. జయసింహునితో మాత్రము యమునాతీరమందలి నీపారణ్యము నొద్ద విడియు మని చెప్పుము. ఈయుదంతము నాయనగారికే కాదు మఱియెవ్వరికిని దెలియరాదు.

నసు—కుమారభూవరునియాజ్ఞ.

వందిమాగధులు—(తెరలో)

చ. కురుయువసార్వభౌమునియకుంఠితతేజము శీతభానుభా
స్కరుఁ డన లోకమెల్లెడల గాఢతమంబు నణంపఁగా, నిశా
కరునకె కాదు నాకు నిఁకఁ గార్యము లే దనునట్లుగా దివా
కరుఁ డపరాద్రి కేగు నడిగా నరుణుం డరదంబు తోలఁగన్.

దేవ—గురువరా ! సాయంసంధ్యాసమయ మగుచున్నది. మరల రే పుదయమున మాటలాడుకొందము. నమస్కారము.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము

—

శ్రీరస్తు.

ప్రతిజ్ఞాశాంతనవ నాటకము

షష్ఠాఙ్కము.

రంగము:—దాశరాజసభామండపద్వారము.

[ఇరువురు భటులు ప్రవేశించుచున్నారు.]

ఒకఁడు—వీరసేనా! నీవు చూచినయువరాజుగారిని నేనును జూచి వచ్చితిని. అబ్బా! ఆయనతో నెంతమంది వచ్చినారురా! తెల్లవాఱినది మొదలుగా నిప్పటివఱకు నొకనిముస మైనఁ దీఱిక లే కుండఁగాఁ దిరుగుచునే యున్నాను. సేవకు లందఱు డేరాలయొద్దనే యుండుటచే సభామండపమునొద్ద నుండవలసిన దని మంత్రిగారు నాకు సెల విచ్చిరి. అందుచే నిపు డయిన నిచ్చటికి రాఁ గలిగితిని.

వీర—శూరసేనా! నీకంటెఁ దక్కువ తిరిగినవాఁ డెవఁడు? నా యవస్థ నీ కేమి తెలియును? కాళ్లు పడిపోయినవి. ఇంతకు ముందే నేనును వచ్చితిని.

శూర—(లోపలికి వెళ్ళఁబోవును.)

వీర—వెళ్లకు వెళ్లకు.

శూర—ఏమి? రాజుగారు లేరా?

వీర—ఉన్నారు. పిలుచునంతవఱకు నెవరు రాఁ గూడ దని సెల వయినది.

శూర—పోనీ! బ్రతికించినావు. ఆయరుఁగుమీఁదఁ గొంచెము సేపు చతికిలఁబడుదము రా. (ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది ప్రవేశకము.

రంగము:—సభామండపము.

(అంత యథోక్తముగా రాజపీఠ మధివసించి యాలోచించుచున్న దాశరాజు ప్రవేశించును.)

దాశ—(తనలో) ఇది మంచికే వచ్చినదో చెడ్డకే వచ్చినదో! ఏ మయినం గానిమ్ము. ఆరంభించినపని తుదముట్టc జూడవలయుc గాని నడుమ విడువ రాదు. (ఆలోచించి) ఎట్లయినc గన్యాపితృత్వము మిక్కిలి కష్టదాయక మనుట నిక్కము. అయినను నే నిపుడు చేయc దగిన దేమి? ఉపరిచరునియాజ్ఞకు వశ్యుcడను గాని స్వతంత్రుcడను గాను. అతcడు మానవసామాన్యుcడా? కాcడు. మహాముని. మహాముని యననేల? దేవర్షియే యనc దగును. నా కట్టిగట్టిప ట్టుండcగా జం కేల? ఇcకనో—

చ. ఇతcడు కురుక్షమావరునభీష్టమునం దెదురాడువాcడె నా
నితరులు నిందకుం దొడcగ నీ! కడునేడ్తె అతోడ జాహ్నవీ
సుతుcడును గత్తి పట్టుటకుc జూడcగ నీ! వసురాజమానియా
నతి శరణంబుగాc గని మనంబున ధైర్యము పూని యుండెదన్.

కుమారి యింకను రా లే దేమో! (అని వెనుక దిరిగి చూచి) అమ్మా! వచ్చితివా?

సత్య—(ప్రవేశించి తొందరతో) ఏమి నాయనా!

దాశ—ఏమీ తొందరలేదు. నీ కొకమాట చెప్పc బిలిపించితిని. కురుకుమారసార్వభౌముc డగు దేవవ్రతుcడు వచ్చి మనపురము వెలుపల విడిసె.

సత్య—ఔను. పురము వెలుపలc బెద్దసందడి యగుచున్న దని మాలిని చెప్పcగా మేడపై యంత స్తెక్కి చూచితిమి. ఆప్రదేశ మంత

యు నొకపురముగాఁ గనఁబడుచున్నది. అట్లు చతురంగబల సమేతుఁడై రాఁ గత మేమో!

దాశ—మహారాజులు రాజధాని వెడలునపు డిట్లు వివిధపరివారములతో బయలుదేఱుట యాచారమే, కాని యితఁ డిపుడు వచ్చినవిషయమున కింతపరివార మావశ్యకము గాదు.

సత్య—నాయనా! యుద్ధము పొసఁగదు గదా! నా యుల్లము తల్లడిల్లుచున్నది.

దాశ—కుమారీ! కాఁదగిన దెట్లయినఁ గాక మానదు. అందుకు ముందే భయపడ నేల?

సత్య—(సవిచారముగా) నాయనా!

చ. కడుపునఁ గన్నవారలమొగంబు లెఱుంగనినన్నుఁ గూర్మి మీ
కడుపునఁ బుట్టుకూఁతు రనఁగాచితి రందుకు మీకు నే ఋణం
పడియును దానిఁ దీర్పఁగ నుపాయము దక్కదయుఁ బైగఁ బెండ్లికై
యిడుమలు తెచ్చిపెట్టితిఁ గదే యని కుందుచునుంటి భీతితో

దాశ—కుమారీ! ఇందు నీ వేమియు విచారింపఁ బనిలేదు. నీకంటె మా కెవ్వ రున్నారు? మాప్రాణమే నీవు. నీక్షేమమే మాక్షేమము. నీయభివృద్ధికై నే నెట్టికష్టము లైనను భరింప సిద్ధముగా నున్నాను. ఉపరిచరుని యాశీర్వచనముచే నాకోరిక నెఱవేఱుట యొక్కటియే నాకుఁ గావలెను.

సత్య—నాయనా! వారు మనయింటికి వత్తురా? మీరే యక్కడికి వెళ్ళవలయునా?

దాశ—అతఁ డిచ్చటికి వచ్చుటయే ధర్మము.

సత్య—ఇంతకు మున్ను నీవు వారిని జూచి వచ్చితివా?

దాశ—లేదు. వారు పురమువెలుపల విడిసి రని తెలియఁ

గానే యాతిథేయసత్కారము లాచరించి రమ్మని సుమిత్రుని బంపితిని.

సత్య—(తనలో) ఇతఁడు రాజ్యము వదలుకొని తండ్రికోర్కె దీర్ప వచ్చి యుండునా? నిజముగాఁ బితృభక్తిచే నట్లు గావింప వచ్చి యున్నను మనసు నొవ్వకుండునా? ఒకవేళ నతఁడు సద్బుద్ధితో వర మిచ్చినను దక్కినవారు మనసులోనైన నిందింపకుందురా! అకటా! అతనిమొగ మెట్లు చూడఁగలను? చీ! నాపెండ్లి యెంతరచ్చ కెక్కినది? (అని లజ్జచే, తల వంచికొనును.)

దాశ—అమ్మా! దేవవ్రతునిరాక విని నీవు మనసులో నేమి కుందుచుందువో యని యూహించియే నిన్నుఁ బిలిచి చెప్పుచున్నాను. శుభసూచనలు పెక్కగనవచ్చుచున్నవి. సంశయింపకుము.

సత్య—నాయనా! అట్లయిన వారు వచ్చినపుడు మీసంభాషణము వినుటకై యీపక్కగదిలోఁ గూర్చుండ నాకనుజ్ఞ యిమ్ము.

దాశ—సందేహ మేమి? తప్పక వచ్చి కూర్చుండుము.

సత్య—(సలజ్జావిషాదముగా) నాయనా! నాభాగ్య మెట్లున్నదో య ట్లగును. నీవు మాత్రము నాకై నింద పడవల దని కోరుచున్నాను.

దాశ—కుమారీ! ఇఁక సంశయింపక మీరాజనకునిమాట స్మరించుచు ధైర్యముతో నుండుము. సుమిత్రుఁడు వచ్చువేళ యయినది. అచ్చటివార్తలు తెలిసికొందును. నీవు వెళ్ళి తరువాత రమ్ము.

(సత్యవతి నిష్క్రమించును.)

దాశ—ఎవ రక్కడ?

వీర—(ప్రవేశించి) చిత్తము దేవా! సెలవు.

దాశ—మంత్రి వచ్చుచున్నాఁ డేమో చూడుము.

వీర—చిత్తము. (వెళ్ళివచ్చి) అదిగో మంత్రిగారు వచ్చుచున్నారు. (అని వెళ్లును.)

సుమిత్రుఁడు—(ఒకప్రక్కనుండి ప్రవేశించి పరిక్రమించుచుఁ దనలో)

చ. అరసితిఁ గాక ధీరులు కృతాస్త్రులు మన్మథసుందరుల్ దయా
నిరతులు నై నరాజుల ననేకుల నుత్తమలక్షణంబులం
బరఁగినవారిఁ, గాని శమభావము వీరము నేక మైనయీ
కురుయువసార్వభౌముకొనగోటికి సాటి యె వార లందఱున్?

ఆహా! ధీరోదాత్తులహృదయము తెలియ రా దనుట నిజము. బాలారుణప్రభాభాసమానదివ్యలక్షణలక్షితాకారసంపద ప్రతాపమును జూపుచుండఁ బ్రసన్నగంభీరమధురాలాపంబు లమృతమును జినుకుచున్నవి. అట్టివారిచిత్తవృత్తి గనుగొన నెవ్వరితరము? పరిశీలించినచో మంత్రిపురోహితులమాటలం దిసుమంతయైనను గనవచ్చునేమో కాని కంచుకాగడా వేసి వెదకిన నామహారాజకుమారుని పలుకులలో నొకనెర సైనఁ గాన నగునా? ఇది కదా యుదారపద్ధతి! నిండుకుండ తొనఁక దందు రిదియే కాఁబోలు! (ఊహించి) ఔరా! దీనికే నా కాశ్చర్య మగుచున్నది. ఇంకను నామాట నానోటిలో నుండఁగానే నాభావము గ్రహించి "మీరాజు నన్నుఁజూడ వచ్చుట యుచితము గాదు. భోజన మైనవెంటనే మేమే మీరాజును దర్శింప వచ్చుచున్నా" మని యెంతవినయముగా మాటలాడెను? ఎంతటికార్యార్థియైనను సార్వభౌమపుత్రుఁ డింతవినయముగా సంభాషించె నన్నచో నెవ రయిన నమ్ముదురా! (అని ముందు చూచి) రాజు నారాకకై వేచి యున్న ట్లున్నది. (అని సమీపించును.)

దాశ—(చూచి) సుమిత్రా! దేవవ్రతుని జూచి వచ్చితివా? కూర్చుండుము.

సుమి—(కూర్చుండి) చిత్తము. ఇపు డక్కడినుండియే వ్చచితిని.

దాశ—కౌరవరాజు కన్నె నడిగి వెళ్ళినపిదప నింతదనుక నతని

యొద్దనుండి యేవార్తయు లేదుగదా? అట్టియెడ దేవవ్రతుఁడు చతురంగబల సమేతుఁడై రాఁ గత మేమో గ్రహించితివా?

సుమి—అది రాజధర్మము. (ఆలోచించి) అదిగాక చతురుపాయములలో నెద్దాన నైనఁ దమకార్యము నిర్వహించుకొనుటయు క్షాత్ర ధర్మమే.

దాశ—ఒక్కదానోపాయమున సాధింపఁ దగినకర్జమునకు దండోపాయ మెత్తుట ధీరోదారధర్మమా?

సుమి—అట్లుకాదు. ఆరాజకుమారుని మొగము చూడఁగా నా కతఁడు సకలధర్మములు చక్కఁగాఁ దెలిసిన వాఁడని తోఁచినది.

దాశ—అతని మాటలలోఁ గాని సన్నిధానవర్తులమాటలలోఁ గాని యతని రాకను దెలుపు సూచన లేవయినఁ గాన వచ్చినవా?

సుమి—లేదు లేదు.

దాశ—అట్లయిన, నిప్పటికి వారిభోజనము లై యుండును. మన మొకమాఱు వారిని జూచి వచ్చుట యుచిత మేమో!

సుమి—భోజన మయినవెంటనే మేమే వచ్చెద మని యా మహారాజపుత్రుఁడు సెలవిచ్చె.

(అంత నేపథ్యాభిముఖముగ ప్రతిహారి ప్రవిష్టుఁడై)

ప్రతీహారి—రాజోత్తమా! హస్తినాపురయువసార్వభౌములు వచ్చుచున్నారు. (అని వెళ్లును.)

దాశ—మనము వారి కెదురేగుట మంచిది.

(అంత దేవవ్రతుఁడు మంత్రి పురోహితులు కొందఱు

సామంతులు ప్రవేశింతురు.)

దాశ—సుమి—(ఎదురై యభివాదనపూర్వకముగా) దయచేయుఁడు. ఉచితాసనములు చూపుదురు. (అందఱు నుపవసింతురు.)

దాశ—(పక్కకుఁ జూచి తనలో) చెప్పినట్లు కుమారి వచ్చి యుండును. (అని కూర్చుండును.)

సత్య—(యథోక్తముగాఁ బ్రవేశించి కిటికీ సందునుండి దేవవ్రతుని జూచి తనలో) ఆహా! ఇతని మొగమున క్షాత్రతేజ ముట్టిపడుచున్నది. నిజముగా నితఁడు గురుభక్తిచే వర మిచ్చినను నే నీతని మొగము చూడఁ గలుగుదునా ?

సుమి—(అందఱకుఁ బుష్పములిచ్చి కూర్చుండును.)

దేవ—దాశభూవరా! నీచేసిన సత్కారమున కెంతయు సంతసించితిమి.

దాశ—సార్వభౌమకుమారా! భారతవంశపావనులును వశీకృత సకలభూవరులును నగు మీ రాకచే నాజననము నాభవనముగూడఁ బవిత్రము లైన వని నే నానందించుచున్నాను.

దేవ—ఇది సత్కారవచనపద్ధతి. ప్రకృత మనుసరింతము. ఇందులకు నావచ్చినపని యెఱిఁగియే యుందువు. అయిన నీసభాసదులు వినుచుండఁ దెలియఁ జెప్పెద.

మ. విను మాసేతు హిమాచలాంతమహితోర్వీనాథనాథుండు శం
    తనుభూమీరమణుండు సత్యవతిఁ బెండ్లాడంగఁ గాంక్షించె శాం
    తనవుం డాయనకోర్కె దీర్ప నిను సందర్శింపఁగా వచ్చె నిం
    దును నందు న్నుతి నొందునీకృతికి నుద్యోగింపుమీ వేడ్కమై.

దాశ—కుమారసార్వభౌమా! మీరు వయసునఁ జిన్నలయ్యు బుద్ధిని మాకంటెఁ బెద్దలు. సర్వధర్మములు దెలిసినవారు. కార్యాకార్యంబులు నిర్ణయింపఁ మిమ్ము బోలినవారు లేరని విను చుందుము. అట్టి నీతిపారంగతు లగుమీరు జనకుని నిమిత్తము కన్యార్థులరై వచ్చుటకంటె నాకు మహాభాగ్యము వేఱొండు గల్గునే?

ధన్యుఁడ నైతిని. మీయభిలషితం బయిన యీయర్థము పూర్వమే గురు జననిశ్చిత మైన తెఱఁ గొక్కటి గలదు. ఆకర్ణింపుఁడు.

మ. మును వసురాజమాని తనముద్దులపట్టిని జూడ నాగ్రహం
బున కరుదెంచి సత్యవతిమూర్ధము మూర్కొని నాకుఁ దెల్పె శం
తనునకుఁ గాక యన్యవసుధాపతి కీయకు మీకుమారి నం
చనఘవచస్కుఁ డాఢ్యుఁ డగునమ్మునియానతి కడ్డ మున్న దే?

దేవ—అవు నవును. వాచంయములు త్రికాలవేత్తలు నగు మహర్షులపలుకు లమోఘములు.

దాశ—కురువీరకుమారా! అది గాక కౌరవవంశంబుతోడిచుట్ట ఱిక మనేకజన్మార్జితపుణ్యంబునఁ గాక యూరక సంభవించునా?

సుమి—సత్యము సత్యము.

గీ. కులము శీలంబు విద్యయుఁ గలిమి మున్న
గలుగునత్తగుణంబులఁ జెలఁగువరుని
గోరి చేయంగఁ దగియుండ ఁ, గోరకుండ
యోగ్యుఁ డాతండు దొరకుట భాగ్యము గద !

దేవ—అమాత్యవరా! అట్లయినఁ గులోచితమర్యాద కను గుణంబుగాఁ గన్యాదానసమయం బర్థింపుము.

వసు—(తనలో) కుమారా! ఎఱిఁగి యుండియు "పాపాల కెల్లభై రవుఁ" డన్నట్లు లేదనిపించుకొనుటకు నన్ను నియోగించితివా? కానిమ్ము. (ప్రకాశముగా) దాశరాజా! మామంత్రి మాటలు, మా యువరాజు మాటలు వింటివిగదా! వసురాజమానియంగీకారము నీమా టలవలననే తెలియున్నది. ఇఁకఁ జెప్పఁదగిన దే మున్నది? వివాహసం భారముతోఁ గన్నెను హస్తినాపురమునకుఁ బంపుటయేమా యభీష్టము.

దాశ—ఇదెంతయు నాకుఁ బ్రియము. కాని నాదొక్క కోరిక. కురుకుమారరాజా! ఈసభ్యులసమక్షంబున మీతో నొక్కటి విన్నవించుచున్నాను. క్షమించి సావధానంబుగాఁ జిత్తగింపుఁడు.

మ. తనవంశంబు తరింపగా వరునిగోత్రిం బెండుఁ బెంపారఁ జే
 సినదానంబునకున్ వధూసుతుఁడు వాసిం గాంచినన్ దాత మే
 ల్గను, సాపత్న్యపుదోష మిం దెనయఁ దత్కార్యంబు సిద్ధించునే?
 యనఘా! యందుకు నష్ఠ లేమికి నుపాయం బీవె చింతింపుమా.

వసు—(తనలో) నీరాజ్యము సత్యవతీపుత్రునకు వదలికొనుమని ప్రత్యక్షముగా నీమహావీరునితో ననుట కీధీరునకు నోరెట్లు వచ్చెనో?

యజ్ఞ—(తనలో) ఆహా! ఏమి కాలవిపర్యయము? సకలసామంతభూపాలమకుటమణికాంతివిరాజితపాదారవిందుఁ డగుశాంతనవుఁ డీజాలరివాని నడుగవచ్చుట, కుంజరయూథము దోమకుత్తుకఁ జొచ్చుట కాదే! ఎంతటివాని కెంతగతి పట్టినది?

సత్య—(తనలో) అబ్బా! ఇతఁ డేమనునో కదా!

దేవ—దాశరాజా! నాజనకునిమనోరథంబుతో నీకోర్కియుఁ దీర్ప సిద్ధముగా నున్నాను. ఓసభాస్తారులారా! వినుఁడు.

చ. భరతకులాగ్రగణ్యుఁడు విభాకరతేజుఁడు కీర్తిశాలి మ
 ద్గురునిమనోరథంబు సమకూర్పఁగ నేసమయం బొనర్తు న
 క్కురుపతికిన్ వసుప్రభునికూఁతురు గాంచినవాఁడె లోకు లె
 ల్లరకును రాజు కౌరవకులస్థితికారుఁ డతండె యయ్యెడున్.

అందఱు—ఆహా హా! ఈమహాత్ముని స్వార్థపరిత్యాగము నిరుపమానము.

సత్య—(తనలో) కుమారా! ఇట్టిమహోదారుఁడవు నీవు రా

జ్యము చేయుట కోర్వలేక కోరిన ట్లయినది. (విషాదమభినయించును.)

యజ్ఞ—కుమారా! సవతితల్లికొడుకునకు స్వరాజ్యము విడిచిన నీవు త్రేతాయుగాలంకారభూతుఁ డగు శ్రీరామచంద్రునిమాడ్కి ద్వాపరయుగభూషణుఁడవై యుభయలోకకీర్తనీయుఁడ వగుదువు.

సభ్యులు—సత్యము సత్యము. దేవవ్రతుఁడు శ్రీరాముని యపరావతారమే.

దాశ—సార్వభౌమనందనా! ఈసభ్యులు సెల విచ్చినదాని కంటె నీస్వార్థత్యాగమును గొనియాడఁ జాలను. కాని నా దింకొక్క మనవి—

సత్య—(తత్తఱముతోఁ దనలో) ఇం కేమి నాయనా! నీకోరిక దీఱెఁ గదా!

సభ్యులు—(నివ్వెఱపడి చూతురు.)

దాశ—చ. సదయుఁడు లోకసమ్మతుఁడు సత్యము తప్పనివాఁడు నీతికో
విదుఁ డని విందు నిన్నుఁ గురువీరకుమార! భవత్తనూభవుల్
మదిమది నుండి నీప్రతిన మన్ననచేయుదు రొక్కొ? యెట్టికీ
డొదవక యుండ నివ్వరము సున్నతి నొందఁగఁ జేయు నేర్పునన్.

వసు—(నిశ్చేష్టుఁడై యువరాజు మొగము చూచును)

సత్య—(తనలో) అయ్యో నాయనా! ఇదెక్కడి కోరిక! చెఱకు తీపి గదా యని వేళ్ళతో సమలుట తగునా? ఎంత పని చేసితివి? ఇట్లయిన లోకము హర్షించునా? దైవము సహించునా? పుట్టఁబోవువారికి బుద్ధులు గఱపెడివా రున్నారా? అకటా! దీన నేమి రానున్నదో కదా!

యజ్ఞ—(తనలో) అకటా! యీకోరిక గాంగేయుని బ్రహ్మచర్యమును గంటఁ జూడక మానదు. జనకుని మనోరథము నెఱవేర్ప

దీక్షఁ బూని వచ్చిన యీధీరుఁ డిపుడు వెనుక జంకఁ డనుట నిక్క-
ము. మనమిపు డే మయినఁ జెప్పుటయుఁ దగదు. చెప్పినను లాభము
గలుగదు. (ఆలోచించి) ఆహా! కుమారా! నీవంటి మహావీరునకు
రాజ్యలక్ష్మియు గృహలక్ష్మియుఁ గూడ లేకుండవలయునా? అకటా
యెంతమాట! ఇపు డేమి చేయుదును? అయిన నొకమాట యని
యెద. ఊరకుండ నేల? (ప్రకాశముగా) ఏమిదాశరాజా! నీకోరికలకు
హద్దు లేదు గాఁబోలు! తొలుత నీ వడిగినపుడే శంతనుఁడు రాజ్య
వర మిచ్చిన యెడల నిట్లు మరలఁ గోరువాఁడవా? తోఁచిన ట్లెల్లఁ
గోరుట ధర్మమా? మరల నాలోచింపుము.

వసు—ధీవరరాజా! సకలక్షత్రియశిరోరత్న మగు శంతనుఁడు
నీతనయను గోరినవాఁడు. అఖిలభూపతులయవలేప మణఁచి జనకుని
సార్వభౌముని జేసిన పరశురామశిష్యుఁడు దేవవ్రతుఁడు ని న్నడుగ
వచ్చినవాఁడు. సమయాసమయవిచక్షణులీయున్న సభాసదులు, ఇఁక
నీవు నుచితానుచితజ్ఞుఁడవై మున్ను కోరినదానితో సంతసించుట
యుక్తము. ఇదియుం గాక యిం కొకటి వినుము—

చ. అడిగినయప్డు డాకురులాగ్రణి నీవర మీయఁ డంచు ని
ప్పుడు కురురాట్తనూభవు నపూర్వవరంబు మ ఱొండు వడ్డిగా
నడుగుట పాడి యౌనె? మనసైన తెఱంగునఁ గోరవచ్చునే?
పుడమిని నీకుఁ ద క్కొ-రుఁడు పుట్టనివారికి బుద్ధి చెప్పునే?
కావున దారి తప్పిపోకుము. ఆలోచించికొనుము.

సభ్యులు—సత్యము సత్యము. దాశరాజా! నీవు మరలఁ
దెచ్చినప్రసంగ మప్రస్తుతము. లోకమున నెవఁడు శాశ్వతముగా
నుండును? భవిష్యత్తును బంధించుట మనతరమా? ఈ రెండవకోరిక
యుచితము గాదు.

సత్య—(తనలో) అయ్యో! ఎంత పని పుట్టెను? ఇపు డైన నితఁ డూరకొనునా? ఇన్ని హిరణ్యాక్షువరములతోఁ బెండ్లి యైన నేమి ప్రయోజనము! ఇపు డేమి గతి?

దాశ—(దోసిలి యొగ్గి) ఆర్యులారా! ఆలోచన కేమున్న ది?

ఉ. ఆడినమాట తప్పనిమహాత్ముఁడు శాంతనవుం డతండు నే
వేఁడినకోర్కి చక్క నెఱవేర్చిన వేఱొకమాట పుట్టు నం
చోడదు నా మనంబు, తమయుత్తమదానము గట్టిచేయ వె
న్కాడుదురే వదాన్యు లిది యవ్వరభాగము గాక వేఱొకో?

దేవ—(లేచి) ఆర్యులారా! వందనము. మీ రూరకుండుఁడు. ఓసభాసదులారా! ఓసకలదేవతలారా! ఓనిఖిలమహర్షులారా! వినుఁడు.

చ. వ్రతముల కాది యంతరరివర్గవిభేది శమాదిషట్కసం
గతిహితవాది సంసరణకష్ట మెఱుంగఁగ నీనిదాది స
ద్గతిమణివేది చిత్తగజదర్పవిమర్దనసాది యైన శా
శ్వత మగు బ్రహ్మచర్యమును సల్పఁగ నేను బ్రతిజ్ఞ చేసితిన్.

(తెరలో మంగళధ్వని, దేవవ్రతునిపైఁ బుష్పవృష్టి గురియును.)

సభ్యులు—ఆహాహాహా!! (అని లేచెదరు.)

(తెరలో) మాలినీవృత్తం

జయతు జయతు గంగాశంతనూర్వీశపుత్రః
ఫలతు ఫలతు తస్య బ్రహ్మచర్యవ్రతం చ
భజతు భజతు కీర్తిం బ్రహ్మలోకప్రసిద్ధాం
భవతు భవతు సోఽయం బాలకో భీష్మనామా.

సత్య—(అత్యాశ్చర్యముతోఁ దనలో) ఆహా! ఇతఁడు మందాకినీ నందనుఁడా?

సభ్యులు—ఆహా ! కౌరవవంశపావనా ! జయము జయము,

ఆకాశమున గీర్వాణులు నిన్నభినందించుచున్నారు. మహాత్మా! గాంగేయా! భీష్ముఁడ వని దేవతల పొగడ్త కెక్కితివి. దేవస్తుతా దేవవ్రతా! నీ కీర్తి ముల్లోకంబులఁ గీర్తనీయ మగుఁ గాక. నిన్నుఁ బోలిన సార్థత్యాగి యింకఁ బుట్టఁబోఁడు..

సత్య—(మనోవేదన నభినయించి తనలో) హా! దైవమా! ఇట్టిలోకోత్తరచరితుఁ డగు కుమారున కిహలోకసౌఖ్య మిసుమంతయు లేకుండఁ జేసితివా? అకటా!

చ. సనకసనందనాది మునిసంస్తవనీయచరిత్రి పుత్ర! పొం
దినపరమవ్రతంబునఁ బ్రతిక్రియ చేయఁగఁ జాల నింకఁ జే
రున కొకఁ డెవ్వఁడే నరవరుం డను మాటయ కల్గుఁ గాని యీ
వననిధివేష్టితోర్విపరిపాలన మీవె యొనర్తు వెన్మొయిన్.

యజ్ఞ—సీ. వేదచోదితధర్మవిధు లాచరింపఁగ
నాశ్రయం బైన దేయాశ్రిమంబు
ముఖ్య మైనపితౄణమున విముక్తిని జెంద
నాశ్రయం బైన దేయాశ్రమంబు
ఇహలోకసౌఖ్యంబు లెల్లను జవి చూడ
నాశ్రయం బైన దేయాశ్రిమంబు
సార్వలౌకికభూతజాతాభిలాషకు
నాశ్రియం బైన దేయాశ్రిమంబు

గీ. ఆత్మగతిమూల మాగృహస్థాశ్రిమంబు
తండ్రికోరిక దీర్పఁగఁ దలఁచి విడిచి
శాశ్వతబ్రహ్మచర్యంబు సలుపఁ బూనె
నిరుపమానుండు మందాకినీ సుతుండు.

సభ్యులు—నిర్జరస్తూయ మానమహిమా! మహాత్మా! భీష్మ

నాయనా! నమస్కారము. నీసహవాసమున మాజన్మము పావన మైనది.

నను—కుమారా! రాజ్యహీనుఁడవె కాక, కళత్రహీనుఁడవు గూడ నైతివా? (విషాద మభినయించును.)

సభ్యులు—భగవదనుగ్రహ మిట్టున్నది కాఁబోలు! (విచార మభినయింతురు.)

భీష్ముఁడు—(దోసిలి యొగ్గి) ఆర్యులారా!

చ. తొలఁగె ధరాభరానహనదుఃఖము తోడితనూవికారముల్,
తలఁగెను ఘోరసంసరణతాపముతోడ మనోవికారముల్,
కలిగె సుఖం బమర్త్యులయకారణజాతమహానురాగముం
దెలిసె, విషాద మేల యిటు? నీనను చేయుఁడు మీకు మ్రొక్కెదన్.

నను, సభ్యులు—ఈపరమవ్రతమున లోకారాధ్యుఁడవై వెలయుదువు గాత.

యజ్ఞ—కుమారా! భీష్మా! అమరులు నిన్నుఁ బొగడుట యఖిలలోకములు పొగడుటయే. ననుబోఁటి బ్రాహ్మణులకుఁ గూడ మనోనిగ్రహమున నీవు గురుఁడ వైతివి. నీయౌదార్యము జగదుదాహరణము. నీవు గురుహితార్థ మగుట బ్రహ్మచారి వైనను నీ కన పత్యదోష మంటదు. పుణ్యలోకములు గలుగఁగలవు. ఓసభాసదులారా! కుమారభీష్ముఁడు బ్రహ్మచర్యవ్రతి మూనుటకు మనము వగవఁ బని లేదు. ఈతనిజ్ఞాననేత్ర మీవ్రతమున మఱియు వికసించును. ఇతఁడు చిరకాలము లోకహితార్థజీవనుఁడై మర్త్యలోకమును బవిత్రముఁ జేయుఁ గాత.

అందఱు—జయము జయము భీష్మా! మహాత్మా! లోకవంద్యా! జయము.

సత్య—(తనలో) అవురా! ఇతనియౌదార్య మతిమానుషము. ఇతని నిరీహ యనుపమానము.

చ. గురుజనభక్తి రాజ్యమును గోల్పడి పెండ్లి పరిత్యజించి ని
ర్జరనరతాపసేంద్రులప్రశంసకు నెక్కితి వో కుమార! నీ
చరితము లోకమందు రవిచంద్రులమాడ్కి వెలుంగుఁ గాక, సు
స్థిరమతితోఁ బ్రజాహితము చేయు మిఁకం జిరకాలజీవివై.

దాశ—కుమారీ! ఇట రమ్ము.

సత్య—(సిగ్గుచేఁ దలవంచికొని వచ్చును.)

దాశ—(చేరఁదీసి) ఓసభాసదులారా! వినుండు

చ. నరవరసన్నిధానమున నాకనివాసులు చూచుచుండఁగాఁ
గురుకులభూషణుండు నయకోవిదుఁడై తగుశంతనుక్షమా
వరునకు రాణి గాఁగ ననవద్యగుణాభరణాభిరామ నీ
సురభిళగాత్రి సత్యవతి శుద్ధమనస్కుఁడనై యొసంగితిన్.

సభ్యులు—పరమానందము. పరమానందము. (కరతాళధ్వని)

భీష్మ—దాశభూవరా! నీయనుగ్రహమునఁ గృతార్థుఁడ నైతిని. (సత్యవతిని జూచి) అమ్మా! నమస్కారము.

సత్య—కుమారా! ప్రజానురంజకుఁడవై చిరకాలము జీవింపుము.

భీష్మ—దాశరాజా! నాపని సార్థకమైనది. మే మందఱము ధన్యుల మైతిమి. ఇఁక మాతల్లిని దోడ్కొని మేము హస్తినాపురమున కేగుట కనుజ్ఞ యిమ్ము.

దాశ—కురుకుమారసార్వభౌమా! ఇంక నీ కేమి కావలయును?

భీష్మ—నా కేమియు లోపము లేదు.

సీ. మాతల్లికరుణచే మహనీయమునిసేవ
నెఱపి విద్యల నెల్ల నేర్చుకొంటి
మాతండ్రిదీవన మూలఁత గా సామ్రాజ్య
మిల నాల్గు దిక్కుల నిలుపఁ గంటి
దైవయోగమున నాత్మజ్ఞానమునకు మా
ర్గం బైన బ్రహ్మచర్యంబు గంటి
బృందారకులు నన్ను భీష్ముఁ డంచు వచించు
నమృతవాక్కులు వీనులార వింటి
గీ. భవదనుగ్రహమున నేను భక్తియుక్తి
నెదఁ దలంచినపని నిర్వహించు కొంటిఁ
గౌరవకులంబు లోకవిఖ్యాతిఁ గాంచె
సకలవిధముల నామది సంతసించె.

కాని యొకటి మాత్రము కోరఁ దగియున్నది.

మంగళమహాశ్రీవృత్తము. (భరతవాక్యము.)

భారతధరిత్రి యనపాయ యయి సస్యఫలభాగ్యగరిమంబు గనుఁగాతన్
ధీరుల యుదారుల సుధీమణులపొందికను దేశ మభివృద్ధిగ నుఁగాతన్
సూరిమి చెలంగ నొడఁగూడి ప్రజ యెల్లఁ దనకోరికలసిద్ధి గనుఁగాతన్
వీరరసకావ్య మగుభీష్మునిప్రతిజ్ఞ కృతవిద్యజనహృద్య మగుఁ గాతన్.

(అని యందఱు నిష్క్రమింతురు.)

ఇది షష్ఠాఙ్కము.

ప్రతిజ్ఞాశాంతనవనాటకము సమాప్తము.

—x—

రాజ[illegible]ముద్రాక్షరశాల, రాజమండ్రి.